

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో

ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు : fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-4-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 78 పేజీలు: 12 వెల: 8.00


ఐఎఎస్ అధికారుల బదలీ

హర్మూజ్ జలసంధి మళ్లీ మూసివేత

2లో

బిల్లును ఓడించి మహిళల స్వప్నాలను చిదిమేశారు..

రిజర్వేషన్ల కోసం మహిళలు 40 యేళ్లుగా ఎదురుచూస్తున్నారు

పార్లమెంటులో ఏం జరిగిందో దేశం మొత్తం చూసింది

విపక్షాలు చేసిన తప్పునకు నన్ను క్షమించండి

మహిళా లోకం వారిని శిక్షించి తీరుతుంది

జాతినుద్దేశించి ప్రధాని మోడీ

# మహిళలకు క్షమాపణ చెబుతున్నా..



శనివారం జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

నారీశక్తిని అడ్డుకోవాలని విపక్షాలు యత్నించడం బాధాకరం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించి విపక్షాలు తప్పుచేశాయని ప్రధానిమోడీ ధ్వజమెత్తారు. బిల్లు అమలు చేయనందుకు మహిళలను క్షమాపణ కోరుతున్నానన్నారు. మహిళా రిజర్వేషన్లకు తాము కట్టుబడి ఉన్నామని, కొందరు మాత్రం నారీ శక్తిని ఎదగకుండా మహిళల స్వప్నాన్ని చిదిమేశారని, బిల్లును ఎలా అడ్డుకున్నారో దేశం మొత్తం చూసిందన్నారు. అన్ని రాజకీయపార్టీలతో తాను స్వయంగా మాట్లాడానని, బిల్లుకు మద్దతివ్వాలని స్వయంగా కోరానని, మహిళా రిజర్వేషన్ల పరంగా అవసరమైతే మీరే ఆ క్రెడిట్ తీసుకున్నా పర్వాలేదని చెప్పానని గుర్తుచేసారు. అయినా కూడా కుటుంబ రాజకీయ పార్టీలు ఈ బిల్లును అడ్డుకున్నాయని ఆవేదన వ్యక్తంచేసారు. దేశ మహిళాలోకానికి క్షమాపణలు చెపుతున్నానని మోడీ పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలు తమకు చేసిన అవమానాన్ని మహిళలు ఎన్నడూ మర్చిపోరు, మహిళా మనసులో వాళ్లు చేసిన పని ఎప్పటికీ నిలిచిపోతుందని, మహిళ రిజర్వేషన్ల బిల్లును అడ్డుకున్న నాయకులకు క్షేత్రస్థాయిలో మహిళలే సమాధానం చెప్తారని ప్రధాని అన్నారు. కొందరికి దేశం కంటే రాజకీయాలే ఎక్కువని కానీ తమకు మాత్రం దేశ ప్రయోజనాలే ముఖ్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. పార్లమెంటులో ముందురోజు జరిగిన వ్యవహారంపై ఆయన శనివారం జాతినుద్దేశించి ప్రసంగించారు. ఆ క్రమంలోనే విపక్షాలపై ఆయన విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, సమాజ్‌వాదీ వంటి కుటుంబ వారసత్వ పార్టీలు బిల్లుకు వ్యతిరేకంగా చప్పట్లు కొట్టి మహిళల ఆత్మాభిమానంపై దాడి చేశాయన్నారు. మహిళా రిజర్వేషన్లను ఆపి సంబరాలు చేసుకున్నారని మండిపడ్డారు. వారిని మహిళా లోకం

>>2

# మరో 2 రైల్వే లైన్లు



రూ.9,889 కోట్లతో నిర్మాణానికి కేంద్రం ఆమోదం

198 కి.మీ మేర నిడదవోలు, దువ్వాడ మధ్య నిర్మాణం

గోదావరిపై మరో వంతెన

కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** నిడదవోలు-దువ్వాడ మధ్య మూడు, నాలుగు రైల్వే లైన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. మొత్తం 198 కిలోమీటర్ల నిర్మాణానికి 9,889 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఎక్కువ రద్దీ ఉన్న చెన్నై- హౌరా మధ్య నాలుగు లైన్లు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏపీలోని తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖ జిల్లాలను కవర్ చేస్తుందని పేర్కొన్నారు. ఈ మార్గం సామర్థ్యం ఇప్పటికే 130 శాతానికి చేరుకోవడంతో తరచూ రద్దీ, ఆలస్యం పెరుగుతోందని తెలిపారు. దేశవ్యాప్తంగా కొత్త రైల్వే ప్రాజెక్టులు, విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అందులో భాగంగా నిడదవోలు -దువ్వాడ మధ్య మూడు, నాలుగు రైల్వే లైన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. ఎక్కువ రద్దీ ఉన్న చెన్నై హౌరా మధ్య నాలుగు లైన్లు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏపీలోని తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖ జిల్లాలను కవర్ చేస్తుందని పేర్కొన్నారు. ప్రాజెక్టులో భాగంగా గోదావరి నది మీద 4.3 కిలోమీటర్ల రైలు వంతెన, 2.67 కిలోమీటర్ల వయాడక్ట్, 3 బైపాసులు నిర్మాణం జరగనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. తూర్పు తీరంలోని విశాఖ, గంగవరం, మచిలీపట్నం, కాకినాడ ప్రధాన పోర్టులకు అనుసంధానం పెరుగుతుందని వివరించారు. అన్నవరం, అంతర్వేది, ద్రాక్షారామం వంటి కీలక ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలకు ఎక్కువ అనుసంధానం పెరుగుతుందని స్పష్టం చేశారు. రోడ్డు రవాణాతో పోలిస్తే ఏటా సుమారు రూ.1,150 కోట్ల మేర ఆదా అవుతుందని, డీజిల్ కాలుష్య

>>2

# అమరావతి రైతులకు పదేళ్లు కౌలు



శనివారం అమరావతి రైతులతో సీఎం చంద్రబాబు నాయుడు

రూ.40వేల చొప్పున చెల్లిస్తామన్న సిఎం చంద్రబాబు

వారి త్యాగాలను ప్రభుత్వం మరువదు..

ఒక్కో కుటుంబానికి రూ.1.5లక్షల వ్యవసాయ రుణమాఫీ

యేడాదికి రూ.3వేలు కౌలు హెచ్చింపు

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రైతుల త్యాగాలను ప్రభుత్వం ఎన్నటికి మరవదని ఏపీ చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. వారి చేయూతతోనే అమరావతి విశ్వనగరంగా ఎదుగుతుందన్నారు. అమరావతి రైతులకుఎకరానికి 40 వేల చొప్పున పదేళ్లపాటు కౌలు చెల్లిస్తామని రాజధాని రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఒక్కో కుటుంబానికి 1.50 లక్షల మేర వ్యవసాయ రుణ మాఫీ చేయనున్నట్లు రెండో విడత భూ సమీకరణపై రాజధాని రైతులతో సమావేశమైన సీఎం చంద్రబాబు వెల్లడించారు. సీఎంతో భేటీలో తాడికొండ, పెదకూరపాడు నియోజకవర్గాలకు చెందిన 10 గ్రామాల రైతులు పాల్గొన్నారు. శనివారం తొలిగంటల వరకు ఈ సమావేశం జరిగింది. రెండో విడత భూ సమీకరణకు భూములిచ్చిన రైతులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కౌలును ప్రకటించారు. అంతేకాకుండా ఏడాదికి రూ. 3 వేలు చొప్పున కౌలును పెంచేందుకు అంగీకరించారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులెవరికీ అన్యాయం జరగదని సీఎం చంద్రబాబు రైతులందరికీ హామీ ఇచ్చారు. ఈ భూముల్లో ప్రపంచస్థాయి రాజధాని నగరాన్ని నిర్మించే బాధ్యత తనదని చెప్పారు. రైతులే బ్రాండ్ అంబాసిడర్లుగా మారి భూసమీకరణ ప్రక్రియను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సీఎం కోరారు. హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ నిర్మాణం, అదే విధంగా ఆ తర్వాత ఆ ప్రాంతాన్ని సైబరాబాద్‌గా అభివృద్ధి చేయడంతో అక్కడ జరిగిన అభివృద్ధి, అప్పట్లో రూ.లక్షల్లో ఉన్న భూముల విలువ ఇప్పుడు రూ.కోట్లలోకి చేరడం వంటి పరిణామాల్ని సీఎం చంద్రబాబు ఉదహరించారు. అదే రీతిలో అమరావతి సైతం అంతకుమించి అభివృద్ధి చెందుతుందని సీఎం తెలిపారు. అమరావతికి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకూడదనే చట్టబద్ధత కల్పించామని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని భూ సమీకరణకు సహకరించాలని రాజధాని రైతులకు సీఎం చంద్రబాబు కోరారు. కేంద్రం పూర్తి సహాయ సహకారాలు అందించడంతో అమరావతి నిర్మాణం మరింత రెట్టింపు వేగంతో జరుగుతోందని చంద్రబాబు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎండ్రాయి, పెదమద్దూరు, వైకుంఠపురం, కర్లపూడి, పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాలకు చెందిన 70 మంది

>>2



## డి.సిఎం పవన్‌కు శస్త్రచికిత్స

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రికి పవన్‌కు శనివారం సాయంత్రం శస్త్రచికిత్స జరిగింది. శుక్రవారం ఉదయం తన అధికారులతో పాలనాపరమైన విషయాలపై చర్చిస్తున్న సందర్భంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొద్ది నెలలుగా ఆరోగ్యపరంగా పవన్ కల్యాణ్ ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆయన వ్యక్తిగత వైద్యుల సలహాతో శుక్రవారం అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకుని ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలతోపాటు ఎం.ఆర్.ఐ. కూడా నిర్వహించారు. వాటిని పరిశీలించిన వైద్యులు శస్త్ర చికిత్స చేయవలసి ఉంటుందని నిర్ణయించి, శస్త్రచికిత్స చేశారు. వారం నుంచి పదిరోజులపాటు విశ్రాంతి తర్వాత ఆయన అధికారిక పాల్గొనవచ్చని డాక్టర్లు తెలిపారు. అయితే దీర్ఘకాలం తగిన జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుందని, పూర్తి స్వస్థత చేకూరడానికి ఎక్కువ కాలం పడుతుందని డాక్టర్లు చెప్పారు.

# పరిమళించిన మానవత్వం



శనివారం హైదరాబాద్‌లో చిన్నారి పునర్విక‌ను పరామర్శిస్తున్న మంత్రి లోకేష్

పునర్వికకు పునర్జన్మ

దాతల దాతృత్వంతో రూ.16కోట్ల ఇంజెక్షన్

విదేశాల నుంచి తెప్పించేందుకు మంత్రి లోకేష్ సాయం

హైదరాబాద్‌లో మంత్రి సమక్షంలో ఇంజెక్షన్ ఇచ్చిన వైద్యులు

చిన్నారి క్షేమం: మంత్రి లోకేష్

**కర్నూలు, ఏప్రిల్ 18ప్రభాతవార్త:** ప్రపంచంలో స్వార్థం, ఈర్ష్య, ద్వేషాలు నిండిపోయాయని భావిస్తున్న సమయంలో మానవత్వం ఇంకా బ్రతికే ఉందని నిరూపించిన సంఘటన ఇది. యేడాది వయసున్న చిన్నారికి భయంకరమైన రోగం, కోట్లు ఖర్చు పెడితేగాని నయం కానీ వైనం. కోటి రూపాయలు అంటేనే.. అమ్మో అని పేద కుటుంబం. అలాంటి కుటుంబంలో జన్మించిన చిన్నారి పునర్విక కు 16 కోట్ల రూపాయల విలువ చేసే ఇంజక్షన్ వేయించాల్సిన పరిస్థితి. ఆటపాటల సరదాలతో అలరించి సోషల్ మీడియా ఆ సమస్యను భుజానికి ఎత్తుకుంది. అంతే సోషల్ మీడియా వేదికగా ఎన్నో దయార్ద్ర హృదయాలు స్పందించాయి, సాయం చేశాయి.. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 10 కోట్ల రూపాయలు అందించాయి. ప్రభుత్వం సైతం కదిలింది. మంత్రి నారా లోకేష్ రూ.6 కోట్లు అందించడమే కాక తన వ్యక్తిగత సిబ్బందిని రంగంలోకి దింపి.. చికిత్స చేయించాడు. విదేశాల నుంచి కోట్ల రూపాయల విలువ చేసే ఇంజక్షన్ వచ్చింది. వైద్యులు చిన్నారికి అందించారు. పునర్వికకు పునర్జన్మ వచ్చింది. ఓ మంచి పని చేయడంలో స్పందించిన అన్ని మనసులు ఆనందంతో వికసించాయి. సమస్య ఎవరిదైనా.. ఎక్కడున్నా స్పందించే హృదయాలు ఉన్నాయని చాటి చెప్పాయి. ఏడాదిన్నర వయసు ఉన్న ఓ చిన్నారి ప్రాణం నిలిపేందుకు తెలుగు ప్రజలు చేసిన ప్రయత్నం ఫలించింది. కర్నూలు చిన్నారి పునర్విక మృత్యువును జయించింది. పునర్వికకు పునర్జన్మ లభించింది. చిన్నారి మోముపై మళ్లీ చిరునవ్వులు విరబూశాయి. తెలుగు ప్రజల గొప్ప మనసు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన సాయంతో చిన్నారి పునర్వికకు కావాల్సిన రూ.16కోట్ల విలువైన ఇంజెక్షన్ ఆమెకు అందింది. అత్యంత అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ వ్యాధితో బాధపడుతున్న పునర్వికను కాపాడేందుకు మంత్రి నారా లోకేష్ విదేశాల నుంచి ఈ ఇంజెక్షన్ తెప్పించారు. శనివారం ఉదయం హైదరాబాద్‌లో ఉన్న రెయిన్‌బో ఆసుపత్రిలో మంత్రి నారా లోకేష్ సమక్షంలో రెయిన్‌బో ఆస్పత్రి డాక్టర్లు విదేశాల నుంచి తెప్పించిన రూ. 16 కోట్ల ఖరీదైన జోల్‌జెన్‌స్మా ఇంజెక్షన్

>>2

## డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.1.6కోట్ల భారీ మోసం

ఇండస్‌ఇండ్ బ్యాంకు అధికారి సహా ముగ్గురి అరెస్టు

ఎపి, తెలంగాణలో సిబిఐ విస్తృత సోదాలు

**విజయవాడ,ఏప్రిల్18,ప్రభాతవార్తప్రతినిధి:** డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న భారీ కుంభకోణాన్ని ఛేధించే దిశలో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ దూకుడు పెంచింది. శనివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఐదు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి, ఓ బ్యాంకు అధికారితో సహా ముగ్గురిని అరెస్ట్ చేసింది. ఓ సీనియర్ సిటిజన్‌ను డిజిటల్ అరెస్ట్ చేస్తామంటూ బెదిరించి, ఆయన నుంచి రూ. 1.6 కోట్లకు పైగా వసూలు చేసినట్లు ఈ కేసు నమోదైంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ కేసు దర్యాప్తు చేపట్టింది. అరెస్టయిన వారిలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ నాటి అసిస్టెంట్ మేనేజర్ దుబ్బాక మహేశ్‌తో పాటు రాజేశ్ కన్న, వాయల శ్రీనివాస్ ఉన్నారు. నిందితులు ఓ కంపెనీ పేరుతో నకిలీ బ్యాంకు ఖాతాను తెరిచి, మోసం చేసిన డబ్బును అందులోకి మళ్లించినట్లు సీబీఐ గుర్తించింది. ఆ తర్వాత నేరం మూలాలను దాచిపెట్టేందుకు, ఆ డబ్బును పలుఖాతాలకు బదిలీ చేసినట్లు తేలింది. నకిలీఖాతా తెరవడంలో బ్యాంకు అధికారి మహేశ్ సహకరించాడని, మిగిలిన ఇద్దరు నిందితులు మ్యూల్ అకౌంట్లను ఏర్పాటు చేయడం, నిధుల తరలింపును నిర్వహించడం వంటి పనులు చేశారని అధికారులు తెలిపారు. నిందితులకు సంబంధించిన ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో కీలక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ వెల్లడించింది. వాటిని విశ్లేషించి మరిన్ని ఆధారాలు సేకరిస్తు న్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా ప్రజలకు సీబీఐ కీలక సూచనలు జారీ చేసింది. చట్టంలో ఖిడిజిటల్ అరెస్ట్ఖి అనే పదం ఎక్కడా లేదని, అలాంటి బెదిరింపులకు ఎవరూ భయపడొద్దని స్పష్టం చేసింది. పోలీసుల పేరుతో గానీ, ఇతర అధికారుల పేరుతో గానీ వచ్చే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఏదైనా అనుమానాస్పద లావాదేవీని గమనిస్తే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరింది.

## ఒంటిమిట్టలో 45⁰ ఉష్ణోగ్రతలు

గూడూరు, ఆళ్లగడ్డలో 44.3⁰

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు ఈ నెల 19,20 తేదిల్లో కొనసాగుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. కొన్ని ప్రాం తాల్లో ఎండతీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన అకాలవర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

>>2

# విపక్షాల తీరు జాతికి ద్రోహం

మహిళా బిల్లును అడ్డుకోవడం చరిత్రలో బ్లాక్ డే

మహిళా సమాజానికి ఆ పార్టీలు క్షమాపణ చెప్పాలి

నిడదవోలులో జరిపిన నిరసన ర్యాలీలో సీఎం చంద్రబాబు

**నిడదవోలు,ఏప్రిల్18,ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష పార్టీలు జాతికి ప్రత్యేకించి మహిళలకు ద్రోహం, అన్యాయం చేశాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. ఈ బిల్లును అడ్డుకున్నందుకు నిరసనగా నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు నిర్వహించిన ర్యాలీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నేతలతో కలిసి సీఎం ఈ నిరసన ర్యాలీలో ప్లకార్డులు చేతపట్టుకుని నడిచారు. ధనమ్మ గుడి సెంటర్ నుంచి సభాస్థలి సుబ్బరాజు నగర్ వరకు జరిగిన ఈ నిరశన ర్యాలీలో మహిళలతో కలిసి పాల్గొన్నారు. మహిళా బిల్లును అడ్డుకున్న రోజును ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు మహిళా ద్రోహులని పేర్కొన్నారు. మహిళా సమాజానికి ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ పార్టీలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల్ని ఓటు బ్యాంకుగా చూసే రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని సీఎం అన్నారు. మూడు దశాబ్దాల మహిళా రిజర్వేషన్ కలను ప్రతిపక్ష పార్టీలు చెరిపేశాయని పేర్కొన్న ముఖ్యమంత్రి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవటం మహిళలకు ద్రోహం చేయడమేనని అన్నారు. ఎన్డీఏ పక్షాలతో కలిసి నిరసన ర్యాలీ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో నిన్నటి రోజు ఓ బ్లాక్ డే అని మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయని సుదీర్ఘ కలసాకారం అవుతుందని భావించామన్నారు. పార్లమెంటు,

>>2




శనివారం నిడదవోలులో జరిగిన నిరసన ర్యాలీలో సీఎం చంద్రబాబు, మంత్రులు, బిజెపి అధ్యక్షుడు మాధవ్

# విపక్షాల తీరు జాతికి ద్రోహం



శనివారం జరిగిన నిరసన ర్యాలీలో పాల్గొన్న సిఎం చంద్రబాబు, ప్రజాప్రతినిధులు, మహిళలు

>> అసెంబ్లీలోనూ 33 శాతం మంది మహిళల్ని ప్రజాప్రతినిధులుగా చూస్తామని అనుకున్నామని మహిళల్ని గౌరవించటం భారత సంస్కృతి లో భాగమని నిన్న పార్లమెంటులో దీనికి భిన్నంగా జరిగిందని మండిపడ్డారు. విపక్షాల వైఖరికి నిడదవోలులో ఎన్డీఏ పక్షాలు నిరసన ర్యాలీ నిర్వహించాం.మహిళలంతా బయటకు వచ్చి వారికి నిరసన తెలియాలని పిలుపు ఇస్తున్నానని దక్షి ణాదికి, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని, హోం మంత్రి పార్లమెంటు సాక్షి గా హామీ ఇచ్చారన్నారు. 50 శాతం మేర సీట్లు పెరుగుతాయని స్పష్టంగా చెప్పారు. ఏపీలో కూడా 50 శాతం మేర సీట్లు పెరుగుతాయి.ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ అజెండా కోసం ఈ దుర్మార్గం చేశాయని దుయ్యబట్టారు. దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ కోసం పోరాడుతున్నాం.దీనిని అడ్డుకోవటం క్షమించరాని నేరం. ఆడబిడ్డలంటే కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలకు ఇంత చులకనా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఈ బిల్లు ని అడ్డుకున్న పార్టీలు ఎన్నికల్లో మహిళా ఓట్లను అడిగే హక్కు లేదని చంద్రబాబు తేల్చి చెప్పారు.

**విద్రోహంపై ఇంటింటికీ ప్రచారం:** నిన్న జరిగిన విద్రోహాన్ని ప్రతీ ఇంటికి తీసుకెళ్తాం. ఇవాళ చేపట్టిన నిరసన ఆరంభం మాత్రమే. దీనిపై పవన్ కల్యాణ్‌నూతో మాట్లాడాను. ఎన్డీఏ పక్షాలతో పాటు ఇతర పార్టీలు కూడా కలిసి రావాలి. మహిళలను ఓటు అడిగే పార్టీలు మహిళా సాధికారతను అడ్డుకుంటాయా? 2017లో టీడీపీ అధికారంలో ఉండగా అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించాం. కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు బిల్లు కూడా తీసుకు రాలేక పోయారు. 2029లో మహిళలకు రిజర్వేషన్ల కల్పించాలన్న ఉద్దేశంతోనే సవరణ బిల్లు తీసుకు వచ్చారు. కాంగ్రెస్ నేతృత్వంలోని పార్టీలన్నీ ఈ బిల్లుకు 2/3 మంది సభ్యుల మద్దతు రాకుండా అడ్డుకున్నాయి. దక్షి ణాదికి, ఉత్తరాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఏవోవో ఆరోపణలు సాకులు చెప్పారు. లేని పోని సాకులతో బిల్లును డిఫీట్ చేయటం శోచనీయం. ప్రజలు ఎన్నుకుంటేనే చట్టసభల్లోకి వచ్చిన వారు మహిళలకు ద్రోహం చేయటం సరికాదని సిఎం చంద్రబాబు గట్టిగా చెప్పారు. జనాభాలో సగం ఉన్న మహిళలు ఏ రంగంలో అయినా సమర్ధంగా పనిచేస్తున్నారు. అలాంటి మహిళలు చట్ట సభలకు వస్తే న్యాయం జరుగుతుందనే ఈ సవరణ బిల్లు తీసుకువచ్చారు. మహిళల ఆత్మాభిమానం దెబ్బతీసే విధంగా బిల్లును అడ్డుకున్నారు. ఏ ముఖం పెట్టుకుని మహిళల్ని ఆ పార్టీలు ఓట్లు అడుగుతాయన్నారు. ఆ పార్టీలు చేసిన ద్రోహానికి డిపాజిట్ కూడా రాకుండా చేయాలి. ఆడబిడ్డలు పైకి వస్తే చూడలేకే ఈ బిల్లును అడ్డుకున్నారు. ఈ వ్యవహారంపై ప్రతీ ఒక్కరిని చైతన్యం చేసేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతాం". అని ముఖ్యమంత్రి అన్నారు. ఎన్డీఏ పక్షాలు నిర్వహించిన నిరసన ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్,జనసేన తరపున మంత్రి కందుల దుర్గేష్,జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.



శనివారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో మంత్రి పయ్యావుల భేటీ దృశ్యం

## ఆర్థిక బలోపేతానికి కేంద్రం సహకరించాలి: మంత్రి పయ్యావుల

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీకి ఆర్థికంగా బలీయమయ్యేందుకు కేంద్రం పరిపూర్ణ సహకారం అందించాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విజ్ఞప్తి చేసారు.కేంద్రం ఏపీ అన్ని విధాలుగా పరిపుష్టం కావడానికి కేంద్రం అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. అమరావతి రాజధాని నగరం, పోలవరం నిర్దిష్ట లక్ష్యాలకు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు.ఈ దిశలో కేంద్రం పలు పథకాలకు నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేసారు.ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు ఆర్థిక అంశాలు, అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర సహకారం గురించి పయ్యావుల నిర్మలా సీతారామన్‌తో చర్చించారు. ఈ సందర్భంగా విభజన హామీ నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఆయన ప్రస్తావించారు.

# పరిమళించిన మానవత్వం

>> పునర్విక‌కు అందించారు. కర్నూలు జిల్లాలోని వెల్దుర్తికి చెందిన సురేష్ కుమార్, పుష్పావతిల కుమార్తె పునర్విక. పుట్టిన ఆరు నెలలకే పునర్విక శరీరంలో కదలికలు తగ్గిపోయాయి. తల్లిదండ్రులు డాక్టర్లను సంప్రదిస్తే.. పునర్వికను పరీక్షించిన వైద్యులు.. ఆమె అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఈ వ్యాధి కారణంగా పునర్విక వెన్నెముక కండరాలు క్షీణించి, శ్వాస తీసుకోవడం కష్టమయ్యే పరిస్థితి. దీని నుంచి బయటపడాలంటే పునర్వికకు రూ. 16 కోట్ల ఇంజెక్షన్ ఇవ్వాల్సి ఉంటుందని సూచించారు. అయితే సెలూన్ షాపులో పనిచేసే సురేష్ కుమార్‌కు.. అంత మొత్తాన్ని ఎలా సేకరించాలో అర్థం కాలేదు. ఓ వైపు చిన్నారి ప్రాణం.. మరోవైపు అంతంత మాత్రంగా ఆర్థిక పరిస్థితి. ఈ సమయంలో తెలుగు రాష్ట్రాల ప్రజల చిన్నారి పునర్వికకు అండగా నిలిచారు. సేవ్ పునర్విక హ్యాష్ ట్యాగ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయ్యింది. పునర్విక కథ ప్రతి ఒక్కరినీ కదిలించింది. పసిపాప ప్రాణాన్ని నిలబెట్టేందుకు తెలుగు ప్రజలు తమ ఉదారతను చూపించారు. లక్షలాది మంది దాతలు స్పందించారు. తమకు తోచిన సాయం అందించటంతో రూ. 10 కోట్లు సమకూరాయి. ఇంకో రూ. 6 కోట్లు అవసరం కాగా.. చిన్నారి పరిస్థితిని తెలుసుకున్న నారా లోకేష్ ఆ కుటుంబానికి అండగా నిలిచారు. రూ.6 కోట్లు ప్రభుత్వం తరపున సమకూరుస్తామని మాటఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం విదేశాల నుంచి ఇంజెక్షన్ తెప్పించేందుకు తన వ్యక్తిగత సిబ్బందిని రంగంలోకి దించారు నారా లోకేష్. అన్ని అనుమతులు వేగంగా మంజూరయ్యేలా చూశారు.దీంతో చిన్నారి పునర్వికకు పునర్జన్మ లభించింది. శనివారం ఆమెకు కావాల్సిన ఇంజెక్షన్ వైద్యులు అందించారు. ఈ సందర్భంగా వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు నారా లోకేష్. పునర్వికను ఎత్తుకుని లాలించారు.వందేళ్లు చల్లగా ఉండు తల్లీ అంటూ దీవించారు. తమకుమార్తె ప్రాణాలను కాపాడినలోకేష్‌కు, తెలుగు ప్రజలకు పునర్విక తల్లిదండ్రులు కృతజ్ఞతతో ధన్యవాదాలు తెలియజేశారు.

# మహిళలకు క్షమాపణ చెబుతున్నా..

>> ఎప్పటికీ మర్చిపోదని 21వ శతాబ్ధపు మహిళలు చూస్తూ ఉపేక్షించరని పేర్కొన్నారు. రిజర్వేషన్ల అడ్డుకున్నవారికి ఎప్పటికైనా శిక్ష తప్పదన్నారు. పార్లమెంట్ సాక్షిగా మహిళా లోకాన్ని అవమానించారని, నారీశక్తి ఎవరి హక్కులనూ లాక్కునేది కాదన్నారు. 40 ఏళ్లుగా ఆగిపోయిన మహిళా రిజర్వేషన్లను 2029 నుంచే అమల్లోకి తెచ్చేందుకు తమ ప్రభుత్వం కృషిచేసిందని, దేశంలోని సగం జనాభాకు అధికారం కల్పించకుండా పవిత్ర ప్రయత్నాన్ని దెబ్బకొట్టారన్నారు. ఉత్తర, దక్షిణ, ఈశాన్య ప్రాంతం అనే తేడా లేకుండా ప్రతి మహిళకు మరింత శక్తి కల్పించాలని తాము చూశామని చిన్న, పెద్ద రాష్ట్రం అనే తేడా లేకుండా అందరికీ సమాన హక్కులు కల్పించే ఆలోచన చేశామని మోడీ అన్నారు. కాంగ్రెస్, వారి మిత్రపక్షాలు భ్రూణ హత్యకు పాల్పడ్డాయని వారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. మహిళా రిజర్వేషన్లపై విద్వేషం ప్రదర్శిస్తూనే ఉన్నారని మహిళా రిజర్వేషన్లు తెచ్చే ప్రయత్నం ఎప్పుడు చేసినా కాంగ్రెస్ అడ్డుకుంటూనే ఉందని మండిపడ్డారు. ఇన్నాళ్లు కాంగ్రెస్ పాపాలు కడిగేసుకుంటుందని అనుకున్నామని కానీ అలా జరగలేదని అన్నారు. దేశంలో కాంగ్రెస్ తన ఉనికి కోల్పోతున్నదని, తన ఉనికి కాపాడుకునేందుకు ప్రాంతీయ పార్టీలతో చేతులు కలిపిందన్నారు. ట్రిపుల్ తలాఖ్, ఆర్టికల్ 370 రద్దునువ్యతిరేకించారు, అక్రమ వలసదారులను వెనక్కి పంపే ప్రయత్నాలు చేశారు. నక్సలిజాన్ని అంతంచేసే ప్రయత్నాలను అడ్డుకున్నారు. దేశం కోసం చేసే మంచిపనులను అడ్డుకున్నారుని మండిపడ్డారు. సంస్కరణలను కాంగ్రెస్ అడ్డుకుంటూ రావడంతోనే అనేక దేశాలు భారత్ కంటే ముందుకు దూసుకెళ్లాయన్నారు. అడ్డుపుల్లలు వేయడమే కాంగ్రెస్ సిద్ధాంతమని, పొరుగుదేశాలతో ఉన్న వివాదాలను పరిష్కరించకుండా కాంగ్రెస్ అవే కొనసాగిస్తూ దేశానికి తీరని నష్టం చేసిందన్నారు. ఇది ఒక బిల్లుకు సంబంధించిన అంశం కాదని కాంగ్రెస్ విధానం, వ్యవహారశైలికి సంబంధించిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, టీఎంసీ, డీఎంకేలు పదే పదే అదే పనిచేస్తూ వచ్చాయన్నారు. సాంకేతిక అంశాలను సాకుగా చూపుతూ మహిళల అధికారం లాగేసుకుంటున్నారని ప్రధాని అన్నారు. మహిళలకు అధికారం ఇస్తే తమ ఉనికి దెబ్బతింటుందని కుటుంబ వారసత్వ పార్టీలకు భయంపట్టుకుందని మండిపడ్డారు. గ్రామ పంచాయతీల్లో మహిళలు సత్తా చాటారని చట్టసభలకు రావాలని మహిళలు కోరుకున్నారని కానీ కొందరు మాత్రం వారి కలల నిజం కాకుండా చిదిమేసారని మోడీ ఆరోపించారు. కాంగ్రెస్ ఆపార్టీ మిత్రపక్షాలు భ్రూణ హత్యకు పాల్పడ్డాయని ఆరోపించిన ప్రధాని తగిన మూల్యం చెల్లించుకుంటాయన్నారు. కాంగ్రెస్ పార్టీప్రస్తుతం పరాన్నజీవిగా మారిందని, ప్రాంతీయ పార్టీలపైనే ఆధారపడి కొనసాగుతోందని, ఆపార్టీలతో కలిసి ఈ కుట్రచేసిందన్నారు. కాంగ్రెస్ నిజస్వరూపం ప్రజలకు తెలిసిందని అన్నారు. ఎన్టీయే కూటమికి జాతీయ ప్రయోజనాలే సర్వోత్తమమైనవని, అయితే ప్రతిపక్షాలకు పార్టీప్రయోజనాలే సర్వస్వం అయ్యాయని ఎద్దేవాచేసారు. 131 రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం తనకు ఎంతో ఆవేదన కలిగించిందని, విపక్షాలు క్షమించరాని నేరంచేసాయని అన్నారు. దేశానికి కాంగ్రెస్ ఆపార్టీ మిత్రపక్షాలు అత్యంత ప్రమాదకరమని, దేశ అభివృద్ధి సంక్షేమానికి విఘాతం కలిగిస్తాయన్నారు.

## కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని స్వాగతించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాజమండ్రి(నిడదవోలు) - విశాఖపట్నం (దువ్వాడ) 3వ, 4వ రైల్వేలైన్లకు ఆమోదం తెలపడంపై కృతజ్ఞతలు తెలిపిన సీఎం ఈ ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై 4.3 కిలోమీటర్ల రైల్వే వంతెనతో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి ప్రయాణ సమయాన్ని కూడా ఆదా చేస్తుందని ట్వీట్ లో పేర్కొన్న ముఖ్యమంత్రిఈ ప్రాజెక్టులు వివిధ ప్రాంతాల్ని అనుసంధానించి ప్రయాణికులకు, సరుకు రవాణాకు దోహదం చేస్తాయన్న ముఖ్యమంత్రిఅన్నవరం, అంతర్వేది, ద్రాక్షారామం లాంటి ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలను కలుపుతూ భక్తులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్న ముఖ్యమంత్రి పారిశ్రామిక వృద్ధి, ఓడరేవు ఆధారిత ఆర్థిక వ్యవస్థల అభివృద్ధికి ముఖ్యం అన్న సీఎం స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాధన దిశగా ఈ ప్రాజెక్టులు మరో ముందడుగు అని ట్వీట్ లో పేర్కొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.

## పదవీ విరమణ ప్రయోజనాలు నిలిపివేయడంపై హైకోర్టు ఆగ్రహం

**విజయవావాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** శాఖాపరమైన విచారణ, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్న కారణంతో 79 ఏళ్ల మాజీ ఉద్యోగికి రెండు దశాబ్దాలుగా ఉద్యోగ విరమణ ప్రయోజనాలు నిలిపివేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జీవనాధారం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, భార్యతో పాటు 24 ఏళ్ల కుమారుడు మరణించారని 79 ఏళ్ల వృద్ధుడు దాఖలు చేసిన పిటిషన్‌పై సానుకూలంగా స్పందించింది. ఉద్యోగ విరమణ ప్రయోజనాలను నిలిపివేయడం వ్యక్తి జీవించే హక్కును భంగం కలిగించడమేనని స్పష్టం చేసింది. పెన్షన్ డబ్బు దానం సొమ్ము కాదని, ఉద్యోగి సంపాదించిన హక్కు, ఆయన ఆస్తి అని తేల్చిచెప్పింది. అది గ్రాట్యూటీ లేదా ఎక్స్‌గ్రేషియా కాదని కూడా పేర్కొంది.కేసు వివరాలను పరిశీలించిన హైకోర్టు, 2004లో నమోదైన క్రిమినల్ కేసులో పిటిషనర్‌పై ఇప్పటి వరకు ఆరోపణలు రుజువు కాలేదని గమనించింది. శాఖాపరమైన విచారణలోనూ పిటిషనర్ దోషిగా తేలలేదని, ఈ రెండు విచారణల్లో ఏవిధమైన పురోగతి లేదని పేర్కొంది. 31.8.2006న ఉద్యోగ విరమణ చేసిన అనంతరం కూడా ఆయనకు టెర్మినల్ బెనిఫిట్స్, పెన్షన్ నిలిపివేయడం సముచితం కాదంది.

ఎనిమిది వారాల్లోపు బకాయిలతో సహా అన్ని ఉద్యోగ విరమణ ప్రయోజనాలు చెల్లించాలని దేవాదాయశాఖ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ నూనెపల్లి హరినాథ్ తీర్పు వెలువరించారు. తిరుపతికి చెందిన బి రామయ్య, హాథీరామ్‌జీ మఠంలో సూపరింటెండెంటుగా పనిచేశారు. 2004లో మఠం పాలనాధికారి ఫిర్యాదు మేరకు ఆయనపై క్రిమినల్ కేసు నమోదు కాగా, అనంతరం సస్పెన్షన్‌కు గురయ్యారు. అదే సమయంలో శాఖాపరమైన విచారణ కూడా ప్రారంభమైంది. ఈ రెండు విచారణలు పెండింగ్‌లో ఉండగానే 2006లో ఆయన ఉద్యోగ విరమణ చేశారు. అయితే కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్న కారణంతో ఆయనకు టెర్మినల్ బెనిఫిట్స్, పెన్షన్ చెల్లింపులు నిలిపివేశారు. ఈలోగా ఆయన భార్య, కుమారుడు మరణించడంతో జీవనం కష్టమైంది. దీంతో 2014లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై తుది విచారణ జరిపిన న్యాయస్థానం, రామయ్యకు చెల్లించాల్సిన అన్ని ఉద్యోగ విరమణ ప్రయోజనాలను బకాయిలతో సహా చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తీర్పు చెప్పింది.

# ఒంటిమిట్టలో 45°ఉష్ణోగ్రతలు

>> ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణ,రాయలసీమ, తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో ఆది, సోమవారాల్లో మన్యం, అల్లూరి, పోలవరం, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పని చేసే రైతులు,పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు. శనివారం గరిష్ఠంగా కడపజిల్లా ఒంటిమిట్టలో 45డిగ్రీలు నమోదైందని తెలిపారు. 244 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు ఎపిఎస్డీఎంఎ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. అలాగే అల్లూరి జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడినట్లు తెలిపారు. ఆదివారం పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైందుకు అవకాశం ఉందన్నారు. రేపు తీవ్ర వడగాల్పులు వీచే మండలాలు విజయనగరం జిల్లాలో బాడంగి, బొబ్బిలి, దత్తిరాజేరు, మెంటాడ, రామభద్రాపురం, తెర్లాం, వంగర మండలాలు,..పార్వతీపురంమన్యం జిల్లాలో బలిజిపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట, పాలకొండ, పార్వతీపురం, సాలూరు, సీతంపేట, సీతానగరం, వీరఘట్టం మండలాల్లో తీవ్ర వడగాలులు.. ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. విజయనగరం 7, మన్యం 1, అల్లూరి 2, పోలవరం 7, కాకినాడ 3, తూర్పుగోదావరి 4, ఏలూరు వేలేరుపాడు మండలాల్లో (25) వడగాల్పులు వీచేందుకు అవకాశం ఉందన్నారు. శనివారం కడప జిల్లా ఒంటిమిట్టలో 45 డిగ్రీలు, కర్నూలు జిల్లా గూడూరు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 44.3 డిగ్రీలు,అనంతపురం జిల్లా తెరన్నపల్లిలో 44.1 డిగ్రీలు తిరుపతి జిల్లా వరదయ్యపాలెం 43.5 డిగ్రీలు మార్కాపురం జిల్లా కొమరోలులో 43 డిగ్రీలు , కాకినాడ జిల్లా కరప, శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో 42.9 డిగ్రీలు ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 42.5 డిగ్రీలు,పల్నాడు(జి) గురజాలలో 42.3 డిగ్రీలు,అన్నమయ్య జిల్లా నూలివీడులో 41.9 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్తపడాలని, గుండెసంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు.నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

## శాంతిని మరో రెండు రోజులు కస్టడీ కోరిన ఎసిబి

**విజయవాడ,ఏప్రిల్18,ప్రభాతవార్తప్రతినిధి:**దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి ని మరో రెండు రోజులు కస్టడీ ఇవ్వాలని ఏసీబీ అధికారులు సంబంధిత కోర్టును అడిగారు.ఆదాయానికి మించి ఆస్తులన్నాయనే నేపథ్యంలో ఏసీబీ గుంటూరు, విజయవాడల్లోని ఆమె, రక్త సంబంధీకుల ఆస్తులని విచారణలో శాంతి తెలిపినట్లు సమాచారం.ఆఖరికి ఆమె స్వయంగా తన వ్యక్తిగత బ్యాంకు లాకరు చూపించి ఆస్తులు వివరించారంటున్నారు.ఏ తమన ఆస్తులపైన అభియోగాలు చేసినా అవి నిజం కాదని వాటికి ఆధారాలున్నాయని శాంతి వాదించారంటున్నారు.తనను రిమాండ్‌లో ఉంచి కస్టడీకి విచారణ పిలవడంపై శాంతి నఅసహనం వ్యక్తం చేసారంటున్నారు.ఈ క్రమంలో ఏసీబీ ఆమెను మరో రెండు రోజులు కస్టడీకి కోరింది.

# హర్మూజ్ మళ్లీ మూసివేత

### ఇచ్చిన హామీలను విస్మరించిన ట్రంప్: ఇరాన్



**టెహ్రాన్, ఏప్రిల్ 18:** ప్రపంచానికి ఇరాన్ మళ్లీ షాకిచ్చింది. హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ప్రకటించిన కొన్ని గంటల్లోనే తిరిగి మూసేసింది. అమెరికా అనుసరిస్తున్న విధానమే దీనికి కారణమని ఆరోపించింది. హర్మూజ్ జలసంధిని మూసేస్తున్నట్లు ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్ఐసి) ప్రకటించింది. ఇటీవల హర్మూజ్ జలసంధిని అమెరికా దిగ్బంధించిన సంగతి తెలిసిందే. అయితే, ఇరాన్ హర్మూజ్ జలసంధిని తెరిచినప్పటికీ, అమెరికా మాత్రం ఈ దిగ్బంధనాన్ని తొలగించలేదు. పైగా తమ నౌకల్ని అమెరికా అడ్డుకుంటోందని ఇరాన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని తిరిగి మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దిగ్బంధనం పేరుతో సముద్రంపై అమెరికా దోపిడీ, దౌర్జన్యానికి పాల్పడుతోందని ఇరాన్ ఆరోపించింది. అమెరికాతో కుదిరిన ఒప్పందం మేరకు హర్మూజ్‌ను తరిచామని, అయితే, ఈ ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిందని ఇరాన్ విమర్శించింది. హర్మూజ్‌ను ఇరాన్ తిరిగి మూసేయడంతో మళ్లీ గతంలోలాగే ఇరాన్ సెంట్రల్ మిలిటరీ కమాండ్ పూర్తి పర్యవేక్షణ చేపడుతోంది. సముద్ర జలాలపై గట్టి నిఘా ఉంటుందని తెలిపింది. ఇరాన్ నిర్ణయంతో ఈ జలసంధి నుంచి నౌకల రవాణా నెమ్మదించింది. హర్మూజ్‌ను అమెరికా దిగ్బంధించినంత కాలం తాము జలసంధిని మూసివేసి ఉంచుతామని ఇరాన్ ప్రకటించింది. అయితే, ఈ విషయంలో అమెరికా వైఖరి భిన్నంగా ఉంది. తమరో ఒప్పందం కుదుర్చుకునే వరకు హర్మూజ్ దిగ్బంధనం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇదే సమయంలో ఇరాన్ తమ దేశంలోని పలు ఎయిర్‌పోర్టులను తిరిగి తెరుస్తున్నట్లు ప్రకటించింది. తూర్పు మార్గంలో అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అనుగుణంగా అనుమతులిస్తున్నట్లు ఇరాన్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ ప్రకటించింది. హర్మూజ్‌కు సంబంధించి.. దీన్ని ఇంకొంతకాలం ఇలాగే మూసి ఉంచితే ప్రపంచం మళ్లీ సంక్షోభంలో కూరుకుపోవడం ఖాయం. చమురు ధరలు కూడా భారీగా పెరుగుతాయి.

# దేశ సమగ్రతను కాపాడిన ప్రతిపక్షాలు

### సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** నిన్న పార్లమెంట్లో ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా మోదీ, అమిత్ షా కుట్రలను తిప్పికొట్టి, భారతదేశ ప్రజాస్వామ్యాన్ని, దేశ సమగ్రతను కాపాడాయని సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు కె రామకృష్ణ నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. నిన్న పార్లమెంట్లో, ప్రత్యేకంగా లోక్ సభలో బిల్లు వీగిపోవడం అనేది నిజంగా భారత దేశంలో ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవడానికి వచ్చిన అవకాశంగా అందరూ భావించాల్సి ఉంది. నరేంద్ర మోడీ, అమిత్ షాలు అత్యంత ప్రమాదకరమైన గేమ్ ఆడినట్లుగా గోచరిస్తున్నది. మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపచేసుకొని భారత దేశంలో అసమానతలకు పెద్దపీట వేసేందుకు ప్రయత్నించారు. తమ స్వార్ధ రాజకీయాల కోసం, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం ఈ ప్రయత్నం చేశారు. ఒకవైపు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశం పేరుతో ఈ చర్య చేపట్టడం దుర్మార్గం. నిన్న లోక్సభలో అమిత్ షా డీలిమిటేషన్ బిల్లు మహిళా బిల్లు రెండు ముఖ్యమేనని మాట్లాడారు. ప్రతిపక్షాన్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. బిల్లు ఆమోదం కాకపోతే ప్రతిపక్షాలను బద్నాం చేయాలని అమిత్ షా చూశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉత్తరాది రాష్ట్రాలలో దాదాపు 78శాతం సీట్లు పెరుగుతాయి. నార్త్ ఈస్ట్, సౌత్ ఇండియా ప్రాంతాల్లో 33 శాతమే పెరుగుతాయి.ఎక్కడైతే బిజెపి సీట్లు గెలిచే అవకాశం ఉన్నదో ఆయా ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లుభారీగా పెరుగుతాయి. పైగా దక్షి ణాది రాష్ట్రాలకు నష్టం కలుగకుండా 50సీట్లు పెంచుతా మని కేవలం నోటిమాట గానే అమిత్ షా చెబుతున్నారు. భారతదేశ ఎన్నికల మ్యాపును మార్చడానికి, పొలిటికల్ మ్యాప్‌ని మార్చడానికి మోడీ ప్రభుత్వం మహిళలను అడ్డుపెట్టుకొని ఒక తీవ్రమైన ప్రయ త్నం చేసింది. 2023లో అన్నిపక్షాలతో ఆమోదం పొందిన మహిళ బిల్లును అమలు చేయకుండా, ఇప్పుడు డీలిమిటేషన్ బిల్లును మహిళా బిల్లుతో కలిపి ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నాం. డీలిమిటేషన్ ద్వారా పెరిగిన స్థానాలలో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని బిజెపి చేసిన వితండవాదాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# మరో 2 రైల్వే లైన్లు

>> ప్రభావం గణనీయంగా తగ్గనున్నట్లు కేంద్రం అంచనావేసినట్లు అశ్విని వైష్ణవ్ వివరించారు.

**11 మార్గాల్లో కొత్త లైన్ల నిర్మాణం :** ఇప్పటివరకు రైలు అనుసంధానం లేని 11 మార్గాల్లో కొత్త లైన్ల నిర్మాణంపై రైల్వేశాఖ దృష్టిపెట్టింది. వీటికి గతంలోనే సర్వేలు చేయగా, రైల్వే బోర్డు ఆమోదం నేపథ్యంలో డీపీఆర్‌లు రూపొందించారు. కొన్నిచోట్ల బైపాస్ లైన్లు, రైల్ ఓవర్ రైల్ వంతెనల నిర్మాణంపైనా దృష్టిపెట్టారు. హైదరాబాద్‌బెంగళూరు మధ్య నిర్మించే హైస్పీడ్ కారిడార్‌లో ఏపీలో 300 కి.మీ., హైదరాబాద్ చెన్నై హైస్పీడ్ కారిడార్‌లో ఏపీలోని 464 కి.మీ.కు డీపీఆర్‌లపై దృష్టిపెట్టారు.

**సరకు రవాణాకు మూడు, నాలుగో లైన్లు :** విజయవాడచెన్నై, విజయవాడహైదరాబాద్, విజయవాడవిశాఖపట్నం మార్గాల్లో సరకు రవాణా రైళ్ల రాకపోకలు అంతకంతకు పెరుగుతున్నాయి. దీంతో ఈ మార్గాల్లో మూడు, నాలుగో లైన్ల నిర్మాణంపై దృష్టిపెట్టారు. ఇప్పటికే కొన్ని మార్గాల్లో మూడో లైను నిర్మిస్తున్నారు. ఒడిశా వైపు నుంచి కొత్తవలస మీదుగా విశాఖపట్నానికి బొగ్గు, వివిధ ఖనిజాలు రవాణాచేసే రైళ్లు భారీగా ఉంటున్నాయి. దీంతో విశాఖపట్నంలోని సింహాచలం నార్త్ నుంచి కొత్తవలస వరకు ఐదు, ఆరో లైన్ల నిర్మాణానికి డీపీఆర్‌లు రూపొందించారు.

ప్రాజెక్టులో భాగంగా గోదావరి నది మీద 4.3 కిలోమీటర్ల రైలు వంతెన, 2.67 కిలోమీటర్ల వయాడక్ట్, 3 బైపాస్‌లు నిర్మాణం జరగనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. తూర్పు తీరంలోని విశాఖ, గంగవరం, మచిలీపట్నం, కాకినాడ ప్రధాన పోర్టులకు అనుసంధానం పెరుగుతుందని వివరించారు. అన్నవరం, అంతర్వేది, ద్రాక్షారామం వంటి కీలక ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలకు ఎక్కువ అనుసంధానం పెరుగుతుందని స్పష్టం చేశారు. రోడ్డు రవాణాతో పోలిస్తే ఏటా సుమారు రూ.1,150 కోట్ల మేర ఆదా అవుతుందని, డీజిల్ కాలుష్య ప్రభావం గణనీయంగా తగ్గనున్నట్లు కేంద్రం అంచనా వేసినట్లు అశ్విని వైష్ణవ్ వివరించారు.

## సదవకాశాన్ని దూరం చేశారు: డి.సిఎం పవన్

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** చట్ట సభల్లో మహిళా శక్తిని పెంపొందించే సదవకాశాన్ని దూరం చేశారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు ఆమోదించి ఉంటే వారికీ గౌరవం దక్కేదని పవన్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లోనైనా మహిళా శక్తికి చట్ట సభల్లో సముచిత స్థానం దక్కుతుందని ఆశిస్తున్నట్లు పవన్ అభిప్రాయపడ్డారు. ఎన్డీయే భాగస్వామ్య పార్టీగా బిల్లులను స్వాగతిస్తున్నామని మరోసారి తెలిపారు. బిల్లు ఆమోదం పొంది ఉంటే భారత మహిళలు సంతోషించి ఉండేవారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశ అభ్యున్నతి కన్నా రాజకీయ ప్రయోజనాలే ముఖ్యంగా విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

# ఐఏఎస్ అధికారుల బదలీ

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిపాలనలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. నలుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధి (గిడీతి), జిల్లా పరిపాలనలో సమర్థత పెంచే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా చేపట్టిన ఈ బదిలీల్లో యువ ఐఏఎస్ అధికారులకు కీలకమైన ఐటీడీఏ , జాయింట్ కలెక్టర్ బాధ్యతలను అప్పగించింది.సురపాటి ప్రశాంత్ కుమార్‌కు పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కొత్త బాధ్యత అప్పగించింది. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా .అదనపు బాధ్యత నిర్వహించనున్నారు. వైఖోమ్ నిడియా దేవికి కొత్త బాధ్యత ఇచ్చారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్. జిల్లా పరిపాలనలో కీలకమైన రెవెన్యూ, అభివృద్ధి పనులను ఈమె పర్యవేక్షి ంచనున్నారు. బచ్చు స్మరణ్ రాజ్ బదిలీ చేసి ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖలో (రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. తదుపరి పోస్టింగ్ ఇచ్చే వరకు ఆయన జీఏడీ పరిధిలో ఉంటారు. వైశాలికి కొత్త బాధ్య తను అప్పగించింది. పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్. వెనుకబడిన గిరిజన ప్రాంతాల అభివృద్ధి బాధ్యతను ప్రభు త్వం ఆమెకు అప్పగించింది. శుభమ్ నోఖ్వా ల్‌కు ప్రభుత్వం కొత్త బాధ్యత అప్పగిం చింది. చింతూరు ఐటీడీఏ (గిడీతి) ప్రాజెక్ట్ ఆఫీసర్. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనపై ఆయన దృష్టి సారించనున్నారు.

# పదేళ్లు కౌలు

>> రైతులు పాల్గొన్నారు. ఈ భేటీలో కౌలు పెంపు, రుణమాఫీ వంటి అంశాలపై వారి డిమాండ్లను చంద్రబాబు ప్రధానంగా ప్రస్తావించారు. దానిపై పురపాలకశాఖ మంత్రి నారాయణ, తాడికొండ, పెదకూరపాడు ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, భాష్యం ప్రవీణ్‌లతో సీఎం చంద్రబాబు విడివిడిగా సమావేశమై చర్చించారు. కౌలు పెంపు, రుణమాఫీ ప్రకటన చేయడంతో రైతుల చప్పట్లతో వారి హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. తమకు అభివృద్ధి చేసిన స్థలాల్ని ఇన్నర్ రింగ్ రోడ్డుకు లోపల ఇవ్వాలని కర్లపూడి గ్రామస్థులు కోరారు.

## వారం - వర్జ్యం

19-04-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, అశ్విని కార్తె
విదియ ఉ.10.49
భరణి ఉ.7.10, కృత్తిక తె.4.35
వర్జ్యం : సా.5.52-రా.7.18
దు.సా.4.39-సా.5.29
శుభసమయం: ఉ.9.00-ఉ.10.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:**రావలసిన మొత్తాలు క్లయిములు చెల్లించవలసిన వద్దులు వరిష్కార మవుతాయి. మిత్రుల కలయిక.

**వృషభం:** పిల్లల విద్యా, వివాహ, ఉద్యోగ విషయాలలో శుభ పరిణామాలు కనిపిస్తాయి. వ్యాపారాలలో అనుకూలం.

**మిథునం:**అనేక లాభదాయక వ్యవహారములు మీకు అనుకూలముగా మారుట వలన సాటివారికి అసూయ పెరుగుతుంది.

**కర్కాటకం:**సహోదర, సహోదరీ వర్గీయులు కొన్ని కారణముల వలన దూరంగా ఉంటారు. ప్రమోషన్లుకు అవకాశం.

**సింహం:**స్వజనుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. కాంట్రాక్టులు కలిసి వస్తాయి. బంధువుల కలయిక.

**కన్య:** విద్యా సారస్వత, రాజకీయ రంగాలలోని వారికి వివాదాలు రావచ్చు. విక్రయ ప్రదర్శనలు, అగ్రిమెంటు కలిసి వస్తాయి. వస్త్రలాభం.

**తుల :** సందర్భోచితంగా వ్యవరించి కార్యక్రమాలను సానుకూల పరచుకోగలుగుతారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**వృశ్చికం:** పెద్ద స్థాయిని కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**ధనుస్సు:** అన్నీ అనుకూలముగా వున్నా తెలియని చికాకు ఉంటుంది. సోదరుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మకరం:** ఇచ్చిన ఋణములు తిరిగి వసూలు అవుట కష్టమవుతుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**కుంభం:** మిత్రులతో చేయు నూతన కార్యక్రమములు ఉత్సాహకరముగా, లాభకరముగా వుంటాయి. ధనలాభం.

**మీనం:**మీరు చెబితేనే గాని అభివృద్ధి పనులు మీ కార్యాలయములోని వారికి తెలియవు. విందు, వినోదాలు పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

### దక్షిణ భారత్, ఈశాన్య, చిన్న రాష్ట్రాలకు అన్యాయం చేసిన విపక్షాలను ప్రజలు క్షమించరు : మంత్రి లోకేశ్

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** పునర్విభజన, రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని మంత్రి లోకేశ్ అన్నారు.ఆ పార్టీలను ప్రజలు ఎన్నటికి క్షమించరన్నారు. దక్షిణ భారత్, ఈశాన్య, చిన్న రాష్ట్రాలకు విపక్షాలు అన్యాయం చేశాయని ఈ సందర్భంగా లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 81 ప్రకారం రాష్ట్రాల మధ్య స్థానాల పంపిణీ ఫ్రీజ్‌లో ఉండేదని ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లులు లేకపోతే 2026 జనగణన తర్వాత జనాభా ఆధారంగా స్థానాలు నిర్ణయిస్తారని లోకేశ్ వివరించారు. మంచి పనితీరు చూపిన రాష్ట్రాలు నష్టపోతాయని మంత్రి లోకేశ్ భావించారు. ఇది ఫెడరల్ సమతుల్యతపై నేరుగా దాడి చేసినట్లేనని మంత్రి లోకేశ్ విమర్శించారు. ఈ నష్టం ప్రతిపక్ష పార్టీల వల్ల జరిగిందని మంత్రి లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.



# ప్రశ్నించే గొంతులపై అక్రమ కేసులా?

### జర్నలిస్టులపై కక్షసాధిస్తున్న టిడిపి : జగన్

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో టీడీపీ ప్రభుత్వం జర్నలిస్టులపై కక్ష సాధిస్తోందని జగన్ ఆరోపించారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసారు.జర్నలిస్టులు పూడి శ్రీహరి, కేవీఆర్‌పై కేసులను ప్రస్తావించిన జగన్ ఇది రెడ్‌బుక్ పాలనకు నిదర్శనమంటూ చంద్రబాబుపై మండిపడ్డారు.,చంద్రబాబు రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని జగన్ వ్యాఖ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా, కూటమి ప్రభుత్వంపైనా వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నారని, ప్రత్యేకంగా జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే దేశద్రోహమా అని నిలదీశారు. ఇది జంగిల్ రాజ్ కాదా అని ఆయన ప్రశ్నించారు. సీనియర్ జర్నలిస్టులైన పూడి శ్రీహరి, కేవీఆర్‌లపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు జగన్ తెలిపారు. “బీసీ వర్గానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పూడి శ్రీహరి చేసిన తప్పేంటి? అతనిపై అక్రమ కేసులు పెట్టి, ఇంట్లో సోదాలు చేయడానికి అతనేమైనా ఉగ్రవాదా? టెర్రరిస్టా?“ అని జగన్ ప్రశ్నించారు. అదేవిధంగా, తెలంగాణకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ కేవీఆర్ ఇంట్లో లేని సమయంలో ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం రెడ్‌బుక్ పాలనకు నిదర్శనమని ఆరోపించారు. పొలిటికల్ గవర్నెన్స్ ముసుగులో ఇలాంటి అరాచకాలకు పాల్పడతారా అని నిలదీశారు. గడిచిన రెండేళ్లలో మహిళలు, బాలికలపై జరిగిన ఎన్నో దాడుల ఘటనల్లో నిందితులపై చర్యలు తీసుకోని ప్రభుత్వం, తమను ప్రశ్నించిన వారిపై మాత్రం వెంటనే కేసులు పెడుతోందని జగన్ విమర్శించారు. “మీ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేసినా వారిపై చర్యలు తీసుకోలేదు. కానీ, వాస్తవాలు మాట్లాడితే మీకు ఎందుకు అంత ఉలుకు?“ అని ప్రశ్నించారు. పౌరులకు రక్షణ కల్పించడంలో విఫలమై, స్వార్థ రాజకీయాల కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేయడం సుపరిపాలన అవుతుందా అని జగన్ అన్నారు.

# నగదు రహిత వైద్యం రూ.5లక్షలు సీలింగ్ ఏదీ?

### - టిటిడి ఉద్యోగ నేతల పెదవి విరుపు

**తిరుమల, ఏప్రిల్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడిలో దాదాపు ఏడువేలమంది వరకు శాశ్వత ఉద్యోగులు వివిధ విభాగాల్లో, వివిధ హోదాల్లో సేవలందిస్తున్నారు.రోజువారీగా లక్ష మంది వరకు వస్తున్న భక్తులకు సకల సౌకర్యాలు కల్పించి, సంతృప్తికర సేవలందిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానమ్ ఉద్యోగులు ఏదేని అనారోగ్యంబారిన పడితే నగదు రహిత వైద్యసేవలందడం గగనంగా మారిందని ఉద్యోగ సంఘాలనేతలు ఆవేదన చెందుతున్నారు. ఈ నిధులు విడుదల కాకపోవడంతో అనారోగ్యాన పడిన ఉద్యోగులు అప్పులు చేసి వైద్యం అందుకున్నారని ఉద్యోగ నేతల మాట. ఇప్పటికే వయసుమీరిన ఉద్యోగులు ,పలురకాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న వాళ్ళు చిన్నచిన్న జబ్బులు బారిన పడితే వారికి తిరుపతిలోని కేంద్రీయ ఆస్పత్రి, స్విమ్స్,బర్డ్ ఆస్పత్రుల్లో వైద్యం అందుతుంది. ఆపై ఏదేని తీవ్రమైన వ్యాధుల బారినపడితే ఈ ఆస్పత్రుల్లో మెరుగైన నాణ్యమైన వైద్యం అందకపోగా తెలుగురాష్ట్రాల్లోని కార్పొరేటర్ ఆస్పత్రులు, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లోని కార్పొరేట్ ప్రముఖ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలంటే ఉద్యోగులు సొంత డబ్బులు వెచ్చించుకోవాల్సిన పరిస్థితి వస్తోందని వాపోతున్నారు. పైగా టిటిడిలో నగదు రహిత వైద్యసేవలకోసం 3లక్షల రూపాయలు మాత్రమే పరిమితం ఉందని,ఈ సీలింగ్‌ను 5లక్షల రూపాయల వరకు పెంచాలని ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేస్తోంది. ఇహెచ్‌ఎస్‌లో ఉన్న ఆస్పత్రుల సంఖ్యను పెంచాలని, నగదు రహిత వైద్యసేవలకు తిరుపతిలోని అమర ఆస్పత్రి, అంకుర, ఆస్టర్ నారాయణాద్రి.డిబిఆర్, సంకల్ప, రష్ వంటి ఆస్పత్రులను ఇహెచ్‌ఎస్‌లోకి అందుబాటులోకితీసుకురావాలని ఉద్యోగులు కోరుతున్నారు. శాశ్వత ఉద్యోగులతోబాటు మరో 12వేలమంది వరకు ఔట్‌సోర్సింగ్,సొసైటీ క్రింద సేవలందిస్తున్న ఉద్యోగులకు వైద్యసేవలను స్విమ్స్,బర్డ్‌లో నగదు రహితంగా అందించాలని కూడా తెరపైకి తీసుకువస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న లక్షలమంది భక్తుల సంఖ్యకు తగ్గట్లు అంకితభావంతో, సేవాభావ సేవలందిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఆరేళ్ళ క్రిందట కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో వెయ్యిమంది వరకు ఉద్యోగులు, సిబ్బంది, అర్చకులు వైరస్ బారిన పడినపుడు వైద్యఖర్చులు ఉద్యోగులు తమ సొంత నిధుల నుంచి వెచ్చించారని పేర్కొన్నారు.




# బిజెపికి నైతికత ఉంటే మోడీ రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లాలి

### - మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్

**తిరుపతి,ఏప్రిల్ 18ప్రభాతవార్తప్రతినిధి:** బిజెపికి ఏమాత్రం నైతికత ఉంటే, ప్రధాని మోదీ వెంటనే రాజీనామా చేసి. ఎన్నికలకు వెళ్లాలని కేంద్రమాజీమంత్రి,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేశారు. శనివారం తిరుపతిలో టిటిడి పరిపాలన భవనం వద్ద కాంగ్రెస్ నేతలు ధర్నా చేపట్టారు. 1989లో రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు, మాకు ఇలాంటి సమస్యే ఎదురైందన్నారు. అప్పటి రాష్ట్రపతికి రాజీనామా లేఖ ఇచ్చి, ఎన్నికలకు వెళ్ళామని గుర్తుచేశారు.అంబేద్కర్ జయంతి రోజున పార్లమెంట్ భవన్ లో అరడుగు దూరంలో ప్రధాని మోడీని చూశానని, పార్లమెంట్‌లో బిల్లులు ప్రవేశపెట్టి ఓడిపోతున్నామని ఆయనకు అప్పుడే తెలుసన్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో గెలిచేందుకు రాజ్యాంగ సవరణ అంటున్నారని చింతా ఎద్దేవాచేశారు.చంద్రబాబు నాయుడు మద్దతుతో పదవిలో కొనసాగుతున్నారని అన్నారు. తిరుపతి రాజధాని చెయ్యాలని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ని నేను అడగడం జరిగిందని, ఆయన ఒప్పుకున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ కి అవసరమైన భవనాలు,కార్యాలయాలుతిరుపతిలో అందుబాటులో ఉన్నాయని మరోసారి చింతామోహన్ తెలిపారు. తిరుపతిలో పుట్టిన ఒకాయన అమరావతి లో రాజధాని పెట్టుకున్నాడని, అమరావతిని ఎవరు ఇష్టపడడం లేదని,అది అమరావతి కాదు చంద్రావతి అని ప్రజలందరూ చెప్పుకుంటున్నారన్నారు. ఇంకో రాయలసీమ బిడ్డ బందరులో రాజధాని కావాలంటున్నాడు. ఈ ఇద్దరు బిడ్డలు రాజధాని విషయంలో ఓడిపోవడం ఖాయమని చింతా జోస్యం చెప్పారు. పి.ఆర్.సి. కోసం లక్షలమంది ప్రభుత్వ ఉద్యోగులు, టిటిడి ఉద్యోగులు ఎదురుచూస్తున్నారన్నారు. వారికి మేలు చేసే విధంగా రాష్ట్ర మంత్రి వర్గం ఒక మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు.టిటిడి ఉద్యోగస్తులకు 4 డిఎలు పెండింగ్ లో వున్నాయన్నారు.

# రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



**విజయనగరం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల (5వ ఏపీ కప్ ) పోస్టర్‌ను గోవా గవర్నర్ అశోక్ గజపతి దంపతులు, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ , ఎమ్మెల్యే అదితిగజపతి రాజు, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఒలింపిక్ , తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు , స్టేట్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావులు మీడియాతో మాట్లాడుతూ మే నెల 5.6,7 తేదీలల్లో విజయనగరం రాజీవ్ స్టేడీయంలో ఈ పోటీలు జరగనున్నట్లు తెలిపారు. తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 500 మంది క్రీడాకారులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలిచిన వాళ్ళు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, టిడిపి నాయకులు అవనాపు విజయ్ , బొద్దల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ చేసిన పనికి వైఎస్సార్ ఆత్మ నిజంగా ఘోషిస్తోంది : వైఎస్ షర్మిల

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ సీఎం జగన్ ఆర్‌ఎస్‌ఎస్ వంటి కుట్రశక్తులతో చేతులు కలిపి దివంగత రాజశేఖరెడ్డి ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దత్తపుత్రుడు జగన్ తెర తొలగిందని విమర్శించారు. బీజేపీతో ఆయన పెట్టుకున్న అక్రమపొత్తు తేటతెల్లమైందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు. విపక్షం ముసుగులో ఉన్నది సైతం ఆర్‌ఎస్‌ఎస్ పక్షమేనని నిజ నిర్ధారణ జరిగిందని తెలిపారు. వైసీపీ హయాంలో చేసిన అవినీతి కోసం ఇంతలా బీజేపీతో అంటకాగాలా..? అని ప్రశ్నించారు. కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బతకాలా..? అని ఎద్దేవా చేశారు. ఇదేనా జగన్ చెప్పే వైఎస్సార్ ఆశయాలు, వారసత్వం..? అని నిలదీశారు. మహానేత వైఎస్సార్ సిద్ధాంతాలను మంట గలిపినందుకు, విలువలకు తూట్లు పొడిచినందుకు జగన్ ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు.జగన్ చేసిన నీచపు పనికి వైఎస్సార్ ఆత్మ నిజంగా ఘోషిస్తోందని షర్మిల విమర్శించారు. మహిళా బిల్లును, డీ లిమిటేషన్‌కి లింక్ పెట్టడం జగన్ అవివేకానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు ఎవరు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మహిళలకు అగ్రతాంబూలం అందిస్తుంటే అభ్యంతరం ఎవరికీ లేదని అన్నారు. కాంగ్రెస్‌తో సహా దేశవ్యాప్తంగా విపక్షాల ఐక్యత ఒకటేనని చెప్పుకొచ్చారు. మహిళా బిల్లు పాస్ అయ్యింది 2023లోనేనని ప్రస్తావించారు. నియోజకవర్గాల పునర్విభజనపై,

మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ స్టాండ్ క్లియర్‌గా ఉందని వ్యాఖ్యానించారు.2026 జనాభా లెక్కలు అందుబాటులోకి రావాలని షర్మిల సూచించారు. కులగణన ద్వారా ఎస్‌సి,ఎస్‌టీ, ఓబీసీల సంఖ్య తేలాలని అన్నారు. కులాల ఆధారంగా డీ లిమిటేషన్‌లో రిజర్వేషన్లు పాటించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి న్యాయం చేయాలని కోరారు.

# తిరుమల నడకదారుల్లో పోలీసుల తనిఖీలు

### - ఆరు దుకాణాలకు నోటీసులు, వాహనాలు స్వాధీనం



**తిరుమల,ఏప్రిల్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలక్షేత్రంలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు, నేరాలని యంత్రణలో భాగంగా జిల్లా పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాలతో తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్ నేతృత్వంలో తిరుమల సిఐ రాముడు ఆధ్వర్యంలో తిరుమల బాలాజీనగర్,నడకదారుల్లో తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా దుకాణాదారుల లైసెన్స్‌లు, అక్రమంగా ఏర్పాటుచేసుకున్న, అనధికారికంగా ఉంటున్న వారి వివరాలు రాబట్టారు. అలిపిరి నడకమార్గంలో గాలి గోపురం, ఏడవమైలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. 63 దుకాణాలు పరిశీలించి,ఆరుదుకాణాలకు నోటీసులు ఇచ్చారు. నలుగురు అనుమానితులు అదుపులోకి తీసుకున్నారు.రెండు వాహనాలు స్వాధీనంచేసుకున్నారు. భక్తుల భద్రత దృష్ట్యా తిరుమలలో నాఖాబందీ కార్యక్రమం నిర్వహించారు. భక్తుల భద్రతకు భంగం కలిగించే విధంగా నిషేధిత వస్తువులు వినియోగించరాదని, గంజాయి, మద్యం, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులను తీసుకురావడం, వినియోగించడం చేయరాదని షాపులలో పనిచేసే సిబ్బందికి కఠినంగా సూచనలు చేశారు.

# రాష్ట్రానికి, దేశానికి పేరుతెచ్చేలా క్రీడాకారులకు ప్రోత్సాహం

### - చిత్తూరులో అంతర్ జిల్లాల జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్‌షిప్ ప్రారంభం



**చిత్తూరురూరల్,ఏప్రిల్ 18ప్రభాతవార్త:** గ్రామీణ స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారిణులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ సౌకర్యాలు కల్పించడం ద్వారా భవిష్యత్తులో రాష్ట్రానికి, దేశానికి ప్రతిష్ట తీసుకురాగల క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు.ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. 16వరాష్ట్ర అంతర్ జిల్లాల జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్‌షిప్-2026 శనివారం ఉదయం చిత్తూరునగరంలో బి.టి. కాంపౌండ్ గ్రౌండ్ లో ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి వచ్చిన జూనియర్ మహిళల హాకీ జట్లు ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నాయి. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ముఖ్యమని, ముఖ్యంగా మహిళా క్రీడాకారిణులు ఇటువంటి వేదికల ద్వారా తమ ప్రతిభను రాష్ట్ర ,జాతీయ స్థాయిలకు చాటుకోవాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు క్రీడలు మంచి మార్గమని కూడా సూచించారు. ఈ సందర్భంగా జట్ల క్రీడాకారిణులకు శుభాకాంక్షలు తెలియజేసి, గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడలు మన జీవితంలో ఒక ముఖ్య భాగమని, అవి ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడతాయని పేర్కొన్నారు. హాకీ మ్యాచ్‌ను వీక్షించి క్రీడాకారిణుల ప్రతిభను అభినందించారు. ఆటలో చూపిన చురుకుదనం, సమన్వయం, కృషిని కొనియాడుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడా శాఖ అధికారులు, హాకీ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు, పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ విధానాలతో రైతులు కుదేలవుతున్నారు

### - వైసిపి ప్రధాన కార్యదర్శి ఎంవిఎస్ నాగిరెడ్డి

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాత వార్తప్రతినిధి:.** కూటమి ప్రభుత్వం విధానాలతోరైతులు కుదేలవుతున్నారని, పంటలు కొనుగోలు చేయబోమని చెప్పడం హేయమని వైసిపి ప్రధాన కార్యదర్శి ఎంవిఎస్ నాగిరెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిధులు లేనందున ఏ పంటా కొనలేమని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. సంక్షోభంలో ఉన్న మొక్కజొన్న రైతుకు కనీస మద్దతు ధర ఇస్తూ పంట కొనుగోలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని తెలిపారు. పొరుగు రాష్ట్రాల్లో కొంటున్నా ఇక్కడ మాత్రం చేతులెత్తేశారని విమర్శించారు. ఈ రబీ సీజన్లో 5.02 లక్షల హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేశారని, వరి తర్వాత అదే ఎక్కువగా సాగులో ఉందని వివరించారు. 1.96 లక్షల హెక్టార్లలో మొక్కజొన్న వేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేయగా, అంతకుమించి రెండింతలు ఎక్కువ సాగు చేశారని పేర్కొన్నారు. 35 లక్షల టన్నుల దిగుబడి వచ్చిందని వివరించారు. దీంతో గిట్టుబాటు ధర రాక రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నారని వివరించారు. సమావేశంలో కూటమి పాలనలో యథేచ్ఛగా చట్టాల ఉల్లంఘన సాగుతోందని, ప్రభుత్వాన్ని విమర్శించినా, మాట్లాడినా అక్రమంగా కేసులు పెడుతున్నారని వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి విమర్శించారు.

టిడిపి అధికారిక సోషల్‌మీడియా ఖాతాల్లో వేలల్లో మార్ఫింగ్ పోస్టులు, వందల యూట్యూబ్ ఛానళ్లలో బూతు మాటలతో జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు పూడి శ్రీహరి విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని, కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా రాష్ట్ర పోలీసులు తీరు దారుణంగా ఉందని విమర్శించారు. టిడిపి ఎంపిలు ఢిల్లీలో రాష్ట్ర పరువు తీశారని, బిల్లును అంగీకరిస్తున్నారు.

# తిరుమల సమాచారం

## ఎస్వీ అన్నదానంకు భారీ విరాళం



**తిరుమల,ఏప్రిల్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అందిస్తున్న అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు భారీ విరాళాలందిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం విజయవాడకు చెందిన విజయలక్ష్మి వెలగపూడి కుటుంబసభ్యులు తిరుమలలో ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు 1.8కోట్ల రూపాయలు విరాళమిచ్చారు. ఈ విరాళాల చెక్కును టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరికి అందజేశారు.

## శ్రవణం తరగతి గదుల్లో ఆధునిక వసతులు

### - డిజిటల్ క్లాసుల ఏర్పాటుకు జెఇఒ ఆదేశాలు



**తిరుమల,ఏప్రిల్ 18ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో మూగ,చెవిటి పిల్లలకోసం నిర్వహిస్తున్న శ్రవణం పాఠశాల తరగతి గదుల్లో ఆధునిక వసతులు, డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేయాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ సూచనలు చేశారు. డే స్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించడం, శిక్షణ అనంతరం ఆధునిక వినికిడి పరికరాల పంపిణీ, మెరుగైన బోధనాంశాలు, బోధనా పద్ధతులు, స్టేషనరీ, స్టడీ మెటీరియల్, పాఠ్యాంశాలపై డిఇఒ టి. వెంకట సునీల్‌కు దిశానిర్దేశం చేశారు.శ్రీ వేంకటేశ్వర శ్రవణం సంస్థను జెఇఒ డాక్టర్ శరత్ శనివారం అధికారులతో కలిసి సమగ్రంగా పరిశీలించారు. చిన్నారుల జీవితాల్లో శ్రవణం ద్వారా వస్తున్న మార్పులను ప్రత్యక్షంగా తెలుసుకొని, సేవల మరింత మెరుగుదలకు పలు సూచనలు చేశారు. టిటిడి సమాచార కేంద్రాలు, కల్యాణ మండపాలు, ఎస్వీబీసీ ఛానల్, టిటిడి సామాజిక మాధ్యమం ,జిల్లా చైల్డ్ వెల్ఫేర్ ,దివ్యాంగుల శాఖలతో సమన్వయం చేసుకుని ప్రచారాన్ని విస్తరించాలని ఆదేశించారు. 2026-2027 విద్యాసంవత్సర ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సెలవులు ముగిసేలోపు పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కోరారు. పిల్లల తల్లులతో మమేకమై మాట్లాడిన జెఇఒ నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఆహారం అందుతున్నదా, శిక్షణ నాణ్యత ఎలా ఉందో, పిల్లలలో వచ్చిన పురోగతి, సౌకర్యాలపై సంతృప్తి స్థాయి వంటి అంశాలను తెలుసుకున్నారు. పలు ప్రాంతాల నుండి వచ్చిన తల్లులు శిక్షణపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తూ,“మూగ నోముతో వచ్చాం.. నవ్వు నోముతో వెళ్తున్నాం” అని భావోద్వేగంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ డి. ఫణికుమార్ నాయుడు, డిఇఒ టి. వెంకట సునీల్, అదనపు ఆరోగ్య అధికారి డాక్టర్ సునీల్, శ్రవణం ప్రాజెక్ట్ ఎఇఒ అమ్ములు, ఇఇ మల్లికార్జున ప్రసాద్, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి పాల్గొన్నారు.

## రామలక్ష్మణులను కించపరిచారంటూ నటుడు ప్రకాశ్‌రాజ్‌పై వందకోట్ల పరువునష్టం దావా

### - హిందువులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలి



**తిరుమల, ఏప్రిల్ 18ప్రభాతవార్తప్రతినిధి:** రామలక్ష్మణులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ నటుడు ప్రకాశ్ రాజ్‌పై టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి వంద కోట్ల రూపాయలకు దావా వేశారు. ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యల వల్ల హిందువుల మనోభావాల దెబ్బ తిన్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్‌పై భాను ప్రకాశ్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హిందువులు ఎంతో పవిత్రంగా కొలిచే భగవంతుడు రాముడిని, లక్ష్మణుడిని కించపరిచేలా చేసిన వ్యాఖ్యలతో హిందువుల మనోభావాలు దెబ్బతీశారన్నారు. వారం రోజుల్లోగా హిందువులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.రామలక్ష్మణులు ఉత్తరభారతదేశం నుంచి వచ్చిన వలస కూలీలు అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తరభారతదేశానికి చెందిన రామలక్ష్మణులు.. దక్షిణాదికి చెందిన రావణుడి పొలంలో పండ్లను దొంగతనం చేశారని అన్నారు. అయితే రామలక్ష్మణులను వలస కూలీలు అంటూ ప్రకాశ్‌రాజ్ చేసిన వ్యాఖ్యలపై హిందూ సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. దీంతో టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ తరఫు న్యాయవాది ప్రకాశ్ రాజ్‌కు లీగల్ నోటీసులు పంపించారు.అంతేగాక తిరుపతి జిల్లా ఎస్పీకి ఆన్లైన్ ద్వారా ఫిర్యాదు చేశామని, ప్రైవేట్ కేసు కూడా వేస్తున్నామన్నారు. ప్రకాష్ రాజ్ కు దమ్ము ధైర్యం ఉంటే తిరుపతికి రావాలని భాను సవాల్‌విసిరారు.

## తిరుపతిలో పుష్కరిణిల వద్ద జలహారతి



**తిరుపతి,ఏప్రిల్ 18ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర జలధార జల హారతి కార్యక్రమం శనివారం తిరుపతి జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు కలసి నిర్వహించారు. జలాలను సంరక్షించుకోవాలని కోరుతూ పలు పుష్కరిణీల వద్ద, నదీమాతలకు జలహారతి పట్టారు. తిరుపతిలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా శనివారం చెన్నారెడ్డి కాలనిలోని కృష్ణమ నాయుడు పుష్కరిణికి జలధార జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించి హారతులు సమర్పించారు. జల సంరక్షణ మనందరి బాధ్యత అని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ప్రతి శనివారం ఒక నినాదంతో ముందుకు వచ్చి ప్రజల్లో శుభ్రతపై చైతన్యం కలిగితున్నామని తెలుప్పారు. ఈ నెల వర్షపు నీటి పరిరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, భూగర్భ జలాల పరిరక్షణ పై ప్రజలకు అవగహన కల్పిస్తున్నామని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో అందరూ భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతతో పాటు ఇండ్లు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. నగరపాలక అదనపు కమిషనర్ శారదా దేవి మాట్లాడుతూ నీటి పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యమని, నీరు ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడ అభివృద్ధి జరిగితుందని తెలిపారు. భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వీటిపై అవగాహన కల్పిస్తూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కృష్ణమ నాయుడు పుష్కరిణిలో జలధార జలహారతి కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వేసవిలో నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం,డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి,ఆరోగ్యఅధికారి డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ,టిడిపి నేతలు వి.పుష్పావతియాదవ్, ,ఆర్.సి.మునికృష్ణ, నరేంద్ర, కంకణాల రజినీకాంత్‌నాయుడు, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, నరసింహ తదితరులు పాల్గొన్నారు. అలాగే చంద్రగిరి నియోజకవర్గంపరిధిలో పేరూరు చెరువు వద్ద నీటి సంరక్షణకు సుస్థిర ఆంధ్రకు మార్గం అనే కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పాల్గొని జలహారతి ఇచ్చారు. భూగర్భ జలాలను పెంపొందించడం, నీటి భద్రతను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం 'జలధారజలహారతి'. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

## తెలుగు ప్రజలకు శుభాలు కలగాలి: ప్రముఖులు



**తిరుమల,ఏప్రిల్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న సామాన్యభక్తులకు సౌకర్యాలు మెరుగుపరచి, క్యూలైన్ల నిర్వహణ అద్భుతంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు.తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ మంచి జరగాలని, రెండు తెలుగురాష్ట్రాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో అపోలో ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ సి.ప్రతాప్‌రెడ్డి,గోవా మంత్రి రామకృష్ణ అలియాస్ సుధీన్ ధవళికర్,తెలంగాణ ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్, 4.తెలంగాణ మాజీ ఎమ్మెల్యే కె చంద్ర పటేల్, కారుమూరి వెంకట నాగేశ్వరరావులు వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు.

ప్రకృతి సిద్ధంగా రావాల్సిన కాలాలు వెనకబడిపోతున్నాయి. వాతావరణంలో సంభవిస్తున్న అనూహ్యామార్పులు సామాన్యుడిని బెంబేలెత్తిస్తున్నాయి. నిన్నమొన్నటివరకు చలితో వణికిన ప్రజలు, ఒక్కసారిగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలను చూసి ఆందోళన చెందుతున్నారు. ఈఏడాది ప్రారంభంలోనే శీతాకాలం తన ప్రభావాన్ని కోల్పోయి, ఫిబ్రవరి నుండే వేసవి ఛాయలు మొదలయ్యాయి. గత 11 ఏళ్లుగా దేశంలో ఉష్ణోగ్రతలు వరుసగా రికార్డుస్థాయిలో నమోదవుతుండటం వాతావరణ మార్పుల తీవ్రతకు అద్దం పడుతోంది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడినఎల్‌నినో ప్రభావం వాతావరణాన్ని చల్లబరచాల్సి ఉన్నప్పటికీ, గ్లోబల్ వార్మింగ్ ఆ ప్రభావాన్ని పూర్తిగా అధిగమించింది. సముద్రపు ఉష్ణోగ్రతలు కూడా ఈ నెలకుగాను ప్రపంచవ్యాప్తంగా రెండవ అత్యంతవేడిగా నమోదయ్యాయి, ఫలితంగా ఫిబ్రవరిలోనే ఎండతీవ్రత పెరిగి, అనేక రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 5నుండి 7డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. వర్షపాతం విషయానికి వస్తే, ఫిబ్రవరిలో ఏకంగా 81శాతం లోటు నమోదైంది. కేవలం ఎండ మాత్రమేకాకుండా, గాలిలో తేమశాతం పెరగడంవల్ల వెట్‌బల్బ్‌టెంపరేచర్ స్థాయిలు పెరుగుతున్నాయి. సాధారణంగా గాలిపొడిగా ఉన్నప్పుడు ఎండను తట్టుకోవచ్చు.కానీ, తేమపెరిగితే చెమట ద్వారా శరీరం చల్లబడే శక్తిని కోల్పోతుంది. దీనివల్ల వడదెబ్బ, తీవ్రమైన డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ముంబై వంటి తీరప్రాంత నగరాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. మార్చి ప్రారంభంలోనే ముంబైలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం దీనికి నిదర్శనం. ఇప్పుడది 45 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ పట్ల ఇప్పటికైనా అప్రమత్తం కాకపోతే, భావితరాలకు మండుతున్న భూమిని కానుకగా ఇవ్వాల్సి వస్తుంది.

# నిప్పుల కొలిమిలా తెలుగు రాష్ట్రాలు

**సిహెచ్ వి వి రఘుబాబు**

ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వేసవిలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణంగా మే నెలలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ ఈసారి ఏప్రిల్‌లోనే ఎండలు ముదిరాయి. ఇండియాలో అత్యధిక ఉష్ణోగ్రతలు రాజస్థాన్ థార్ ఎడారి ప్రాంతంలో నమోదవుతుంటాయి. ఇక్కడ 50 డిగ్రీలకు పైగా ఉంటాయి. 2024లో ఢిల్లీలోని ముంగేష్‌పూర్‌లో 52.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డైనట్లు వార్తలు వచ్చాయి. రాజస్థాన్‌లోని ఫలోడిలో 19 మే 2016న 51 డిగ్రీల ఉష్ణోగ్రత అత్యధిక రికార్డుగా పరిగణించబడుతోంది. అయితే ఈ రికార్డును ఈసారి తెలుగు రాష్ట్రాలు బద్దలుకొడతాయా అనే స్థాయిలో టెంపరేచర్స్ నమోదవుతున్నాయి. ఎండలు, వడగాలుల విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు పోటీ పడుతున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఒకచోటుకు మించి మరోచోట అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దేశంలో ఎండల తీవ్రత పెరిగి పలు చోట్ల 44 డిగ్రీల నుండి 45డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మహారాష్ట్రలోని అకోలా, కర్ణాటకలోని కలబురగి ప్రాంతాల్లో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భానుడు తీవ్రరూపం దాల్చుతున్నాడు. రెండు రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 45డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ వేడితో పాటు వడగాల్పులు, ఉక్కబోతతో జనాలు భయపడిపోతున్నారు. రానున్న కొద్ది రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా ఒంటిమిట్టలో 45 డిగ్రీలు, నంద్యాల జిల్లా సంజామలలో 44.2 డిగ్రీలు, తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో 43.8డిగ్రీలు వంటి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల నుండి 48 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని, ప్రజలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా ఉష్ణోగ్రత రికార్డవ్వగా, 200కు పైగా మండలాల్లో 43 డిగ్రీలకు పైగా ఎండలు మండుతున్నాయి. రాబోయే రోజుల్లో 46మండలాల్లో తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విజయనగరం, పోలవరం, అల్లూరి సీతారామారాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 301 మండలాల్లో తీవ్ర వడగాల్పులు



వీస్తాయని హెచ్చరికలు జారీ చేసింది. ఇక 55 మండలాల్లో సాధారణ వడగాలులు ఉంటాయని తెలిపింది. ఇక పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు,రాయలసీమ, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 43 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తాజాగా అధికారులు హెచ్చరించారు. ఇక తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలునగరాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 నుంచి 44 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. అత్యధికంగా వరంగల్ జిల్లాలో 44 డిగ్రీలు నిర్మల్ జిల్లా తానూరులో 43.5 డిగ్రీలు, నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో 43.5 డిగ్రీలు నమోదయ్యాయి. ఇక రాబోయే రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని కొన్ని జిల్లాల్లో ప్రస్తుత ఉష్ణోగ్రతల కంటే 2,3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో వివిధ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయబడింది. ఎండల తీవ్రత క్రమంగా పెరగడంతో జిల్లాల్లో వడగాలులు నమోదయ్యాయి. మల్కాజిగిరి (మేడిపల్లి), దుండిగల్ (గండిమైసమ్మ, బాచుపల్లి), సంగారెడ్డి (హత్నూర, వట్పల్లి, సిర్గాపూర్, జిన్నారం, అమీన్‌పూర్), సిద్దిపేట (అక్కన్నపేట, సిద్దిపేట గ్రామీణం, అర్బన్) ,రంగారెడ్డి (కందుకూరు, యాచారం, గండిపేట, షాబాద్), కామారెడ్డి (పాల్వంచ,దోమకొండ), నల్గొండ (దేవరకొండ, అడవి దేవులపల్లి, చింతపల్లి), మెదక్ (కుల్చారం, చేగుంట), నిజామాబాద్ (బాల్కొండ, ముప్కల్), జిల్లాల్లో హీట్ వేవ్స్ నమోదయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో 44.4 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠఉష్ణోగ్రత నమోదయింది. ఈఏడాదిలో ఇంతవరకు ఇదే రికార్డు స్థాయిలో నమోదుకావడంగమనార్హం. మరో 9 జిల్లాల్లో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేటలో 44 డిగ్రీల సెల్సియస్ దాటింది. 8 జిల్లాల్లో 43 నుంచి 43.8 డిగ్రీల మధ్య 11 జిల్లాల్లో 42 నుంచి 42.9 మధ్య, 4 జిల్లాల్లో 41.541.8 మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఈమేరకు జిల్లాలకు తక్షణ చర్యలకు ఆదేశాలను జారీ చేసింది. జిల్లా కలెక్టర్లను నోడల్ ఆఫీసర్లుగా నియమిస్తూ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.దానకిశోర్ ఆదేశాలు జారీచేశారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి వైద్య, రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, నగరపాలక, మిషన్ భగీరథ, అగ్నిమాపక,కార్మిక తదితర శాఖల ఆధ్వర్యంలో ఉపశమన చర్యలు చేపట్టాలని ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఐదు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ఉమ్మడి ఖమ్మం, నిజామాబాద్,వరంగల్, నల్గొండ జిల్లాల్లో వడగాలులతో, సంబంధిత రుగ్మతలతో 10 మందికిపైగా మృత్యువాత పడ్డారు.రానున్న 6రోజులు మరింత అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.30వరకు హీట్‌వేవ్స్ వీచే అవకాశాలున్నాయి. ఈ హీట్ వేవ్స్ నమోదైన ప్రాంతాలను రెడ్ అలెర్ట్ జోన్లుగా పరిగణించాలని నిర్ణయించారు. ఈ ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకునేవిధంగా ప్రభుత్వ శాఖలు దృష్టికేంద్రీకరించాల్సి ఉంటుంది. ప్రధానంగా పాఠశాలల పనివేళలు కుదించాలి. లేదా తరగతులను రద్దు చేయడం ఉత్తమం. విద్యార్థులు సమయానికి నీళ్ల తాగేలా విద్యాలయాల్లో నీటి గంటలు కొట్టాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, చల్లదనం విషయంలో చర్యలు తీసుకునేవిధంగా విద్యాశాఖను అప్రమత్తం చేయాలని విపత్తుల నిర్వహణశాఖ కలెక్టర్లను ఆదేశించింది. దీంతోపాటు పలు చర్యలను సూచించింది. పలుచోట్ల కూలింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలి. బస్టాండ్లు, రద్దీ ప్రాంతాల్లో షెడ్లను నిర్మించాలి. వడగాలుల ముప్పున్న ప్రాంతాలు, అధిక ఉష్ణోగ్రత నమోదయ్యే చోట్ల చలివేంద్రాలు (మంచినీళ్లు), మజ్జిగ పంపిణీని చేపట్టాలి. వడగాలులకు సంబంధించిన కేసులు హాస్పిటల్‌లో నమోదైతే ప్రభుత్వానికి వెంటనే సమాచారం ఇవ్వాలి. బాధితులకు ఐస్‌ప్యాక్స్, కూలర్లు, ఏసీలు ఏర్పాటు చేసి ఉపశమనం కల్పించాలి.ఎండవేళ కార్మికులు విశ్రాంతి తీసుకునేలా చర్యలు చేపట్టాలి. భవన నిర్మాణాలు,ఇతర నిర్మాణ ప్రదేశాల్లో చల్లని నీళ్లు, నీడప్రాంతాలను ఏర్పాటు చేయాలి.వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు హీట్‌వేవ్స్ బారినపడే ప్రమాదం ఉన్నందున స్త్రీ,శిశు సంక్షేమ, వైద్య శాఖలు ముందస్తు చర్యలు తీసుకోవాలని విపత్తు నిర్వహణశాఖ అప్రమత్తం చేసింది. ఇదే సమయంలో తెలంగాణ జిల్లాలకువర్షాల పైన అలర్ట్స్ జారీఅయ్యాయి. దక్షిణ తెలంగాణలోనిజిల్లాలపై వర్ష ప్రభావం ఎక్కువగా ఉండనుంది. జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్గొండ,రంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడాఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈజిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లోఅలర్ట్ జారీచేసింది. రానున్న ఆరు రోజుల పాటు అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని హైదరాబాద్ వాతావరణశాఖ స్పష్టం చేసింది.19వ తేదీన ఖమ్మం, మెదక్, జగిత్యాల, ములుగు, కామారెడ్డి, భద్రాద్రికొత్తగూడెం, భూపాలపల్లి జిల్లాల్లో వర్షాలు పడనుండగా 20న నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, కరీంనగర్ జిల్లాల్లో వానలు పడతాయని అంచనా వేసింది. మొత్తంగా ఈ ఏడాది రోహిణీ కార్తె రాకుండానే భానుడి నిప్పుల వర్షానికి ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. ●

# ‘కమలం’ కమతం!

బీహార్

**ఎ.వి.వి ప్రసాద్**

ఎన్నో యేళ్ల కల మొత్తానికి ఫలించింది. మూడున్నర దశాబ్దాల క్రితం జరిగిన ఒక పరాభవం.. ఎట్టకేలకు అధికార పీఠాన్ని అందించింది. బిజెపి ఎంతో వ్యూహాత్మకంగా తన ‘సమ్రాట్టు’ ను అందలంపై నిలిపింది. ఒకప్పుడు బీహార్ అనగానే గుర్తొచ్చే పేరు లాలూయే. ఆయన హవా సాగిన కాలంలో బిజెపి ఎన్నో ఎదురు దెబ్బలు తింది. 1990 అక్టోబర్‌లో అద్వానీ రథయాత్రతో దేశమంతా సంచలనం సృష్టిస్తున్నపుడు ఆ యాత్రను అడ్డుకొనడానికి లాలూ అద్వానీ అరెస్టుకు ఆదేశించి అంత సంచలనాన్నీ సృష్టించారు. అది మొదలు బీహార్‌లో పట్టు పెంచుకొనడానికి ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్నీ చేసింది బిజెపి. స్థాన బలాన్ని క్రమంగా పెంచుకుంటూ వచ్చింది. తొలుత నితీష్ జెడియుతో పొత్తు కుదుర్చుకోవడం ద్వారా వేళ్లను విస్తరించిన బిజెపి ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి సీటునే కైవసం చేసుకొంది. అనారోగ్య కారణాలు కావొచ్చు,లేక ఇతరేతర ప్రయోజనాలు కావొచ్చు. నితీష్ సిఎం పదవి త్యజించడానికి నిర్ణయించడం బిజెపికి బాగా కలిసి వచ్చింది. ఆ నిర్ణయం ఆయన వ్యక్తిగతంగా తీసుకున్నదా, లేక ఒత్తిడులకు తలొగ్గారా అన్నది వేరే విషయం. ఇప్పటికే ఆయన ఓ పదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అనేక సార్లు రాజీనామాలు చేసి పొత్తులు మార్చారు,అధికారం కొనసాగించారు.ఎన్నిరంగులు మార్చినా అధికార హంగు జారకుండా జాగ్రత్త పడ్డారు. అందుకు ఆయన అనుసరించే వ్యూహాలు లాలూ వంటి ప్రత్యర్థులను సైతం ఆశ్చర్యపరిచేవి. తన అధికారం నిలుపుకొంటూనే,బిజెపితో పొత్తుతో ఆ పార్టీ బలపడడానికి కూడా ఆయనే దారులు వేశారు. ఇప్పుడు పూర్తిగా అధికారాన్ని అప్పగించి తాను రాజ్యసభలో ‘పెద్దరికం’ ప్రదర్శించడానికివెళ్లారు. అద్వానీకి జరిగిన అవమానం తర్వాత నుంచి బిజెపి చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తూ క్రమంగా రాష్ట్రమంతా తన బలాన్ని పెంచుకొంది.పార్టీ గత మూడున్నర దశాబ్దాలలో పెంచుకొన్న ఓట్ల శాతం చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. 1990లో కేవలం 11శాతం ఉన్న ఓట్లు 2025 నాటికి 20శాతానికి పెరిగాయంటే చిన్నవిషయం కాదు. 2015లో 24 శాతం దాకా కూడా వెళ్లి తర్వాత కొంత మేరతగ్గి, మళ్లీ పెరిగాయి.2020లో ఓట్లు19శాతానికి తగ్గినా,సీట్లు74కు చేరాయి. బీహార్ బిజెపి చరిత్రలో ఇది కీలక పరిణామం. క్రమంగా లాలూ ఆర్జేడీ బలహీనపడడం బిజెపి పరిధిని బాగా పెంచింది.గత బుధవారం (14, ఏప్రిల్) ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన సమ్రాట్ చౌధరి కూడా అప్పట్లో ఆర్జేడీలోనే రాజకీయ జీవితం ఆరంభించారు. తర్వాతనితీష్ నాయకత్వంలోని జెడియులోకి, ఆ తర్వాత బిజెపిలోకి వలస బాట పట్టారు. ఈ మధ్యలో ఆయన ఏ పార్టీలోఉన్నా కీలకమైన పదవుల్లోనే కొనసాగడం గమనించవలసిన అంశం. ఆర్జేడీ హయాంలో మంత్రిగా ఉన్న ఆయన నితీష్ పంచన చేరాక డిప్యూటీ సీఎం అయ్యారు. 2014 లో బిజెపిలోకి వచ్చిన తర్వాత కొంత కాలానికి పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు స్వీకరించి చక్రం తిప్పడం మొదలు పెట్టారు. బీహార్‌లో రాజకీయంగా బలమైన కుష్వాహ్ సామాజిక వర్గానికి చెందిన వారు కావడం, తండ్రి, తల్లి కూడా పట్టు ఉన్న రాజకీయ నేతలుకావడంతో తేలికగానే పలుమెట్లు ఎక్కగలిగారు. యాదవుల తర్వాత ఒబిసిలలో కుష్వాహాలు బలమైన సామాజిక వర్గం కావడంతో, ఆ వర్గం నేతగా సమ్రాట్టుకు బిజెపి తగిన ప్రాధాన్యం ఇవ్వడమే గాక అత్యున్నత స్థానాన్ని అందించింది. కొన్ని సందర్భాల్లో నితీష్‌తో పూర్తిగా విభేదించిన సమ్రాట్టు ఆయననుముఖ్యమంత్రి పీఠం నుంచి దింపేదాకా తాను ధరించిన తలపాగా తీయనంటూ శపథం కూడా చేశారు. అయితే 2024 జూలైలో బిజెపితో జెడియు పొత్తు కుదుర్చుకోవడం, ఆ తర్వాత ఎన్డీయే కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో తన ఒట్టును తీసి గట్టుమీద పెట్టి నితీష్‌తో చేతులు కలిపారు. కూటమి ప్రభుత్వాన్ని గౌరవిస్తున్నట్లుగా చెప్పి తలపాగాను అయోధ్యలో తీసేశారు. గతసంవత్సరం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బిజెపి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడుతుందనీ, సమ్రాట్టు సిఎం అవుతారనే అంతా భావించారు. ఆ ఎన్నికల్లో బిజెపికి 20 శాతం ఓట్లతో 74 సీట్లు రాగా, జెడియుకి 15 శాతం ఓట్లతో 43 సీట్లు మాత్రమే వచ్చాయి. అయితే వ్యూహంలో భాగం కావొచ్చు, నితీష్ నాయకత్వంలోనే ప్రభుత్వం ఏర్పడింది.రెండున్నరేళ్ల తర్వాత నితీష్ వైదొలగి సమ్రాట్టుకు అవకాశం ఇవ్వొచ్చని కూడా అప్పట్లో వినిపించింది. అయితే ఈలోగా బిజెపి వ్యూహం మారిందో, జెడియు వ్యూహం మారిందో కానీ నితీష్ రాజ్యసభకు దారి మార్చుకోవడం, వెంటనే సమ్రాట్టు ఆ స్థానంలోకి రావడం జరిగిపోయాయి.మూడేళ్ల క్రితం ఎవరు తనకు వ్యతిరేకంగా పనిచేశారో, ఆ సమ్రాట్టునే నితీష్ ముఖ్యమంత్రి సీటుకు ప్రతిపాదించడం ఆసక్తికర పరిణామం. రాజకీయాల్లో ఎప్పుడు ఎవరు ఎటువంటి పావులు కదుపుతారో చెప్పలేమనడానికి ఇదే తాజా ఉదాహరణ. ఈ మొత్తం ఉదంతంలో నితీష్ కుమారుడు నిశాంత్ కనబడకపోవడమే ఆశ్చర్యం కలిగించే అంశం. తండ్రిరాష్ట్ర రాజకీయాల నుంచి తప్పుకోనున్నారనే వార్తలు వ్యాపించిన తర్వాత నిశాంత్ హఠాత్తుగా జెడియు తీర్థం పుచ్చుకున్నారు. నితీష్ తర్వాత ఏర్పడే బిజెపి ప్రభుత్వంలో నిశాంత్‌కు డిప్యూటీ సిఎం పదవి లభించగలదనే ప్రచారం కూడా జరిగింది. అయితే సమ్రాట్టు కొలువులో నిశాంత్‌కు ఎలాంటి పదవి లభించనేలేదు. దీనిని బట్టి చూస్తే నితీష్ వ్యూహం కొంతవరకే ఫలించిందేమో! అనిపిస్తుంది. నితీష్ ఇక రాష్ట్ర రాజకీయాలలో తలదూర్చకపోవచ్చని కూడా తెలుస్తోంది. అంతా ఇక కమలం ‘కమత’మే సాగవచ్చు. ఆర్జేడీతో పాటు జెడియు కూడా నామమాత్రంగా మారేసూచనలు కనిపిస్తున్నాయి. సమ్రాట్టు పాలనా విధానాలు ఎలా ఉంటాయనే దానిని బట్టి బిజెపి భవిష్యత్తు నిర్ణయమవుతుంది. ●



సమ్రాట్ చౌధరి

# ఏకపక్ష పాలనకు చరమగీతం!

హంగేరీ

**గన్ని మోహన్**

ఐరోపాలోని చిన్నదేశంగా ఉన్న హంగేరీలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దశాబ్దాలపాటు పాలించిన విక్టర్ ఓర్బాన్ పాలనకు తెరపడింది. టిస్జా పార్టీ నేత పీటర్ మాగ్యార్ 70శాతం సీట్లను గెలుచుకుని కొత్త పాలనకు శ్రీకారం చుడుతోంది. టిస్జా పార్టీ గత వారం జరిగిన ఎన్నికల్లో 52శాతం ఓట్లు సాధించింది. 199 స్థానాలున్న హంగేరీ జాతీయ అసెంబ్లీలో ఓర్బాన్ పార్టీ ఫిడెస్జ్ 135 స్థానాల నుంచి 53 సీట్లకు పడిపోయింది. ప్రత్యర్థి మాగ్యార్ టిస్జాపార్టీ 140 స్థానాలు గెలుచుకున్న ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది.కొత్త పార్లమెంటు ఏర్పాటు కోసం మాగ్యార్ అధ్యక్షుడు తామస్ సుల్యోక్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు విజ్ఞప్తి చేసారు. వచ్చేనెల నాలుగోతేదీ లోపు పార్లమెంటు సమావేశం అయి పీటర్‌మాగ్యార్‌ను తమ నేతగా ఎన్నుకోవడం కేవలం లాంఛన ప్రాయం మాత్రమే. మీడియా స్వేచ్ఛను హరించడం వంటి పాత ప్రభుత్వం అనుసరించిన విధానాలన్నింటినీ ఆయన తొలగిస్తామన్న వాగ్దానం కూడా ఇచ్చేసారు. అధికారంలోకి రాగానే ఇకపై హంగేరీ పార్లమెంటులో కేవలం ఎవరు ఎన్నికైనా కేవలం రెండుపర్యాయాలు మాత్రమే ప్రధానిగా పనిచేసే విధంగా చట్టాన్ని తీసుకొస్తామని కూడా ప్రకటించేసారు. పాలనాపరమైన సంస్కరణలు అత్యవసరమని, అనివార్యమని పేర్కొంటున్న మాగ్యార్ అన్నిరంగాల్లోను సంస్కరణలు అవసరమని పేర్కొంటున్నారు. ఓటమిని అంగీకరించిన ఓర్బాన్ కొత్త ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేసారు. ఓర్బాన్ పార్టీ ఇప్పుడు 53 సీట్లతో పార్లమెంటులో ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వస్తోంది.ఈనెల 28వ తేదీనే పార్టీ నాయకత్వం సమావేశం ఉంది. అలాగే పార్టీ కాంగ్రెస్ సదస్సు కూడా జూన్‌లోనే నిర్వహించాల్సి ఉంది. అందువల్ల అప్పటివరకూ నాయకత్వ మార్పుకోసం వేచి ఉండవచ్చన్న అభిప్రాయం కూడా వ్యక్తం అవుతోంది. ఆర్థిక ప్రతిష్టంభన, ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, జీవన ప్రమాణాలు అడుగంటిపోతుండటంతో ప్రజల్లో ఓర్బాన్ పాలనపట్ల విముఖత పెరుగుతూ వచ్చింది. ఓర్బాన్ ఓటమి ఒక్క హంగేరీ దేశానికే కాకుండా 27 దేశాల కూటమి యూరోప్ దేశాలకు కూడా ఒక చెంపపెట్టులా పరిణమించింది. ఏకపక్ష నిర్ణయాలతో, ఏకస్వామ్యపాలన విధంగా పోయే నేతలకు ఇప్పుడు ఓర్బాన్ ఓటమి ఒక గుణపాఠంగా కనిపిస్తోంది. దశాబ్దకాలంగా హంగేరీ రాజకీయ వ్యవస్థను సమూలంగా మార్చేసిన ఓర్బాన్ మొత్తం తన గుప్పిట్లోకి తీసుకున్నారు. రాను రాను అన్ని అంశాల్లోను తనకే సర్వాధికారాలు సంక్రమించేవిధంగా వ్యవహరించారు. చివరకు న్యాయవ్యవస్థ అధికారాలను కూడా కుదించేసే చట్టాలు తీసుకువచ్చారు. అయితే ఇదేమీ మొదటిసారి ఓటమికాదు.2002 లో కూడా ఒకసారి ఓర్బాన్ ఓటమి చవిచూసారు. తిరిగి 2010లో మళ్లీ అధికారంలోకి రాగలిగారు. అయితే ప్రస్తుత ఎన్నికలను పరిశీలిస్తే ఆయన అనుసరించిన ఏకపక్ష పాలన వ్యవస్థలే ఆయన్ను గద్దెదించాయని చెప్పకతప్పదు. పాలనలో కొత్తసంస్కరణలు అనివార్యమని, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం, ద్రవ్యోల్బణం తగ్గించడంతోపాటు ఉపాధి అవకాశాలు పెంచడం, పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు యూరోపియన్ కూటమిలోనే అత్యంతశక్తివంతమైన దేశంగా హంగేరిని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మాగ్యార్ ప్రజలకు వాగ్దానాలు చేసారు.మాగ్యార్‌కుముందున్న లక్ష్యాల్లో ఐరోపా కూటమితో మరింతగా సత్సంబంధాలు నెలకొల్పడం, ప్రత్యేకించి బ్రస్సెల్స్‌తో క్షీణించిన సంబంధాలు పునరుద్ధరించుకోవడం, ఉక్రెయిన్‌పై నిర్ణయాల్లో సడలింపులు, స్తంభింపచేసిన ఐరోపా కూటమి నిధులు విడుదలచేయడం వంటివి ముందు లక్ష్యాలుగా ఉన్నాయి. అన్నింటికంటే ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించినప్పటి నుంచి ఆదేశంనుంచి హంగేరీలోనికే వలసలు పెరిగిపోయాయి. ఓర్బాన్ హయాంలో పాశ్చాత్యదేశాలవైపే ఎక్కువ మొగ్గు చూపించారు. అలాగే ఉక్రెయిన్‌కు రాజకీయ మద్దతుపట్ల కూడా కొంత విముఖంగానే కొనసాగారు. తన ఎన్నికలప్రచారంలో కూడా అదేవిధానం కొనసాగించారు.యూరోపియన్ యూనియన్‌తో ఉన్నకొద్దిపాటి తలనొప్పులు పరిష్కరించుకోవడం, ఉక్రెయిన్‌పై తన వైఖరిని స్పష్టంచేయడం, మాస్కోపట్ల తనవైఖరిని కూడా స్పష్టం చేయడంతోప్రజలు ఎన్నికల్లో మాగ్యార్‌కు బ్రహ్మరథం పట్టారు. రష్యానుంచి ఇంధన దిగుమతులపైనే ఆధారపడుతోంది. రష్యాసాయంతో పాక్ న్యూక్లియర్‌ప్రాజెక్టులు రెండింటినీ పూర్తిచేయడం,రక్షణ రంగంలో నిధులపెంపు వంటివి కొంత మాగ్యార్‌కు సవాలుగానే ఉంటుందని చెప్పవచ్చు. మధ్య యూరోప్‌లోని ఐరోపాదేశంగా ఉన్న హంగేరికి ఉత్తరాన స్లోవేకియా, ఈశాన్యంవైపు ఉక్రెయిన్, తూర్పు వైపు రొమేనియా, దక్షిణాన్న సెర్బియా, వాయవ్యంలో క్రోయేషియా, స్లోవేనియా, పశ్చిమాన ఆస్ట్రియాలున్నాయి. కోటి మంది కూడా జనాభాలేని ఈదేశంలో కేవలం 9.5 మిలియన్ల మంది మాత్రమే ఉన్నారు. అత్యధికంగా హంగేరియన్‌భాషనే అలవరచ్చుకున్న ఈదేశంలో జిడిపి కూడా గత ఏడాది అంచనాలనుచూస్తే 247.76 బిలియన్ డాలర్లుగాఉన్నాయి. తలసరి ఆదాయం కూడా అత్యధికంగానే ఉంది. ప్రపంచదేశాల్లో 50వ ర్యాంకుతో ఉన్న ఈదేశంలో తలసరి ఆదాయం25,920 డాలర్లుగా ఉంది. ఐరోపాకూటమిలోనే సుసంపన్న దేశంగా ఉన్న హంగేరీ ఇరుగుపొరుగునసే ఉన్న ఏడుదేశాలతో సత్సంబంధాలు పటిష్టం చేసుకోవడంతోపాటు దేశప్రజలకుఇచ్చిన హామీలు నెరవేర్చడం ప్రధానలక్ష్యం కొత్త నాయకత్వంపైఉంది. అన్నింటికంటే ముఖ్యంగా హంగేరీలో అవినీతి ప్రక్షాళన,న్యాయవ్యవస్థకు స్వయం ప్రతిపత్తితోపాటు ఆర్థికంగా సుసంపన్నం చేసుకోవాల్సిన అవసరం కొత్తనాయకుడు మాగ్యార్‌భుజస్కందాలపై ఉన్నాయి.హంగేరీసార్వభౌమత్వాన్ని చెక్కుచెదరకుండాపరిరక్షించుకోవడం కూడా అధికార టిస్జా పార్టీకి తక్షణ కర్తవ్యం అని ప్రత్యేకించి చెపాల్సిన పనిలేదు. ●



పీటర్ మాగ్యార్

# పల్లె సంస్కృతి కనుమరుగవుతుందా!

**కాలగిరి శ్రీనివాస్ రెడ్డి**

సమిష్టి సహజ జీవనం నుంచి ఏకాంత ఆధునికత వరకు తెలుగు పల్లె.. ఒకప్పుడు అది కేవలం నివాస స్థలంకాదు. అది జీవించే సంస్కృతి, ఊపిరి తీసుకునే ప్రకృతి, అనుబంధాలతో నిండిన ఒక సజీవ ప్రపంచం.ఉదయం సూర్యుడు కిరణాలు నులివెచ్చగా తాకుతుంటే, గేదెల మేతకు వెళ్లే అడుగుల శబ్దం, కోళ్ల కూతలతో మేల్కొనే ఇళ్లు, ఎడ్లబండ్ల చక్రాలు నెమ్మదిగా తిరుగుతూ ఊరి దారుల్లో వినిపించే‘క్రిక్ క్రిక్’ శబ్దాలు.. ఇవన్నీ కలిసి ఒక సహజ సంగీతంగా ప్రతి రోజును ఆరంభించేవి. పెరట్లో పిల్లలు ఆడుకునే నవ్వులు, పెద్దలు చెట్టు కింద కూర్చొని చెప్పుకునే కథలు,ఆవుల అరుపులు, గాలిలో తేలే పంటల వాసన ఇవ్వన్నీ కలిసినప్పుడు పల్లె జీవితం ఒక మధురమైన గీతంలా అనిపించేది.ఆ పల్లెల్లో ప్రతి మనిషి ఒకరికొకరు తోడుగా ఉండేవారు. ప్రతిఇల్లు మరొక ఇంటికి దగ్గరగా ఉండేది.ప్రతి జీవి,ప్రతి చెట్టు, ప్రతి పంట ఒక అనుబంధంతో జీవించేది.పశువులు కేవలం ఆస్తి కాదు. అవి కుటుంబ సభ్యులు. పంటలు కేవలం ఆహారం కాదు, జీవనాధారం.పండుగలు కేవలం వేడుకలు కాదు, మనసులను కలిపే బంధాలు.ఆ జీవన విధానంలో ఒంటరితనం అనే మాటే లేదు. కానీ కాలం మారింది. అదే పల్లె ఇప్పుడు నిశ్శబ్దంగా మారిపోయింది.ఎడ్లబండ్ల శబ్దం తగ్గిపోయింది. పశువుల అరుపులు అరుదైంది, పెరట్లో నవ్వుల కంటే యంత్రాల గర్జన ఎక్కువైంది. సమిష్టి జీవనం క్రమంగా వ్యక్తిగత జీవితంగా మారింది. ఒకప్పుడు ప్రకృతి గుండెలో కట్టుకున్న ఆ పల్లె ఇప్పుడు యాంత్రిక ప్రపంచపు అంచుల్లో నిలబడి తన గతాన్ని గుర్తు చేసుకుంటోంది. గతంలో ప్రతి ఇంటి పెరట్లో పశువుల కొట్టం ఉండేది. ఉదయం మేతకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చి ఇంటి ముందు నిలబడే ఆ దృశ్యం పల్లెకు ప్రాణం. పెరట్లో తిరిగే కోళ్లు, గొర్రెలు, మేకలు ఇవన్నీ కలిసి గ్రామానికి సహజ స్వరాల్ని అందించేవి. ధాన్యం నిల్వ కోసం గుమ్ముల దొడ్డి ప్రతి ఇంటిలో ఉండేది. వడ్లు, జొన్నలు, సజ్జలు, కొర్రలు ఇవి ఎండలో ఎండబెట్టి ఏడాది పొడవునా నిల్వ చేసుకునేవారు. ఇది స్వయం సమృద్ధి స్పష్టమైన రూపం. వ్యవసాయం కూడా సమిష్టి పద్ధతిలో జరిగేది. ఒకరి పంట పనికి మరొకరు తోడుగా ఉండేవారు. ‘ఒకరికొకరు తోడు’ అనేది మాట కాదు. జీవన విధానం.ఎండాకాలంలో ఆరుబయట నిద్రించడం, ఆకాశం చూస్తూ కథలు చెప్పుకోవడం, పాటలు పాడుకోవడం.ఇవి కుటుంబ బంధాలను బలపరిచే అనుభవాలు. పల్లెల్లో పండుగలు కేవలం ఆనంద క్షణాలు కాదు. అవి ప్రకృతి, పశువులు, మనుషులు ఈ మూడింటి మధ్య ఉన్న అవినాభావ బంధానికి ప్రతీకలు. ప్రతి పండుగవెనుక ఒక జీవన తత్వం, ఒక కృతజ్ఞత భావం, ఒక సమిష్టిఆత్మ దాగి ఉండేది. పొలాల అమావాస్య రోజున పశువులను కృతజ్ఞతాపూర్వకంగా పూజించి, రైతు తన భూమికి నమస్కరిస్తూ, పంటకు పునాది అయిన ప్రకృతిని స్మరించేవాడు. సంక్రాంతి పండుగ రాగానే పల్లె మొత్తం ఒక పండుగ వాతావరణంగా మారేది. ఉగాది కొత్త సంవత్సరాన్ని మాత్రమే కాదు, కొత్త ఆశలను, కొత్త పంటల ఆశీస్సులను తీసుకొచ్చేది. జాతరలు అయితే పల్లె సంస్కృతికి జీవంతమైన ప్రతిబింబాలు. ఎడ్లబండ్లపై కుటుంబాలంతా కలిసి ప్రయాణిస్తూ,దారిలో పాటలు పాడుకుంటూ, గమ్యానికి చేరుకుని రాత్రంతా బుర్రకథలు, జానపద నృత్యాలతో మెలకువగా గడిపే ఆ వేళలు. అవి కేవలం వినోదం కాదు, ఒక సామాజిక ఉత్సవం, ఒక సాంస్కృతిక పాఠశాల.చిన్నా పెద్దా, ధనికా పేదా అనే తేడా లేకుండా అందరూ ఒకే చోట చేరి ఆనందాన్ని పంచుకునే అరుదైన సందర్భాలు అవి. ఈ పండుగలు పల్లె జీవనానికి ప్రాణం పోసేవి. అవి మనుషులను ఒకే తాటిపై నిలబెట్టేవి, అనుబంధాలను బలపరచేవి, ‘మనం ఒకటే’ అనే భావాన్ని నాటేవి. ప్రతి ఇంటి ఆనందం ఊరి ఆనందంగా మారేది. ప్రతి ఒక్కరూ ఒక కుటుంబంలా కలిసే ఆ క్షణాలు. ఇవే పల్లె సంస్కృతికి అసలు శ్వాస. భారత వ్యవసాయ చరిత్రలో ఒక కీలక మలుపు. అది పంటల ఉత్పత్తిని పెంచింది, ఆకలిని తగ్గించింది, దేశాన్ని ఆహార భద్రత వైపు నడిపించింది. ఇవన్నీ



అనన్యసాధారణ విజయాలే. కానీ అదే సమయంలో, గ్రామీణ జీవనవిధానాన్ని మౌనంగా,గమనించలేని విధంగామార్చేసిన విప్లవం కూడా అదే. ఒకప్పుడు ఎడ్లబండ్ల చక్రాల మోగింపుతో నిండిన పల్లె దారులు, నేడు ట్రాక్టర్ల గర్జనతో మార్మోగుతున్నాయి. ఎడ్లు, ఆవులు, గేదెలు వ్యవసాయానికి ప్రాణంగా ఉన్న ఈ జీవాలు క్రమంగా యంత్రాల ముందు వెనుకంజ వేశాయి. పశువులపై ఆధారపడిన సాగు పద్ధతులు తగ్గిపోగా,రసాయనిక ఎరువులు, పురుగు మందులు, హైబ్రిడ్ విత్తనాలు వ్యవసాయాన్ని పూర్తిగా మార్చేశాయి. రైతు ప్రకృతితో మాట్లాడే వ్యక్తి నుంచి మార్కెట్‌తో లెక్కలు చూసే వ్యక్తిగా మారాల్సి వచ్చింది. యాంత్రీకరణ వేగం పెరిగింది. పని త్వరగా పూర్తయ్యేది. కానీ మనుషుల మధ్య ఉన్న ఆప్యాయత తగ్గింది. ఒకప్పుడు పంటనాటడం, కోత, నూర్పిడి ఇవన్నీ కలిసి చేసే సామూహిక కార్యక్రమాలు. ఇప్పుడు అవి యంత్రాల చేతుల్లోకి వెళ్లడంతో, ‘ఒకరికొకరు తోడు’ అనే భావన క్రమంగా మసకబారింది. పని వేగంగా పూర్తయినా, మనసుల మధ్య దూరం పెరిగింది. ఇంకా ఒక ముఖ్యమైన మార్పు వలసలు.పల్లెల్లో అవకాశాలు తగ్గిపోవడంతో యువత నగరాలవైపు అడుగులువేసింది. చదువు, ఉద్యోగం, జీవనోపాధి కోసం ఊరిని వదిలి వెళ్లిన వారు తిరిగి రావడం తగ్గింది. పల్లెల్లో పెద్దలు, వృద్ధులు మాత్రమే మిగిలారు.చిన్న చిన్న భూములుగా విభజన,వ్యక్తిగత వ్యవసాయం పెరగడం కూడా సమిష్టి జీవనాన్ని దెబ్బతీశాయి.ప్రతి రైతు తన భూమి,తన లాభం, తన సమస్యలతోనే పరిమితమయ్యాడు. ఒకప్పుడు ఊరి మొత్తం కలిసి పనిచేసిన వ్యవసాయం, ఇప్పుడు వ్యక్తిగత బాధ్యతగా మారింది. ఈ మార్పులన్నింటి ఫలితంగా పల్లెల్లో వినిపించే శబ్దాలు కూడా మారిపోయాయి. హరిత విప్లవం మనకు అన్నం ఇచ్చింది. కానీ అదే సమయంలో పల్లె జీవనంలో ఉన్న ఆత్మీయతను, సమిష్టి భావనను కొంతవరకు దూరం చేసింది. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే. అభివృద్ధి పేరుతో మనం పొందిన దానికంటే, కోల్పోయింది ఎక్కువా? లేదా రెండింటి మధ్య సమతుల్యత సాధించగలమా? ఈ ప్రశ్నకు సమాధానం వెతుక్కోవాల్సిన సమయం ఇదే.ఈ మార్పు కేవలం ఆర్థిక వ్యవస్థలో వచ్చిన పరిణామం మాత్రమే కాదు. అది నిశ్శబ్దంగా చోటుచేసుకున్న ఒక గొప్ప సాంస్కృతిక నష్టం. ఒకప్పుడు పల్లె జీవనం ప్రకృతితో ముడిపడి, పశువులతో ఆధారపడి, మనుషుల మధ్య అనుబంధాలతో నిండిపోయి ఉండేది. కానీ ఆ ఆధారం క్రమంగా దెబ్బతినడంతో, ఆ జీవన విధానం కూడా మెల్లగా కరిగిపోతోంది. పశువుల సంఖ్య తగ్గిపోవడం కేవలం పాల ఉత్పత్తి తగ్గడమే కాదు. అది సేంద్రీయ వ్యవసాయానికి బలమైన ఆధారం కోల్పోవడం. ఆవుల ఎరువు, గోమయం, సహజ మూలికలతో సాగిన వ్యవసాయం ఇప్పుడు రసాయనాలపై ఆధారపడుతోంది. దాంతో భూమి ఫలదీకరణం మాత్రమే కాదు, రైతు ప్రకృతితో ఉన్న అనుబంధం కూడా తగ్గిపోయింది. స్థానిక పశు జాతులు, సంప్రదాయ విత్తనాలు ఇవి కేవలం జీవ వైవిధ్యం కాదు, పల్లె సంస్కృతికి మూలాలు. కానీ ఇవి ఇప్పుడు క్రమంగా అంతరించిపోతున్నాయి. వాటి స్థానంలో హైబ్రిడ్ జాతులు, వాణిజ్య విధానాలు వచ్చాయి.ఫలితంగా మనకు లాభాలు వచ్చి ఉండొచ్చుకానీ మన గుర్తింపు, మన మూలాలు మసకబారుతున్నాయి. ప్రకృతితో కలిసి మెలిసి జీవించడం, సమాజంతో కలిసి ముందుకు సాగడం,స్వయం సమృద్ధిని సాధించడం. ఇవన్నీ ఆ కాలపు పల్లె మనకు అందించిన అమూల్యమైన పాఠాలు. నేడు అభివృద్ధి పరుగులో మనం ఆ పాఠాలను మరచిపోయినా ఇప్పుడు తిరిగి వాటి విలువను అర్థం చేసుకునేదశకు వచ్చేశాం. ‘ఒకప్పుడు ఉన్న ఒకరికొకరు తోడు’ అనే భావనను ఆధునిక రూపంలో తిరిగి తీసుకురావడం ద్వారా రైతులు ఆర్థికంగా, సామాజికంగా బలపడతారు. సమిష్టి కృషి, పంచుకునే వనరులు, పరస్పర సహకారం ఇవి పల్లె జీవనానికి మళ్లీ ప్రాణం పోస్తాయి. పల్లె పండుగలను కూడా కేవలం ఆచారాలుగా కాకుండా, సంస్కృతిగా పునరుద్ధరించాలి. ఇది కేవలం గతాన్ని గుర్తుచేసుకోవడం కాదు. అది మన భవిష్యత్తును కాపాడుకునే ప్రయత్నం. అభివృద్ధి అనే దారిలో ముందుకు సాగుతూనే, మన మూలాలను మరచి పోకుండా, ప్రకృతితో సమతుల్యంగా జీవించే మార్గాన్ని ఎంచుకోవడం అత్యవసరం. పల్లె జీవనం మళ్లీ పునర్జీవం పొందాలంటే మార్పు బయట నుంచి రాదు అది మన ఆలోచనల్లో, మనచర్యల్లో మొదలవాలి. ఇదే నిజమైన పునరుద్ధరణ. ●

# పొలం ఆక్రమించారు న్యాయం చేయాలని రాస్తారోకో

-భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్
-పొలాలు ఆక్రమిస్తున్నారని అడిగినందుకు దౌర్జన్యం
-ఇరువురు రైతులకు గాయాలు

**పొన్నూరు, ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** చేబ్రోలు మండల పరిధిలోని నారాకోడూరు గ్రామానికి చెందిన పలువురు రైతులకు సంబంధించిన భూములు బుడంపాడులో ఉన్నాయి. అయితే ఈ పొలాలను గుంటూరుకు చెందిన కొందరు ఆక్రమించారు. అదేమని నారాకోడూరు గ్రామానికి చెందిన రైతులు అడిగితే ఇరువురు రైతులపై దౌర్జన్యానికి దిగి గాయపరిచారు. గాయపడిన రైతులు గుంటూరులో చికిత్స పొందుతున్నారు. పొన్నూరు, బాపట్ల, చీరాల, రేపల్లె వైపు వెళ్ళే వాహనాలు భారీగా నిలిచిపోయాయి. తమకు



పొలాన్ని నమ్ముకొని వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్న తమపై గుంటూరుకు చెందిన కొందరు దౌర్జన్యం చేయడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నారాకోడూరు సెంటర్‌లో పెద్ద ఎత్తున రాస్తారోకోకు దిగారు. దీంతో గుంటూరు నుంచి తెనాలి వెళ్ళే వాహనాలు, గుంటూరు నుంచి చేబ్రోలు, న్యాయం జరిగే వరకు రాస్తారోకో విరమించేది లేదని రైతులు భీష్మించారు. విషయం తెలుసుకొన్న పొన్నూరు రూరల్ సిఐ కృష్ణయ్య, చేబ్రోలు ఎస్సైలు రాస్తారోకో చేస్తున్న ప్రాంతానికి వచ్చారు. రైతులతో మాట్లాడుతున్నారు. రైతులు మాత్రం తమకు న్యాయం జరిగేవరకు రాస్తారోకో విరమించమని, తమపై దౌర్జన్యం చేసిన దుండగులను అరెస్టు చేసి శిక్షించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల కోసం నిరసన

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఏప్రిల్18, ప్రభాతవార్త:** అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్ఎఫ్) ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏఎన్‌యు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ ఇన్‌చార్జ్ పి.నాసరయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యా రంగంలో ఉన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం అధికారంలోకివచ్చిన 90రోజుల్లో పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని ప్రకటించారని దానిని అమలు చేయకపోవడం సరికాదని వాపోయారు. విద్యార్థులకు కోర్సులు పూర్తవుతున్నప్పటికీ వారి కాతాల్లో బకాయిలు జమకాలేదని విమర్శించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంలో వర్సిటీ ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు వెంకటేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి అఖిల్, గోపీ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు వార్త

## బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ

**గుంటూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త ప్రతినిధి :** బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. శత శాతం పిల్లలు ప్రభుత్వ బడిలో నమోదు అయ్యే విధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం భాషా, ఇతర అధికారులతో శనివారం టెలి కాన్ఫరెన్స్ లో ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, ప్రామాణిక విద్య అందించాలనే లక్ష్యంతో బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అవగాహన ర్యాలీలను నిర్వహించాలని సూచించారు. ప్రతి చిన్నారి బడిలో ఉండాలని, విద్యకు దగ్గర కావాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మౌలిక సదుపాయాలు ఉన్నాయని, మంచి అర్హత, నైపుణ్యం గల ఉపాధ్యాయులు బోధిస్తారని, ఉచిత పుస్తకాలు పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం, యూనిఫామ్, బూట్లు వంటి సామాగ్రి అందించడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని పేర్కొన్నారు.బడి పిలుస్తోంది కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో నమోదు శాతం పెంచడం, డ్రాప్‌అవుట్‌లను



తగ్గించడం లక్ష్యమని తెలిపారు. ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి ఇంటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్వాడీల నుండి పాఠశాలకు చేరే విద్యార్థులు విధిగా ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా మ్యాపింగ్ జరగాలని సూచించారు. ఈ నెల, 20 21 తేదీల్లో విద్యార్థుల సర్వే నిర్వహించాలని ఆదేశించారు. 22వ తేదీన ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని, 23వ తేదీ నాటికి పాఠశాలలో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు.

# గుంటూరు జిల్లాలో జలధార జలహారతికి శ్రీకారం

**గుంటూరు ఏప్రిల్ 18, ప్రభాతవార్త ప్రతినిధి :** గుంటూరు జిల్లాలో జలధార జలహారతి కార్యక్రమమనికి జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ శ్రీకారం చుట్టారు. శనివారం ఫిరంగిపురం మండలం హౌస్ గణేష్ గ్రామంలో జలధార జలహారతి, స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. హౌస్ గణేష్ చెరువు పనులను జలధార జలహారతి కార్యక్రమంలో భాగంగా





స్థానికులతో కలసి ప్రారంభించారు. హౌస్ గణేష్ చెరువు 109 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. 192 ఎకరాల ఆయకట్టు కలిగి ఉంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జల ధార జల హారతి వంద రోజుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గుంటూరు జిల్లాలో వెయ్యికి పైగా చెరువులు ఉన్నాయని, ప్రతి చెరువును నిండు కుండలా చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రతి చెరువులో పూడికలు తీసి నీటి నిలువ సామర్థ్యాన్ని పెంచాలని అన్నారు. జల వనరులు మనిషి మనుగడకు, భవిష్యత్తుకు ఎంతో అవసరమని, భావి తరాలకు మనం అందించాల్సిన గొప్ప వనరు అన్నారు. జిల్లాలో ప్రతీ చెరువును నీటితో నింపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, ఉన్న చెరువులను గరిష్ట ప్రయోజనకారంగా మార్చుటకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

**వాటర్ పాజిటివ్ ఆంధ్రా థీమ్ తో సాసా..**

స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంను వాటర్ పాజిటివ్ ఆంధ్రా థీమ్ తో నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. జలధార జలహారతి కార్యక్రమానికి స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అనుసంధానం చేసుకోవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మన బాధ్యతగా గుర్తించాలని, దానితోపాటు నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాల్లో ఎక్కడా ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రతీ నీటి బొట్టును ఒడిసి పట్టడం ద్వారా భూగర్భ జలాలు పెంచుదామని, తద్వారా భూగర్భ జలాల వినియోగానికి విద్యుత్ ఛార్జీలు ఆదా అవుతుందని చెప్పారు. జల ధార జల హారతి వంద రోజుల కార్యక్రమంలో జిల్లా ఆదర్శంగా నిలవాలని, అందుకు ప్రజలు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, నీటి వినియోగదారులు సంఘం అధ్యక్షుడు వేల్పుల అంకారావు, ఉపాధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సాగర తీరంలో సాహస క్రీడలు!

## నేడు వాడరేవు, రామాపురం బీచ్‌లలో ప్రారంభం -పారాగ్లైడింగ్ ట్రయల్ రన్ విజయవంతం

**బాపట్ల,ఏప్రిల్ 18, ప్రభాతవార్త ప్రతినిధి:** బాపట్ల జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. పర్యాటకులను ఆకర్షించేందుకు వాడరేవు, రామాపురం బీచ్‌లలో అడ్వెంచర్ టూరిజం స్పోర్ట్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వెల్లడించారు. శనివారం వేటపాలెం మండలం రామాపురం బీచ్‌లో ఏర్పాటు చేసిన ట్రయల్ రన్‌ను ఆయన ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్యతో కలిసి పరిశీలించారు.ముందుగా జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కె. వినయ్ ఆధ్వర్యంలో పారా గ్లైడింగ్ ట్రయల్ రన్



నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య స్వయంగా పారా గ్లైడింగ్ చేస్తూ ఆకాశంలో విహరించారు. గాలిలో ప్రయాణిస్తూ కింద ఉన్న సముద్ర అందాలను వీక్షించి యువతలో ఉత్సాహాన్ని నింపారు. విహాంగ్ అడ్వెంచర్స్ కెప్టెన్ సూర్య, టూరిజం డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్యలతో కలెక్టర్ మాట్లాడి ఏర్పాట్లపై ఆరా తీశారు.

**నేడు మంత్రి చేతుల మీదుగా ప్రారంభం :** వాడరేవు, రామాపురం బీచ్‌లలో



ఏర్పాటు చేసిన పారా గ్లైడింగ్, పారా సైలింగ్, జెట్ స్కీ వంటి సాహస క్రీడలను ఆదివారం జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారికంగా ప్రారంభిస్తారు అన్నారు.చీరాల ప్రాంతంలో అడ్వెంచర్ స్పోర్ట్స్ ప్రారంభించడం ఇదే తొలిసారి. హైదరాబాద్ నుంచి నేరుగా జాతీయ రహదారి ద్వారా కేవలం 5 గంటల్లోనే వాడరేవుకు చేరుకునే వీలుండటంతో పర్యాటకుల రద్దీ పెరుగుతుందన్నారు.స్థానిక మత్స్యకార యువతకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.సాహస క్రీడల నిర్వహణకు అధికారికంగా అన్ని అనుమతులు పొందినట్లు స్పష్టం చేశారు.బ్లూఫ్లాగ్ గుర్తింపు: త్వరలోనే జిల్లాకు బ్లూఫ్లాగ్ బృందం రానుందన్నారు.పర్యాటక అభివృద్ధి నేపథ్యంలో బీచ్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి అలీ అస్గర్, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, ల్యాండ్ సర్వే ఏడీ శేషగిరిరావు, డీపీఓ ప్రభాకర్ రావు, మున్సిపల్ కమిషనర్ డానియల్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతిగా..మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు

మిర్చి పంటను విక్రయించి మోసపోయిన రైతులు
రైతులకు అండగా నిలిచి రూ.10 లక్షలు ఇప్పించిన చైర్మన్
రైతులను మోసం చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరిక

**గుంటూరు ఏప్రిల్ 18 ప్రభాత వార్త ప్రతినిధి :** పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బట్లూరు గ్రామానికి చెందిన రైతులు తెలుకుట్ల శ్రీనివాసరావు , బొమ్మనబోయిన సాయి అనే ఇద్దరు రైతులు ఒక మధ్యవర్తి ద్వారా మిర్చి పంటను విక్రయించారు. అయితే మిర్చి పంటను కొనుగోలు చేసిన సదరు మధ్యవర్తి రైతులకు డబ్బులు చెల్లించకుండా మోసం చేశాడు. ఈ క్రమంలో బాధిత రైతులు గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావును కలిసి



తమ గోడు వెళ్లబోసుకున్నారు. మధ్యవర్తి తమను మోసం చేసిన తీరును మిర్చి యార్డు చైర్మన్ కు రైతులు వివరించారు. దీని పై తక్షణమే స్పందించిన యార్డు చైర్మన్ రైతులకు న్యాయం లక్ష్యంతో చర్యలు ప్రారంభించారు.ఈ ఘటనలో రైతుల నుండి మిర్చి పంటను కొనుగోలు చేసిన వ్యాపారస్థుడితో చైర్మన్ నేరుగా చర్చలు జరిపారు. ఈ క్రమంలో వ్యాపారస్థుడి నుండి రూ.10 లక్షలను రైతులకు ఇప్పించి తక్షణ ఉపశమనం కల్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ మిర్చి కొనుగోలు పేరుతో రైతులను మోసం చేయడం , డబ్బులు చెల్లించకుండా తాత్సారం చేయడం , మరే విధమైన ఇబ్బందులకు గురిచేసిన సహించేది లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా రైతులు దళారులను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, తమ పంటలను నేరుగా మిర్చి యార్డ్‌లోనే విక్రయించాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యార్డ్ డైరెక్టర్లు నక్కాల వంశీ కృష్ణ, జాన్ సైదా ,తదితరులు పాల్గొన్నారు.

**అంబటి దీక్ష దెయ్యాలు వేదాలు వల్లించినట్లే..**
**వైసీపీ నేత అంబటి రాంబాబు నిరసన దీక్షపై**

గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ కుర్రా అప్పారావు తీవ్రంగా స్పందించారు.అంబటి నిరసన దీక్ష చేపట్టే ముందు తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన విషయాలను గుర్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజావేదిక కూల్చివేత నుండి ప్రారంభమైన విధ్వంస పాలనలో తీసుకున్న అనేక నిర్ణయాలు అప్పట్లోనే పెద్ద వివాదాలకు దారితీశాయని గుర్తు చేశారు. వైసీపీ పాలన తీరుపై పెద్దఎత్తున విమర్శలు వచ్చిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. గత ప్రభుత్వంలో అన్యాయాల పై మాట్లాడితే కేసులు పెట్టడం, పోలీసులతో కొట్టించడం వంటి ఘటనలు జరిగాయని అన్నారు. ఇవి ఆరోపణలు మాత్రమే కాదని ప్రజలు చూసిన యదార్థ ఘటనలని చైర్మన్



పేర్కొన్నారు. గుడ్డ కాల్చి మొహం మీద వేసినట్టుగా ఇప్పుడు అంబటి మాట్లాడటం సరైంది కాదని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో పోలీస్ వ్యవస్థ దుర్వినియోగం, ప్రతిపక్షాలపై చర్యలు వంటి అంశాలు ప్రజల్లో అసంతృప్తిని పెంచాయని తెలిపారు. అందుకే ప్రజలు తమ తీర్పును స్పష్టంగా ఇచ్చారని, ఎన్నికల్లో వైసీపీకి కేవలం 11 సీట్లు రావడమే ఇందుకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఇప్పుడు నిరసన దీక్షల పేరుతో దెయ్యాలు వేదాలు వల్లించినట్టు మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. ప్రజలు నేడు రాజకీయాలు కాకుండా అభివృద్ధి, రైతుల సంక్షేమం, యువతకు అవకాశాలు వంటి అంశాలు కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

# పోతురాజుగుట్టలో కార్డెన్ సెర్చ్

## -30 ద్విచక్రవాహనాలు, ఆటో, మారణాయుధాలు స్వాధీనం

**కారంపూడి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పేటసన్నెగండ్ల పోతురాజుగుట్ట కాలనీలో శనివారం ఉదయం పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు గురజాల డీఎస్పీ మహేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల



నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి ఇళ్లు, దుకాణాలు, ప్రదేశాలను సోదాలు చేశారు. సరైన పత్రాలు లేని 30 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో స్వాధీనం



చేసుకున్నారు. గురజాల డీఎస్పీ మహేశ్వరరావు డ్రగ్స్ వద్దు నినాదంతో స్థానిక ప్రజలతో కలిసి గంజాయికి వ్యతిరేకంగా గంజాయిని పారదోలదాం - డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడదాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ తనిఖీల్లో కారంపూడి సీఐ పి.శరత్‌బాబు, దాచేపల్లి సీఐ ఎం.రాజేష్, కారంపూడి ఎస్సై ఎం.వాసు, రెంటచింతల ఎస్సై నాగార్జున, మాచర్ల రూరల్ ఎస్సై సంధ్యారాణి, పిడుగురాళ్ల ఎస్సై మోహన్, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల రహిత జిల్లాగా గుంటూరు ఆవిర్భవించాలి

**గుంటూరు ఏప్రిల్ 18 ప్రభాతవార్త ప్రతినిధి :** బాల్య వివాహాల రహిత జిల్లాగా గుంటూరు జిల్లా ఆవిర్భవించాలని రాష్ట్ర చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు పి.పద్మలత పిలుపునిచ్చారు. బాల్య వివాహాలు నియంత్రణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశంలో చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు పి.పద్మలత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాల వివాహ ముక్త్ కార్యక్రమాన్ని అమలు చేస్తూ బాల్య వివాహాలు నివారణకు కృషి చేస్తుందన్నారు. మహిళ శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారులు స్పష్టమైన వివరాలు కలిగి ఉండాలని అన్నారు. ఏ సామాజిక వర్గంలో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నాయో గుర్తించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సామాజిక రుగ్మతగా ఉన్న బాల్య వివాహాలను నిర్మూలించాలని తెలిపారు. విద్యా సంస్థలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలను తెలియజేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఇతర సిబ్బంది దీనిపై పకడ్బందీగా పని చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని



సూచించారు. వివరాలు ఉంటే చైల్డ్ రైట్స్ కమిషన్ కు తెలియజేయవచ్చని చెప్పారు. గ్రామ స్థాయిలో కమిటీలు మరింత జాగరూకతతో పనిచేయాలని సభ్యులు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, డి.ఎస్.పి శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం భాషా, పాల్గొన్నారు.

# కస్టడీలో హింసించిన పోలీసులను సస్పెండ్ చేయాలి : మాజీ మంత్రి అంబటి రాంబాబు

**గుంటూరు ఏప్రిల్ 18 ప్రభాతవార్త ప్రతినిధి :** వైఎస్సార్సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు శనివారం ఉదయం నుండి గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షకు దిగారు. తనను కస్టడీలో హింసించిన పోలీసులను సస్పెండ్ చేయాలని, తన ఇల్లు, ఆఫీస్ పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 31 వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబుపై అవమానకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ గుంటూరులోని అంబటి నివాసం, కార్యాలయాన్ని టీడీపీ శ్రేణులు ముట్టడించాయి. ఆ తర్వాత అంబటిని పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు వారాల తర్వాత ఫిబ్రవరి 18న రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి అంబటి విడుదల అయ్యారు.ఈ క్రమంలో తనను కస్టడీలో హింసించిన పోలీసులు సస్పెండ్ చేయాలని.. తన ఇల్లు, ఆఫీస్ పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కలెక్టరేట్ వద్ద అంబటి రాంబాబు నిరాహార దీక్షకు దిగారు.ఈ నిరాహార దీక్షను సాయంత్రం 6 గంటల వరకు కొనసాగించారు.ఈ క్రమంలో మాజీ హోంమంత్రి సుచరిత చేతుల మీదగా నిమ్మరసం ఇవ్వగా అంబటి దీక్షను విరమించారు. ఈ సందర్భంగా సుచరిత మీడియాతో మాట్లాడుతూ అంబటి ఇంటిపై దాడి హేయమని, 7 గంటల పాటు దాడులు జరిగినా పోలీసులు స్పందించకపోవడం దారుణమన్నారు. అంబటిని వేధించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సుచరిత డిమాండ్ చేశారు. దాడి చేసిన టీడీపీ గూండాలను అరెస్ట్



చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు విడుదల రజిని, జోగి రమేష్, వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, కల్పలత రెడ్డి,మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, శివకుమార్, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి మల్లాది విష్ణు, సింహాద్రి, నియోజకవర్గ సమన్వయకర్తలు అంబటి మురళి, షేక్ నూరి ఫాతిమా, వేమారెడ్డి డైమండ్ బాబు, గజ్జల భార్గవ్ రెడ్డి, అశోక్ బాబు రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ శ్యామల, న్యాయవాదు శ్రవణ్ కుమార్, రాష్ట్ర,జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారుల్లో నైట్ శానిటేషన్ పనులు ముమ్మరంగా చేపట్టాలి

## నగర కమిషనర్

**గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 18,(ప్రభాతవార్త) :** గుంటూరు నగరంలోని ప్రధాన రహదారులలో నైట్ శానిటేషన్ పనులు ముమ్మరంగా చేపట్టాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు, వాహన దారులకు ఎటువంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు గుంటూరు నగరపాలక సంస్థ వినూత్నంగా ఖీనైట్ శానిటేషన్ఖీ (రాత్రి సమయ పారిశుధ్య పనులు) విధానాన్ని అమలులోకి



తెలిపారు. సాధారణంగా ఉదయం వేళల్లో ప్రధాన రహదారులపై పారిశుధ్య పనులు చేపట్టడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడమే కాకుండా ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉంటుందని గమనించామని తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ అధిగమించేందుకు పైలెట్ ప్రాజెక్ట్ గా 57 మంది కార్మికులతో రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయటం జరిగింది అన్నారు. ఈ బృందాలు నగరంలో అత్యంత రద్దీగా ఉండే బస్టాండ్ నుండి రైల్వే స్టేషన్ వరకు గల రహదారి, బస్టాండ్ రోడ్, హిమనీ సెంటర్,జిన్నా టవర్ వంటి ప్రాంతాలలో శానిటరీ సూపర్వైజర్ (ఎస్ఎస్) పర్యవేక్షణలో పారిశుధ్య పనులను నిర్వహిస్తాయని పేర్కొన్నారు. రాత్రి సమయంలో మెయిన్ రోడ్లపై పారిశుధ్య పనులు చేసే కార్మికులకు తప్పనిసరిగా రేడియం జాకెట్స్ అందించి, వారు ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. త్వరలో 150 మంది కార్మికులతో నగరంలోని అన్ని ప్రధాన రహదారుల్లో నైట్ శానిటేషన్ పనులను విస్తరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నైట్ శానిటేషన్ వలన ముఖ్యంగా ఉదయం పూట ప్రధాన రోడ్లను శుభ్రం చేసే పని భారం తగ్గడం వల్ల ఆ సమయంలో పనిచేసే కార్మికులు వార్డుల్లోని ఇంటింటి చెత్త సేకరణ పై పూర్తిస్థాయిలో దృష్టి సారించడానికి వీలు కలుగుతుందన్నారు. తద్వారా నగరమంతా పరిశుభ్రంగా ఉండటమే కాకుండా, రద్దీ సమయాల్లో పారిశుధ్య కార్మికులకు ఎదురయ్యే ప్రమాదాలను కూడా నివారించవచ్చని ఆయన తెలిపారు.


వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

RECRUITMENT
★ Job Description: Field Marketing (Interior Design Company) Salary : 12000 - 20000
Contact : 9652501986.
(Ro.No.2375)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# విజ్ఞాన్స్ వర్సిటీ ప్రవేశపరీక్ష వీశాట్-2026 ఫేజ్-1 ఫలితాలు విడుదల

### -విజ్ఞాన్స్ ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ -ఏప్రిల్ 22నుంచి 27వరకు కౌన్సిలింగ్ ప్రారంభం

**పొన్నూరు, ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** చేబ్రోలు మండల పరిధిలోని, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో వీశాట్-2026 ఫేజ్-1 పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు విజ్ఞాన్స్ ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన వీశాట్-2026కు అనూహ్య స్పందన వచ్చిందన్నారు.ఏపి, తెలంగాణాతోపాటు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి 61వేల మంది విద్యార్థులు వీశాట్‌కు హాజరైనట్లు




చెప్పారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 42వేల మంది వర్సిటీలో అడ్మిషన్ పొందుటకు అర్హత సాధించారన్నారు. వీశాట్‌లో 1నుంచి 50లోపు ర్యాంకులు సాధించినవారికి 50శాతం స్కాలర్‌షిప్, 51నుంచి 200లోపు ర్యాంకులు సాధించినవారికి 25శాతం స్కాలర్‌షిప్, 201నుంచి 2వేల లోపు ర్యాంకులు సాధించినవారికి 10శాతం స్కాలర్‌షిప్‌ను నాలుగు సంవత్సరాలపాటు అందజేస్తామన్నారు. వీశాట్-2026 ర్యాంకులతోపాటు జేఈఈ మెయిన్స్ ఫలితాలు, ఎంసెట్ ర్యాంకులు, ఇంటర్మీడియెట్ మార్కులను కూడా పరిగణలోకి తీసుకొంటామన్నారు. ఇంటర్‌లో 970కిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు 50శాతం, 950నుంచి 969మార్కులు సాధించిన విద్యార్థులకు 25శాతం, 920నుంచి 949మార్కులు సాధించిన విద్యార్థులకు 10శాతం స్కాలర్‌షిప్‌లను అందజేస్తామన్నారు. 85శాతానికి పైగా విద్యార్థులకు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించడం, పరిశోధనల్లో సత్తా చాటుతుండడం లాంటి అరుదైన విజయాంశాల వల్లనే విద్యార్థులు, తల్లిదండ్రులకు తమ యూనివర్సిటీపై ఆదరణ మరింత పెరిగిందన్నారు. జేఈఈ మెయిన్స్‌లో 95కిపైగా పర్సంటైల్ సాధించిన విద్యార్థులకు 75శాతం, 89నుంచి 94.9పర్సంటైల్ సాధించిన వారికి 50శాతం, 80నుంచి 88.9శాతం పర్సంటైల్ సాధించినవారికి 25శాతం, 70 నుంచి 79.9 పర్సంటైల్ సాధించిన విద్యార్థులకు 10శాతం స్కాలర్‌షిప్‌ను అందజేస్తామన్నారు. గుంటూరు, హైదరాబాద్ క్యాంపస్ యూనివర్సిటీలలో ప్రవేశాల కోసమై ఏప్రిల్ 22నుంచి 27 వరకు మొదటి విడత కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలి పది ర్యాంకులు సాధించిన తిగుళ్ళ సాత్విక్(సంగారెడ్డి జిల్లా, తెలంగాణా), బానోత్ సంజయ్(ఖమ్మం, తెలంగాణా), పీ.మౌనిష్(కడప, ఆంధ్రప్రదేశ్), చితి తోటి హోషిక్(ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్), రాయపూడి జశ్వంత్ నాయుడు(గుంటూరు, ఆంధ్రప్రదేశ్), కే.సాకేత్ చౌహాన్(సంగారెడ్డి జిల్లా, తెలంగాణా), దామెర్ల వెంకట సిద్ధార్థరాయ్(గుంటూరు, ఆంధ్రప్రదేశ్), గుంటోజు ఉమేష్ చంద్ర(మేడ్చల్, తెలంగాణా), సంగు భరత్ చంద్రారెడ్డి(ప్రకాశం, ఆంధ్రప్రదేశ్), ఎం.పూర్ణచంద్రశేఖర్(విశాఖపట్టణం, ఆంధ్రప్రదేశ్) సాధించారన్నారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ దిరిశాల విజయరాము, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, తదితరులున్నారు.

# పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

**గుంటూరు విద్య ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** ఖబడి పిలుస్తోందిఖ విద్యార్థుల నమోదు డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా నకరికల్లు మండల పరిధిలోని చేజర్ల ఎస్ వి ఎస్ ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ..బడి పిలుస్తోంది! ర్యాలీ.. ని చేజర్ల గ్రామంలో నిర్వహించడం జరిగినది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని షేక్ ఫాహీం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచడానికి ప్రభుత్వం ఖబడి పిలుస్తోందిఖ అనే ప్రత్యేక కార్యక్రమం ను నిర్వహిస్తున్నదని తెలిపారు. ..బడి పిలుస్తోంది! రండి మన పిల్లలను ప్రభుత్వ బడికి పంపిద్దాం.. కార్యక్రమం ద్వారా గ్రామంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించడం, వారిని బడిలో చేర్పించడం, వారికి విద్యా కిట్లను పంపిణీ చేయడం, సామర్థ్యాలు మదింపు చేయడం, వయసుకు తగిన తరగతిలో నమోదు చేయడం, బడి బయట పిల్లలు లేని గ్రామంగా ప్రకటించడం ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం తల్లి కి వందనం ద్వారా నగదు పంపిణీ చేస్తున్నదని, అదే విధంగా విద్యార్థులందరికీ ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు యూనిఫామ్, షూస్, సాక్స్, బెల్ట్ వంటి కిట్స్ అందజేయడం జరుగుతుందని, కావున బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్స్ లను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చక్కగా చదువుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. గణిత ఉపాధ్యాయులు గేరా మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో




అనేక వసతులు, సౌకర్యాలు ఉన్నాయని, సుశిక్షితులైన ఉపాధ్యాయులచే గుణాత్మక విద్యను అందించుట జరుగుతుందని,తల్లిదండ్రులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు విద్య యొక్క ఆవశ్యకతను ప్రజలందరికీ తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. అక్షరాస్యతే అభివృద్ధి. అంటూ నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ గ్రామంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయని షేక్ ఫాహీం, ఉపాధ్యాయులు పెండ్యాల ప్రసాద్, గేరా మోహనరావు, వై సుబ్బారావు, షేక్ గౌస్, బి వెంకట్ రెడ్డి, బి నాగమణి, పిల్లి మెర్సి విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల పెంపు పై శ్రద్ధ పెట్టాలి

### -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ భూ గర్భజలాల పెంపుపై శ్రద్ధ పెట్టాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు సూచించారు. స్థానిక వందెకరాల చెరువు వద్ద స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జలం-జీవం అనే థీముతో పనిచేశారు. పట్టణానికి ప్రధాన నీటి వనరు అయిన వందెకరాల చెరువు వద్ద ప్రత్యేక



పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ట్యాంకులోని నీరు కలుషితం కాకుండా ఉండేందుకు,నీటి ప్రాముఖ్యతను చాటిచెబుతూ జలహారతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా నిడుబ్రోలులోని మంచినీటి రిజర్వాయర్ల వద్ద ఇంకుడు గుంతలను నిర్మాణం చేశారు. వర్షపు నీరు వృధా కాకుండా భూమిలోకి ఇంకి పోయేలా ప్రజలకు అవగాహన కల్పించారు. నీరులేనిదే జీవం లేదని, మన జల వనరులనుకాపాడుకోవడం మనందరి బాధ్యత అని కమిషనర్ చెప్పారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు, మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## పిఎండి కిట్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి

### -జిల్లా వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.సునీత

పొన్నూరు, ఏప్రిల్ 18,ప్రభాతవార్త: పిఎండి కిట్ల వినియోగంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర ఐ.సునీత ఆదేశించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం




సిబ్బందికి అవగాహన కల్పించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులకు ముందస్తుగానే పిఎండి కిట్ల సాగుచేయడం గురించి అవగాహన కల్పించాలన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి నాణ్యమైన పంటలు ఉత్పత్తులు పొందవచ్చన్నారు. పిఎండి కిట్ల వినియోగం వల్ల భూమిలో సేంద్రియ కర్బన శాతం పెరిగి భూసారం పెరుగుతుందన్నారు .భూసార పరిరక్షణలో భాగంగా ప్రకృతి వ్యవసాయం వల్ల ఇస్తున్న పిఎండిఎస్ కిట్ల వినియోగించడం వల్ల భూమిలో సూక్ష్మ జీవులు వృద్ధిచెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడి సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, లాంఫారం సీనియర్‌శాస్త్రవేత్త గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సహకరించాలి : జడ్జి జి.రుక్మిణి

**పొన్నూరు, ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** మే 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా న్యాయవాదులు సహకరించాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రుక్మిణి కోరారు. స్థానిక కోర్టులో



శనివారం పొన్నూరు బార్ అసోసియేషన్‌సభ్యులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజీపడ దగిన కేసులకు సంబంధించి కక్షిదారులతో మాట్లాడి ఇరు పక్షాలకు న్యాయం జరిగేవిధంగా చూడాలన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు పొందుగల జయరాజు, మగ్బుల్‌బేగ్, బి.ప్రకాష్, పి.విజయకుమార్, సదానందరావు,ఎంహెచ్‌ఎస్ సాయిబాబు, పి.రాజేష్‌బాబు, ఆంద్రూస్, న్యాయవాది గుమాస్తాలు పాల్గొన్నారు. అనంతరం బ్యాంకు అధికారులతో,పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు.

## సమయపాలన పాటించండి...బాధ్యతగా పనిచేయండి

### -డిప్యూటి ఎంపీడీవో దానయ్య

**కొల్లిపర,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించి బాధ్యతాయుతంగా పనిచేయాలని డిప్యూటి ఎంపీడీవో దానయ్య అన్నారు.శనివారం మండల కేంద్రం కొల్లిపర,చివలూరు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించి సిబ్బందికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా దానయ్య మాట్లాడుతూ



సచివాలయంలో సమస్యలు ఉన్నట్లయితే వాటిని తన దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలన్నారు.మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు.సచివాలయం సిబ్బంది ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా ఉత్తమ సేవలు అందించాలన్నారు.

## పార్టీ బలోపేతానికి అందరినీ కలుపుకు పోవాలి

### -మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి

**పొన్నూరు, ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నూతన అధ్యక్షుడు అందరినీ కలుపుకుని పోవాలని మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి సూచించారు. నూతన అధ్యక్షుడిగా నియామకమైన షేక్ నాజర్‌ను అభినందించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నందువల్లే నాజర్‌ను పట్టణ అధ్యక్ష పదవి వరించిందన్నారు. నాజర్ నాయకత్వంలో పట్టణంలో పార్టీ బలోపేతం కావాలని ఆకాంక్షించారు. నాజర్ కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నాజర్‌కు అభినందనలు తెలిపారు. పార్టీ అధిష్టానం సూచించిన విధంగా



పారీ కార్యక్రమాలన్నింటిని విజయవంతం అయ్యేవిధంగా నాజర్‌చూడాలన్నారు. పట్టణాధ్యక్షుడిగా నియామకం కావడం వల్ల నాజర్‌పై భారం పెరిగిందన్నారు.

## చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### -ప్రత్యేకాధికారి డాక్టర్ షేక్ యాస్మిన్

**పొన్నూరు, ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంత ప్రజలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేకాధికారి, ములుకుదురు పశువైద్యాధికారి డాక్టర్ షేక్ యాస్మిన్




సూచించారు. మండల పరిధిలోని తాళ్ళపాలెం గ్రామంలో వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి యాస్మిన్ మాట్లాడుతూ మంచినీటిని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజానీకం ఎండ సమయంలో బయట తిరగవద్దన్నారు. వడదెబ్బ సోకినట్లు గుర్తిస్తే తక్షణమే దగ్గర్లోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి పిట్ల శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్యాస్ డెలివరీ బాయ్స్ కూడా ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

### -అగ్నిమాపకశాఖాధికారి కె.ప్రసాదరావు

**పొన్నూరు, ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** వంట గ్యాస్ లీకేజి వల్ల కూడా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వీటిపై గ్యాస్ సరఫరా చేసే సిబ్బంది గృహిణులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అగ్నిమాపకశాఖాది ,కారి కె.ప్రసాదరావు సూచించారు. స్థానిక భారత్ గ్యాస్ ఏజన్సీ వద్ద అగ్నిప్రమాదాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్యాస్ సిలెండర్లు లీకేజి అయినప్పుడు ఏ విధంగా దాన్ని అరికట్టాలన్న విషయాలపై తర్ఫీదు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ వంట చేయడం అయిపోయాక సిలెండర్ వద్ద ఉండే నాబ్‌ను కట్టేయాలన్నారు. స్టౌవ్ వద్ద కట్టేయడం కాకుండా గ్యాస్ సిలిండర్ వద్ద ఉండే నాబ్‌ను కట్టేసినట్లయితే గ్యాస్ లీకుకాకుండా ఉండేందుకు



అవకాశం ఉంటుందన్నారు. ఏదిఏమైనా వేసిలో జరిగి అగి ప్రమాదలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రయోగాత్మకంగా మంటలను ఆర్పివేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో భారత్ గ్యాస్ ఏజెన్సీ అధినేత కొల్లిపర సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

## సేవకు మరోఅర్ధం చలివేంద్రాలు ఏర్పాటు: డిఎస్పి జనార్ధనరావు

**తెనాలి మున్సిపాలిటీ ఏప్రిల్18(ప్రభాతవార్త):** వేసవిలో ప్రజల దాహర్తిని తీర్చేందుకు మరిన్ని చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని, సేవకు మరొక అర్ధమే చలివేంద్రాలు ఏర్పాటని, తెనాలి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి బి. జనార్ధనరావు, మున్సిపల్



కమీషనర్ రామ అప్పలనాయుడు పేర్కొన్నారు.శనివారం బుర్రిపాలెంరోడ్డు లోని శివాజీ చౌక్ ప్రాంతంలో,విశ్రాంత ఉపాధ్యాయుడు మొవ్వ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు.అనంతరం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు.దాహం తీర్చటం దైవకార్యంతో సమానమని,ఈ వేసవిలో మరిన్ని చలివేందాలు ఏర్పాటు చేయాలన్నారు.ఈ సందర్భంగా చలివేంద్రం ఏర్పాటుచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు మొవ్వ సత్యన్నారాయణ ను అభినందించారు. వేసవికాలంలో ప్రజలకు, బాటసారులకు కావాల్సిన కనీససౌకర్యం మంచినీటిని ఏర్పాటు ఆలోచన మంచివిషయమన్నారు.

## ఓక్ బ్రిడ్జి స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**మాచర్ల, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** ఆలిండియా స్థాయిలో జరిగిన సైనిక్, నవోదయ పోటీ పరీక్షల్లో స్థానిక ఓక్ బ్రిడ్జి స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ఛైర్మన్ కొమ్మారెడ్డి చలమారెడ్డి అన్నారు. నవోదయలో గాజుల మెల్కి అభిషిత్ (133వ ర్యాంకు) గాజుల మిల్కీ ఆశిష్ (201 ర్యాంకు) సాధించారు. సైనిక్ స్కూల్‌లో గాజుల మిల్కీ అభిషిత్ విజయం సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి లక్ష్మారెడ్డి, ప్రిన్సిపల్ షేక్ దరియావలి పాఠశాల సాధించిన విజయాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో డీన్ రాజేశ్వరి, కృష్ణారావు, కాత్యాయని, శ్రీనివాసరావు, రాణి, సుభాని, తస్మిన్, వాసుబాబు, అనుపమ, షకీలా, లక్ష్మి, ప్రసన్నకుమారి, శిరీష, శ్వేత, రమ్య, చంద్రిక, శిరీష, ఆదిలక్ష్మి, నగీన, జానీబేగం, శ్యామల, పలువురు అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## అంబటి రాంబాబు దీక్షకు సంఘీభావం తెలిపిన నాయకులు

**పొన్నూరు, ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు చేపట్టిన 12గంటల దీక్షకు ప్రజలు నీరాజనాలు పలికారు. తన ఇంటిపై దాడిచేసిన వారిని అరెస్టు చేసి శిక్షించాలని, తనను పోలీసు కస్టడీలో వేధింపులకు గురిచేసి



పోలీసులను సస్పెండ్ చేయాలనే డిమాండ్‌తో అంబటి రాంబాబు శనివారం ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు పొన్నూరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్ళి సంఘీ భావం తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ నేతృత్వంలో మైనార్టీ కమీషన్ రాష్ట్ర సభ్యుడు షేక్ సైఫుల్లా, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పట్టణ,మండల పార్టీ అధ్యక్షులు షేక్ నాజర్, చింతలపూడి మురళీకృష్ణ, నాయకులు షేక్ మౌలాలి, అంబటి వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్ళారు.

## స్వచ్ఛాంధ్రలో భాగంగా,నీటి సంరక్షణ పై అవగాహన ర్యాలీ : ఎంపిడిఓ అత్తోట దీప్తి

**తెనాలి టౌన్ ఏప్రిల్18(ప్రభాతవార్త):** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా, శనివారం,తెనాలి మండలం కోపల్లె గ్రామంలో,తెనాలి మండల అభివృద్ధి అధికారి అత్తోట దీప్తి,గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొని స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర




కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతినెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జల ధార జల హారతి ప్రధానాంశముగా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయం సిబ్బంది తో కలిసి, ప్రధానవీధుల్లోని చెత్తా, కవర్లు ,ఇతర వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం,స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి అత్తోట దీప్తి మాట్లాడుతూ, జలసంరక్షణ మన అందరి బాధ్యత అని, నీటిని సంరక్షించకపోతే భవిష్యత్ తరాలకు ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పారు. జలధార జలహారతి ముఖ్య ఉద్దేశం,వర్షపు నీటిని సంరక్షించడం, ఇంకుడు గుంతల నిర్మాణం, భూగర్భ జలాలకు పునర్జీవనం కల్పించడం ముఖ్య లక్ష్యం అని చెప్పారు. నీటి భద్రతకు మనందరం ఇప్పుడే చేతులు కలపాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ గృహ ప్రాంగణాలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను కాపాడుకోవచ్చని చెప్పారు. దానితోపాటు వర్షపు నీటిని వృధా కాకుండా ట్యాంకులు ఏర్పాటు చేసుకొని నీటిని సంరక్షించుకుంటే వివిధ రకాలుగా వినియోగించుకోవచ్చని అన్నారు. భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. భూమిలో కలిసిపోని ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర కారణాల వలన భూగర్భ జలాలు కలుషితం అయ్యే అవకాశం ఉందని కావున అందరూ పరిశుభ్రతను పాటించి పర్యావరణ పరిరక్షణకు, భూగర్భజల పునర్జీవనానికి, నీటి సంరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో,సచివాలయం సిబ్బంది,పంచాయితీ పారిశుధ్య సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## చిత్రలేఖనం పోటీల విజేతలకు,సాయిమంగా వెల్ఫేర్ సొసైటీ వారిచే బహుమతులు ప్రధానం

**తెనాలి మున్సిపాలిటీ ఏప్రిల్18,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని మారిస్ పేట లోగల నల్లమోతు చెంచు రామానాయుడు మునిసిపల్ హై స్కూల్ నందు జాతీయస్థాయిలో జరిగిన చిత్రలేఖనం పోటీల్లో నాలుగు బంగారు పతకాలు మూడు వెండి పతకాలు వచ్చిన విద్యార్థులకు మెడల్స్ ను హెచ్‌ఎం అందజేశారు.బాల చిత్రకారులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున 18 మందికి డ్రాయింగ్ మెటీరియల్ ను "సాయి మంగ వెల్ఫేర్ సొసైటీ వారు" 15 వేల రూపాయలు ఖరీదు చేసే ఆర్ట్ మెటీరియల్ ను అందజేశారు. ఎన్సీఆర్ ఎం ఎం హై స్కూల్ హెచ్‌ఎం పఠాన్ కరిముల్లా చేతుల మీదుగా, ప్రెసిడెంట్ కంకిపాటి రమేష్ కుమార్ గారు, ఎం. పూర్ణ, ట్రెజరర్ బి.సుధాకర్ చిత్రకళోపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్ లు అందజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు పఠాన్ కరీముల్లా మాట్లాడుతూ, మా స్కూల్ విద్యార్థులకు చిత్రలేఖనంలో ఈ మెడల్స్ రావటం ఎంతో సంతోషం అన్నారు. సాయి మంగ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కంకిపాడు రమేష్ కుమార్ మాట్లాడుతూ,రామాయణ ఘట్టాలను ఎంతో



సుందరంగా చిత్రీకరించారని విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను బొమ్మల ద్వారా ప్రత్యేకంగా చాటారని ప్రత్యేకంగా కొనియాడారు.చిత్రకాళోపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్ మాట్లాడుతూ, మనసును రంజింప చేసేది చిత్రకళని, చిత్రకళలో ఎంతో గొప్పగా వేస్తున్న చిన్నారుల కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా మా పిల్లలు సెల్ ఫోన్లు పక్కనపెట్టి ఈ కలలో ఎంతో నిమగ్నమవుతున్నారని చాలా ఉపయోగకరంగా ఉందని స్వయంగా ఫోన్ చేసి చెబుతున్నారని కొనియాడారు . కృష్ణజ, ఛాయాదేవి తదితర ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థిని, విద్యార్థులు అభినందించారు.

# రెండేళ్ళుగా ఎఫ్.డి.సి ఛైర్మన్ కుర్చీ ఖాళీ..!

### మాఏపి అధ్యక్షులు దిలీప్ రాజా

**తెనాలి టౌన్ ఏప్రిల్18 (ప్రభాతవార్త):** ఆంధ్ర ప్రదేశ్ లో సినిమాను రాజకీయ గ్రహణం మింగేసిందని మా ఎపి వ్యవస్థాపకులు,సినీదర్శకుడు దిలీప్ రాజా ఆందోళన వ్యక్తం చేశారు. రూరల్ మండలం పెదరావూరు ఫిలిం స్టూడియోస్ లో శనివారం మీడియాతోమాట్లాడుతూ,ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు అయినప్పటికీ నేటికీ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి కార్పొరేషన్ కు ఛైర్మన్ ను నియమ్మించకపోవ్వడ వెనుకగల ఆంతర్యం ఏంటని ఆయన ప్రశ్నించారు.కూటమి నేతల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు.జనసేన నేత పవన్ కళ్యాణ్ ఎఫ్.డి.సి ఛైర్మన్ గా ప్రముఖ నిర్మాత ఎ్నయ రత్నం ను నియమించవలసిందిగా గతంలో బహిరంగగానే కోరడం తెలిసిందేనన్నారు.కాగా హీరో బాలకృష్ణ ఒకరిని,చంద్రబాబు దృష్టిలో వేరొకరు,తాజాగా బిజెపి నుండి మరో ఆశావహులు రంగ్నలోకి దిగ్నటతో సమస్యకు పరిష్కార మరింతగా దూరమయ్యిందని దిలీప్ రాజా అభిప్రాయం వ్యక్తం చేశారు.మరోవైపు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ జనసేన నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో సినిమారంగానికే చెందిన చలన చిత్ర అభివృద్ధి కార్పోరేషన్ ఛైర్మన్ పదవిని తిరిగి జనసేనకు ఎలా కేటాయిస్తామనే ప్రశ్న ఖిదేశంఖి మనసులో లేకపోలేదని ఆయన చెప్పారు.రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రలో సినిమా పరిశ్రమ చిన్నాభిన్నమైపోయిందని దిలీప్ రాజా ఆవేదన వ్యక్తం చేశారు. సబ్సిడీ పెంపుదల,స్టూడియో నిర్మాణాలకు స్థలాలను కేటాయించడం,నిలిచిపోయిన నంది అవార్డుల ప్రధానం,పరిశ్రమ అభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన తరుణంలో రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి



మండలి ఛైర్మన్‌ను నియమించక పోవ్నడ చూస్తూంటే సినిమాకు గ్రహణం పట్టడమేనన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆంధ్రలో సినిమారంగం అభివృద్ధికి కావలసిన చర్యలు తక్షణమే తీసుకోవలసిందిగా మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ (మా ఎపి) తీర్మానాన్ని పంపినట్లు దిలీప్ రాజా తెలిపారు.

## అగ్ని ప్రమాదాల పై అవగాహన

**నరసరావుపేట క్రైమ్ ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అగ్నిమాపక శాఖ అధికారి ఎం శ్రీనివాసరావు తెలియజేశారు. వారోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన శనివారం ఐఓసీఎల్, బిపిసిఎల్, హెచ్పి పెట్రోల్ బంకులు, హిమాలయ హెచ్పీ గ్యాస్ గోడౌన్స్, ఎల్లమంద గ్రామంలోని మిట్టపల్లి స్పిన్నింగ్ మిల్ నందు అగ్ని ప్రమాదాలపై డెమో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదాలు సంబంధించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను డెమో రూపంలో చూపించారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. శ్రీనివాస చక్రవర్తి, జిఎం శశిధర్, ఎలక్ట్రీషియన్ శ్రీనివాసరావు, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎమ్‌లో ఎమర్జింగ్ స్కాలర్స్ కాన్ఫరెన్స్

## పెద్ద సంఖ్యలో హాజరైన ఆర్థిక రంగ నిపుణులు

**మంగళగిరి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** ఏపీ ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీలో శుక్రవారం ప్రారంభమైన ఖిఎమర్జింగ్ స్కాలర్స్ కాన్ఫరెన్స్ 2026 ఖిశనివారం సాయంత్రం విజయవంతంగా ముగిసింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూ ఎకనామిక్



థింకింగ్ భాగస్వామ్యంతో యూనివర్సిటీలోని ఎకనామిక్స్ విభాగం ఈ సదస్సును ఏర్పాటు చేసింది. దేశం నలుమూలల నుంచి పేరుగాంచిన విద్యావేత్తలు, విధాన నిపుణులు, మరియు పారిశ్రామిక ప్రముఖులు సదస్సుకు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గ్లోబలైజేషన్ ను వివిధ కోణాల్లో అధ్యయనం చేసేందుకు ఈ సదస్సు ముఖ్య వేదికగా నిలిచింది. కొత్త ప్రపంచానికి సరికొత్త ఆలోచనలు అన్న థీమ్ తో సదస్సును నిర్వహించడం విశేషం. మద్రాసు స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డైరెక్టర్ ఆచార్య ఎన్ ఆర్ భానుమూర్తి విశిష్ట అతిథిగా సదస్సుకు హాజరై జెండర్ బడ్జెటింగ్ సమగ్ర వృద్ధి అన్న అంశంపై ప్రసంగించారు. ఎడ్యుకేషనల్ హబ్స్ ఆన్ ఎర్లీ డెవలప్ మెంట్ పాలసీ అన్న అంశంపై జరిగిన ప్యానల్ డిస్కషన్ లో ప్రొఫెసర్ ధనమంజిరి సాథే, ప్రొఫెసర్ పరిచిత్ ఘోష్, ప్రొఫెసర్ పుష్ప త్రివేది, ప్రొఫెసర్ రాహుల్ సిరోహి మరియు డాక్టర్ షహాజాది తదితరులు పాల్గొన్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సతీష్ కుమార్ హాజరైన ప్రముఖులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సదస్సులో ఎకనామిక్స్ విభాగం అధిపతి డాక్టర్ మనీష్ కుమార్, ఈశ్వరి స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ డాక్టర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు

# జనసేన నాయకులు,పెదరావురు సొసైటీ డైరెక్టర్ రాజశేఖర్ హఠాన్మరణం

## నివాళి సందేశం పంపిన మంత్రి నాదెండ్ల

**తెనాలి మున్సిపాలిటీ ఏప్రిల్18(ప్రభాతవార్త):** జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయం కోసం ఆలోచించే తెనాలి మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు, పెదరావూరు సొసైటీ డైరెక్టర్ పిల్లి రాజశేఖర్,శనివారం అనారోగ్యం కారణంగా మరణించారు.విషయం తెల్సిన స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర ఆహార పౌరసరఫరాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తన సందేశాన్ని ప్రకటించారు.పిల్లి రాజశేఖర్ మరణం జనసేన పార్టీకి తీరని లోటని,పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసం ఆయన ఎప్పుడు ఆలోచించేవారని, ప్రజలకు దగ్గరగా సేవ చేయాలని,నిరంతరం పార్టీ అడుగు జాడల్లో నడుస్తూ, తెనాలి మండలంలో రాజశేఖర్ పార్టీకి అందించిన సేవలు నిరుపమానమన్నారు.ఆయన మృతి చెందారన్న వార్త నన్ను కలచివేసిందని,ఆయన మృతికి నా తరఫున,తెనాలి నియోజకవర్గ జనసేన పార్టీ శ్రేణుల తరఫున రాజశేఖర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు.ఈ సందర్భంగా, మంత్రి, నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు,జనసేన పార్టీ నాయకులు,శనివారం కఠెవరం గ్రామంలోని పిల్లి రాజశేఖర్ స్వగృహంలో, ఆయన అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం





చేస్తూ, వారి భౌతిక కాయానికి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులు తోటకూర రమణారావు, జాకీర్ హుస్సేన్, దివ్వెల మధుబాబు,పసుపులేటి మురళి,రవికాంత్, ఇస్మాయిల్ బేగ్,తోట పానకాలరావు, సోమరౌతు సతీష్, వెంకటేశ్వరరావు,తోట నరేంద్ర,తోట వంశీ,శ్రీకాంత్, నాగరాజు,వీరయ్య, సత్యనారాయణ,నాగం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు, రాజశేఖర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఈ కష్ట సమయంలో పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# ఉష్ణోగ్రతలు పెరిగాయి...ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## -దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి

**కొల్లిపర,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** ఉష్ణోగ్రతలు బాగా పెరిగిపోయాయని.. ప్రజలు ఈ వేసవిలో వైద్యాధికారుల సూచనలు పాటిస్తూ తగిన జాగ్రతలు




తీసుకోవాలని దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి పేర్కొన్నారు.శనివారం మండల పరిధిలోని వల్లభాపురం..మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులు..విద్యార్థులు...గ్రామ పెద్దలు ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కలిగించారు.ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం అన్నారు.ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతే ప్రగతికి మెట్లు అన్నారు.మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నేహ మాట్లాడుతూ నీటి యొక్క ప్రాముఖ్యత..నీటి నిల్వల యొక్క ప్రాముఖ్యత,ఆవశ్యకత..నీటి పారుదల వంటి అవసరాలను తెలియజేసారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మావతి,డాక్టర్ ప్రియాంక,ఆరోగ్య విస్తరణాధికారి నాగరాజు,ప్రధానోపాధ్యాయుడు శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తప్పనిసరిగా బడిఈడు పిల్లలు విద్యనభ్యసించాలి

**వట్టిచెరుకూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించాలని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు మండలంలోని మేజర్ పంచాయతీ




గ్రామం పల్లపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులతో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొని మాట్లాడుతూ.. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారికి బంగారు భవితకు బాటలు వేద్దామని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని, పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన బోధన అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపించి, వారి భవిష్యత్తును బలంగా నిర్మించాలని కోరారు. ఈ నెల 23వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ జరుగుతోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మన ప్రభుత్వ బడి ప్రత్యేకతలపై ర్యాలీల ద్వారా అవగాహన కల్పించామని చెప్పరు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, తల్లికి వందనం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర వంటి కార్యక్రమాలతో పాటు అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో ఉచిత విద్యాబోధన లభిస్తుందన్నారు. స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల ద్వారా పూర్తిస్థాయిలో డిజిటల్ విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తుందని వివరించారు. ప్రధానంగా ఒకటవ తరగతిలో ప్రవేశలపై దృష్టి సారించాలని సూచించారు అలాగే ప్రభుత్వ బడుల్లో ఐదవ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు ఆరవ తరగతి ప్రభుత్వ యూపీ ఉన్నత పాఠశాలలో చేరేలా తల్లిదండ్రులను ఒప్పించే బాధ్యత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకోకపోతే పాఠశాలల మనుగడకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు గత ప్రభుత్వంలో విద్యాసంస్థల పేరిట ప్రభుత్వ పాఠశాలలు ప్రధానంగా ప్రాథమిక పాఠశాలలను పలు రకాలుగా విభజన చేయడంతో వేలాదిమంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చేరారు అన్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మోడల్ ప్రాథమిక పాఠశాలల పేరిట మరో ప్రయోగం చేసిన ఫలితాలు రాబట్టుకున్నట్లు వివరించారు. గ్రామంలో విద్యార్థులు బడిబాట ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సిఆర్పిలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : ఎంఈవో ఝాన్సీలత

**కొల్లిపర,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని..గతంలో కంటే ఆంగ్ల మాధ్యమంలోనూ భోధన జరుగుతుందని ఎంఈవో ఝాన్సీలత అన్నారు.శనివారం మండల పరిధిలోని మున్నంగి హైస్కూల్లో వార్షికోత్సవం జరిగింది.ప్రాథమిక పాఠశాల (ఎల్ఈ) ప్రధానోపాధ్యాయినీ మునగాల ధనలక్ష్మీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఝాన్సీలత మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్చాలన్నారు.ఈ సందర్భంగా వార్షికోత్సవానికి తోడ్పాటు అందించిన యల్లమాటి అనిల్‌ను పలువురు ప్రసంశించారు.అనంతరం ప్రతి తరగతిలోనూ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు.అతిధులను ఉపాధ్యాయులు సత్కరించారు.తరువాత విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.కార్యక్రమంలో కళ్ళం వెంకటప్పారెడ్డి,విద్యాకమిటీ వైస్ చైర్మన్ చోడగిరి మరియమ్మ,వేమూరు కిషోర్,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# సృజనాత్మక కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది..

## ఎంఈఓ సత్యనారాయణమూర్తి.

**వట్టిచెరుకూరు, ఏప్రియల్ 18, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే సృజనాత్మక కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణమూర్తి తెలిపారు. మండలంలోని లేమల్లెపాడు గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో 98వ వార్షికోత్సవ వేడుకలు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ మాజీ సర్పంచ్ పాతూరి శివ పార్వతి, లేమల్లెపాడు సొసైటీ అధ్యక్షులు పాతూరి కృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని, ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ పాఠశాలను ముందుకు నడిపిస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి వార్షికోత్సవ వేదికలు విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మక శక్తులను వెలికితీసే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై సమాజంలో నమ్మకం పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎంఈఓ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు తప్పుడు మార్గాలలో వెళ్లకుండా ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత మార్గాలలో వెళ్లాలని ఉద్బోదించారు. అదేవిధంగా ఈ కార్యక్రమములో గత ఐదేళ్లుగా లేమల్లెపాడు గ్రామ సర్వతోముఖాభివృద్ధికి మరియు పాఠశాల అభివృద్ధికి పాటుపడిన మాజీ సర్పంచ్ పాతూరి శివాపార్వతి కృష్ణారావును ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు చుండూరు వెంకట లక్ష్మి సత్యనారాయణ సౌజన్యంతో మహిళల స్వావలంబనకు ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించడం




జరిగిందన్నారు ఈ ప్రకటనతో హాజరైన ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ వెంకట లక్ష్మీ సత్యనారాయణ సేవాభావాన్ని అభినందించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నవీన్ సూర్య పంపించిన పదిహేను వేల రూపాయల ఉపకార వేతనములను విద్యార్థులకు అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి దాతృత్వ కార్యక్రమాలు మరింత ప్రేరణ నిస్తాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల ప్రగతి పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులను రంగురంగు తోరణాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పండుగ వాతావరణంలో ఉపాధ్యాయ బృందం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పసుపులేటి శ్రీధర్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ పాతూరి కృష్ణారావు, స్పెషల్ ఆఫీసర్ బాబురావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు కొణిజేటి బుల్లిబాబు, పైనేని శివబాబు, బొమ్మినేని భాస్కరరావు, కోసూరి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవెంకటేశ్వరస్వామికి 43వ శనివార గానామృతం

**తెనాలి టౌన్ ఏప్రిల్18(ప్రభాతవార్త):** కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామికి శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలాజీరావు పేటలో రూపొందించనున్న నారాయణ అష్టాక్షరి దివ్య క్షేత్రం కు సేకరిస్తున్న భూదాన విరాళంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ట్రస్టు నిర్వాహకులు పిలుపునిచ్చారు. స్థానిక బాలాజీరావు పేట లోని కోట బద్రీనాథ్ గుప్త స్థల ప్రాంగణంలో ట్రస్టు ఆధ్వర్యంలో 43 వ శనివారం శ్రీ వెంకటేశ్వర స్వామి గానామృత కార్యక్రమాన్ని వైభవంగా



నిర్వహించారు. తొలుత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి , శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారికి ట్రస్ట్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తనా బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ ఆధ్వర్యంలో మహిళలు, భక్తులు విశేషంగా పాల్గొని గానామృతాన్ని భక్తిశ్రద్ధలతో ఆలపించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు ఆర్వి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ,ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న వెంకటేశ్వర స్వామి గానామృతం కార్యక్రమానికి భక్తుల నుండి విశేష స్పందన లభించడం సంతోషకరమన్నారు. వ్య క్షేత్రం రూపకల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు భక్తులు పలు అడుగుల భూదాన విరాళంను ట్రస్టు సభ్యులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, మదుపల్లి చంద్రశేఖర్, జంజం రామారావు,సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, ట్రస్టు సభ్యులు రొంపిచర్ల సురేష్, మాజేటీ వెంకటేష్ , అంబటి శ్రీనివాసరావు,కోట రవిశంకర్, కాలేపల్లి రాజశేఖర్, సంకీర్తన బృంద సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రజకచెరువులో వ్యర్థాలు తొలగింపు

**తెనాలి మున్సిపాలిటీ ఏప్రిల్18(ప్రభాతవార్త):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా 37వ వార్డు లోని రజకచెరువులో శనివారం మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు, సిబ్బంది పాల్గొని స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతినెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జల ధార జల హారతి ప్రధానాంశముగా కార్యక్రమాన్ని నిర్వహించారు. సానిటరీ



ఇన్స్పెక్టర్లు సానిటరీ సెక్రటరీలు నగర దీపికలు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని రజక చెరువులోని చెత్తా, కవర్లు ,ఇతర వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. చెరువులోని కలుపు మొక్కల నివారణకు మందు పిచికారి చేయించారు. అనంతరం,స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రామ అప్పలనాయుడు మాట్లాడుతూ, జల సంరక్షణ మన అందరి బాధ్యత అని, నీటిని సంరక్షించకపోతే భవిష్యత్ తరాలకు ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పారు. జలధార జలహారతి ముఖ్య ఉద్దేశం,వర్షపు నీటిని సంరక్షించడం, ఇంకుడు గుంతల నిర్మాణం, భూగర్భ జలాలకు పునర్జీవనం కల్పించడం ముఖ్య లక్ష్యం అని చెప్పారు. నీటి భద్రతకు మనందరం ఇప్పుడే చేతులు కలపాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ గృహ ప్రాంగణాలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను కాపాడుకోవచ్చని చెప్పారు. దానితోపాటు వర్షపు నీటిని వృధా కాకుండా ట్యాంకులు ఏర్పాటు చేసుకొని నీటిని సంరక్షించుకుంటే వివిధ రకాలుగా వినియోగించుకోవచ్చని అన్నారు. భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. భూమిలో కలిసిపోని ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర కారణాల వలన భూగర్భ జలాలు కలుషితం అయ్యే అవకాశం ఉందని కావున అందరూ పరిశుభ్రతను పాటించి పర్యావరణ పరిరక్షణకు, భూగర్భజల పునర్జీవనానికి, నీటి సంరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో,శానిటరీ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసరావు, తిరుమల శెట్టి ప్రసాద్, గుమ్మడి ప్రసాద్, పి.అనుపమ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆకుల శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ ఆంజనేయ రాజు,శానిటరీ సెక్రటరీలు, నగర దీపికలు సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# టెలికమ్యూనికేషన్ రంగాల పరిశోధన పై అవగాహన

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : ఆధునిక ఎలక్ట్రానిక్స్, టెలి కమ్యూనికేషన్ రంగాల్లో పరిశోధన ప్రాధాన్యతపై కాకినాడ జేఎన్టీయూ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ కె.సత్యప్రసాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండలంలోని వింజనంపాడు గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, విజయవాడ ఐఐటీఈ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌సీ కిట్స్



2కె26-నాలెడ్జ్ బేస్డ్ ఇన్వెంటివ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ సిస్టమ్స్ అనే ఆరవ జాతీయ సదస్సు శుక్రవారం విజయవంతంగా ముగించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ జెఎన్టియుకె విశ్రాంత ప్రొఫెసర్ డా.కె.సత్య ప్రసాద్ హాజరై మాట్లాడుతూ..ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఆధునిక ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్ రంగాల్లో పరిశోధన ప్రాధాన్యతను వివరించారు. డ్రోన్స్ టెక్నాలజీ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్ సెక్యూరిటీ ఎలా ప్రొవైడ్ చేస్తారో ఇండియన్ ఆర్మీ పీపుల్ కి క్లుప్తంగా వివరించారు. అలాగే ప్రతి విద్యార్థి కూడా తన రీసెర్చ్ ఆక్టివిటీస్ లో పబ్లికేషన్స్ ని, నాలెడ్జ్ ని ఎనహెన్స్ చేసుకొని మంచి నోవెల్ మెథడ్స్ ఇంప్లిమెంట్ చేసుకునే విధంగా ఉండాలని కోరారు సెషన్ చైర్ డా.వి.రజని మాట్లాడుతూ ముఖ్యంగా ఐఓటి ఆర్మీ సెక్యూరిటీ అగ్రికల్చరల్ యాక్టివిటీస్ కి రిలేటెడ్ గా ఉన్న పేపర్స్ మీద ఎనాలసిస్ చేసి ప్రతి విద్యార్థి కూడా సెక్యూరిటీ వైపు ఎక్కువగా కాన్సన్ట్రేషన్ చేసి మన రియల్ టైంలో అప్లై అయ్యేవిధంగా రీసెర్చ్ యాక్టివిటీస్ చేయాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ విద్యాసంస్థల నుండి వచ్చిన ప్రతినిధులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారని చెప్పారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, ఏఐ, లాట్, ఇమేజ్ ప్రాసెసింగ్,డీప్ లెర్నింగ్ అండ్ మెషిన్ లెర్నింగ్ రంగాలలో నూతన ఆవిష్కరణలపై చర్చలు జరిగాయని తెలిపారు. ఈ సదస్సులో ఉత్తమ పత్రాలను ఎంపిక చేసి, విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమం జ్ఞాన వినిమయానికి,పరిశోధనాభివృద్ధికి మరియు సాంకేతిక రంగంలో కొత్త ఆలోచనలకు వేదికగా నిలిచిందని తెలిపారు. ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన గావించారు. అతిథులను కళాశాల యాజమాన్యం శాలువా, మెమొండోలతో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు హాజరవటం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ కళాశాలలో ఏర్పాటుచేసిన సౌకర్యాలపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్.పి. బాబు, అకాడమిక్ డైరెక్టర్ కె. హరిబాబు, ఈసీఈ విభాగాధిపతి డా.ఎన్.ఆదినారాయణ, కన్వీనర్ డా.పూర్ణకిషోర్, కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.శరత్ కుమార్, కోకో ఆర్డినేటర్ ఎన్.శ్రీప్రకాష్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మూడో శనివారం వాహనదారులచే ప్రతిజ్ఞ డే

## మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్

**తెనాలి టౌన్ ఏప్రిల్18(ప్రభాతవార్త):** ప్రతిమూడో శనివారం స్వచ్ఛ ఆంధ్రస్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహిస్తామని, తెనాలి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎంవి.రాఘవరావు తెలిపారు. దీనిలో భాగంగా, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అమృతారాణి వాహనదారుల చేత ప్రతిజ్ఞ చేయించారు.నేను, నా పరిసరాల పరిశుభ్రత కొరకు ప్రతి రోజు కొంత సమయం కేటాయిస్తానని, నా వంతు కృషిగా స్వచ్ఛత కార్యక్రమాల కొరకు శ్రమదానం పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి కట్టుబడి ఉంటానని ఈ రోజు పరిశుభ్రత గురించి నేను వేసిన ఈ ముందడుగు ఆంధ్ర రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచుటలో సహాయం చేస్తుందని నమ్ముతూ, ఈరోజు నా తోటి వారికి కూడ



"స్వచ్ఛత" పై అవగాహన కల్పించే ప్రయత్నిస్తానని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన, సుభిక్షమైన ఆనందకరమైన ఆంధ్ర రాష్ట్రాన్ని నిర్మించడానికి, నాతో మొదలైన ఈనిర్ణయం ద్వారా నారాష్ట్రాన్ని "స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర'గా తీర్చిదిద్దే విధంగా నా వంతు కృషి చేస్తానని ప్రమాణం చేస్తున్నాను. అని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో తెనాలి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎంవి.రాఘవరావు,అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అమృతారాణి,రాధాబాయ్,సిబ్బంది మరియు వాహనదారులు పాల్గొన్నారు.

# ఒక దురదృష్టకర సన్నివేశానికి వేదికైన లోక్‌సభ

గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 18,ప్రభాతవార్త : భారత ప్రజాస్వామ్యానికి మరో మెట్టుకి చేర్చే చారిత్రక సందర్భానికి నాంది పలకాల్సిన లోక్‌సభ ఒక దురదృష్టకర సన్నివేశానికి వేదికైందని నారీ లోకపు కలలు మరోసారి కరిగిపోయాయని అవగాహన సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ సభ్యులు అభిప్రాయపడ్డారు.అవగాహన సంస్థ కార్యాలయంలో ఏకాభిప్రాయ సాధనను అసాధ్యం చేసిన కేంద్ర ప్రభుత్వం అంశంపై పాల్గొన్నవారు చర్చించారు.ఈ సమావేశంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ 2029నుంచే చట్టసభల్లో మూడోవంతు సీట్లను మహిళలకు ప్రత్యేకించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లు తీవ్రవాదోపవాదాలు,విపరీతమైన భయ సందేహాల నడుమ వీగిపోయిందన్నారు.అన్నీ పార్టీలు మద్దతు పలికిన మహిళా రిజర్వేషను బిల్లును నియోజకవర్గాలు పునర్విభజనలో ముడిపెట్టడం మూలంగానే ఏకాభిప్రాయ సాధన అసాధ్యమైందన్నది వాస్తవమన్నారు.జనగణన పూర్తిచేసి పునర్విభజన ప్రక్రియను పట్టాలెక్కించిన తర్వాతే మహిళా రిజర్వేషన్‌ను ఆచరణ రూపంలోనికి తెస్తామని గతంలో స్పష్టంగా పేర్కొన్న కేంద్రం ప్రస్తుత బిల్లును ఆఘమేఘాల మీద ప్రతిపాదించి సభామోదం పొందడానికి తొందరపడటంతో విపక్షంలో అనుమాన బీజాలు నాటుకొని వ్యతిరేకించారన్నారు. సమావేశంలో విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య,సీనియర్ సిటిజన్స్ నాయకులు ఆర్.వెంకట రత్నంలు ప్రసంగించారు.

# నిమ్మగడ్డ వెంకట సుబ్బారావుకు గౌరవ డాక్టరేట్



**పెదనందిపాడు ఏప్రిల్ 18 (ప్రభాతవార్త) :** పెదనందిపాడు గ్రామానికి చెందిన అడ్వకేట్, నేషనల్ నోటరీ మరియు హోమియో డాక్టర్ నిమ్మగడ్డ వెంకట సుబ్బారావు కు అమెరికాలోని కాలిఫోర్నియా పబ్లిక్ యూనివర్సిటీ సైకాలజీ విభాగంలో గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయటం జరిగినది.వారు తమ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ను ఎమ్మెస్సీ సైకాలజీ లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి పూర్తి చేసినారు. తదనంతరం వారు ఎన్నో సంవత్సరాల నుండి వివిధ రకాల సెమినార్స్ మరియు ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ లో పాల్గొనడమే కాకుండా భగవద్గీతలో మాస్టర్ డిగ్రీని సాధించారు. వీరు అనేక అంశాల మీద బుర్రకథలు ప్రదర్శించడం ద్వారా సమాజాభివృద్ధికి పాటుపడినారు. అలాగే వారు సైకాలజీలో సమర్పించిన పరిశోధనా గ్రంథం "మనస్తత్వశాస్త్రం: 21వ శతాబ్దంలో మనస్సు, ప్రవర్తన మరియు శ్రేయస్సు" కీ గాను వారికి అమెరికాలోని కాలిఫోర్నియా పబ్లిక్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేటును అందించడం జరిగినది. ఈ సందర్భంగా వెంకట సుబ్బారావు ను పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి వీర రాఘవయ్య, అధ్యాపకులు. అధ్యాపకేతర సిబ్బంది, ఘనంగా సత్కరించారు. సందర్భంగా డాక్టరేట్ పొందిన సుబ్బారావు మాట్లాడుతూ తను డాక్టరేట్ సాధించటానికి సహాయ సహకారాలు అందించిన ప్రిన్సిపాల్ వీర రాఘవయ్య మరియు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

బాపట్ల జిల్లా వార్త



## విపక్షాల తీరుకు బిజెపి నిరసన



**రేపల్లె, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో మహిళా బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్,ఇండియా కూటమి ఓటు వేసిన తీరుకు శనివారం రేపల్లెలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా నాయకత్వంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకించడం విచారకరమని ఆందోళన వెలుబుచ్చారు.తమిళనాడు,కేరళ,పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో జరగబోయే ఎన్నికలలో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం నేర్పాలని పిలుపునిచ్చారు.2029 నుండి మహిళా రిజర్వేషన్‌ను ఆమోదించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నిర్ణయిస్తే కాంగ్రెస్ వ్యతిరేకించిందని బిజెపి నాయకులు పేర్కొన్నారు.

## నేడు అభివృద్ధి పనులకు మంత్రి అనగాని శంకుస్థాపన



**రేపల్లె, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రేపల్లె నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు ఆదివారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ శంకుస్థాపన చేస్తారు.ఉదయం 9 గంటలకు రేపల్లె మండలంలోని అరవపల్లి వద్ద తుమ్మల వైపుకు వెళ్ళే డబుల్ లైన్ రహదారి నిర్మాణానికి రూ.49 కోట్లు నిధులు మంజూరైన నేపథ్యంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ శంకుస్థాపన చేస్తారు.ఉదయం 9.30 గంటలకు రేపల్లె రెవెన్యూ డివిజనల్ కార్యాలయం పక్కన రూ.7 కోట్లతో నిర్మించనున్న ఇండోర్ ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తారు.అనంతరం నగరం మండలంలోని ఉల్లిపాలెంకు చేరుకుని ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల వజ్రోత్సవంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొంటారు.

# నిబంధనలు అతిక్రమిస్తే రిమాండే.!




**బాపట్ల, ఏప్రిల్ 18. ప్రభాతవార్త,ప్రతినిధి** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడేది లేదని, నిబంధనలు అతిక్రమించే రౌడీషీటర్లు, అనుమానితులపై కఠినంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశించారు. శనివారం బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత నేరస్తులు, అసాంఘిక శక్తులు మరలా తోక జాడిస్తే తక్షణమే రిమాండ్‌కు తరలించాలని, అవసరమైతే పీడీ చట్టాన్ని ప్రయోగించాలని స్పష్టం చేశారు.

ప్రస్తుత సీజన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు జోరందుకునే అవకాశం ఉన్నందున, బుకీలు, నిర్వాహకులపై డేగ కన్ను ఉంచాలని ఎస్పీ సూచించారు. లాడ్జీలు, హోటళ్లు, రహదారి పక్కన ఉండే దాబాల్లో నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో ఇళ్ల తాళాలు వేసి వెళ్లే వారిని లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు జరిగే ప్రమాదం ఉందని, రాత్రి గస్తీని (నైట్ పెట్రోలింగ్) మరింత ఉధృతం చేయాలని ఆదేశించారు.

**సాంకేతికతతో దర్యాప్తు వేగవంతం**

కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడాలన్నారు ముఖ్యంగా పోక్సో కేసులు: మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో ధారాలను త్వరగా సేకరించి, గడువులోగా ఛార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు.దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలైన సూర్యలంక, వాడరేవు, రామాపురం తీరాల్లో సీసీ కెమెరాల నిఘా పెంచాకన్నారు.గంజాయి రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలి. ఇందుకోసం కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించాలి. ఆయన తెలిపారు.

**శిరోరక్ష ప్రాణరక్షపై అవగాహన** : రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించడం తప్పనిసరని, దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలో హెల్మెట్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై (డ్రంక్ అండ్ డ్రైవ్) కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదకర మలుపుల వద్ద జిగ్‌జాగ్ డ్రమ్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లాలోని పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవన్నారు.

# పెట్రోల్ బంక్ వద్ద నిబంధనలు పాటించాలి

### రేపల్లె ఫైర్ స్టేషన్ ఆఫీసర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు



రేపల్లె, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:పెట్రోల్ బంకుల వద్ద అగ్నిమాపక శాఖ నిబంధనలను పాటిస్తే అగ్నిప్రమాదాలు చోటుచేసుకోవని రేపల్లె అగ్నిపమాపక శాఖ అధికారి యార్లగడ్డ వెంకటేశ్వరరావు చెప్పారు.శనివారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పెట్రోల్ బంకులు,గ్యాస్ గోడౌన్ల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలతోనే అగ్నిప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు.పెట్రోలు బంక్ ప్రాంగణంలో అగ్గిపెట్టెలు,సిగరెట్లు,లైటర్లు వినియోగించరాదన్నారు. వాహనంలో ఇంధనం నింపే సమయంలో వాహనం ఇంజన్ ఆపివేయాలని ఆయన సూచించారు.ముఖ్యంగా వాహనాలలో ఇంధనం నింపేటప్పుడు ఎట్టి పరిస్థితిలో మొబైల్ ఫోన్ వాడరాదని చెప్పారు. ఫోన్ వాడితే చిన్నపాటి స్పార్క్‌కు కారణమవుతుందని తెలిపారు.ప్లాస్టిక్ సీసాలు లేదా డ్రమ్ములలో పెట్రోల్ నిల్వ చేయడం ప్రమాదకరమని వెంకటేశ్వరరావు వివరించారు.విధిగా పెట్రోల్ బంక్ వద్ద ఇసుక బకెట్లు,ఫైర్ ఎక్స్‌టింగ్యుషర్లు(సిఒ2) అందుబాటులో ఉంచాలని చెప్పారు.పెట్రోల్ బంక్‌లో ప్రమాదం సంభవిస్తే భయపడకుండా పెట్రోల్ పంప్ స్విచ్ ఆఫ్ చేయాలని పేర్కొన్నారు.మంటలు చిన్నగా ఉంటే ఫైర్ ఎక్స్‌టింగ్యుషర్ లేదా ఇసుకను ఉపయోగించి అదుపు చేయవచ్చని చెప్పారు.మంటల్లో చిక్కుకున్నప్పుడు దుప్పట్లను నీటిలో ముంచి శరీరానికి చుట్టుకుని నేలపై పాకుతూ బయటపడాల్సి ఉంటుందన్నారు. వేసవిలో పెట్రోల్ ఆవిరి తీవ్రత ఎక్కువగా ఉంటుందని దీనిని దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని వెంకటేశ్వరరావు తెలిపారు.అగ్నిప్రమాదాల నివారణపై పెట్రోల్ బంక్ సిబ్బంది కోసం మాక్ డ్రిల్ నిర్వహించారు.

**గ్యాస్ గోడౌన్లలో అ ప్రమత్తంగా ఉండాలి..**

గ్యాస్ గోడౌన్ల వద్ద అగ్నిమాపక శాఖ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు.గోడౌన్ పరిసరాలలో చెత్తాచెదారం,గడ్డి లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.ఎలక్ట్రికల్ వైరింగ్,కరెంట్ మీటర్ల వద్ద షార్ట్ సర్క్యూట్ కాకుండా గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.గ్యాస్ గోడౌన్ లోపల పరిసరాలలో ధూమపానం నిషేధం అమలులో ఉండాలని చెప్పారు.అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆయన ఆదేశించారు.గ్యాస్ లీక్ అవుతుంటే వెంటనే రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలన్నారు. సిలిండర్ నుండి మంటలు వస్తుంటే ఎట్టి పరిస్థితుల్లో నీటితో ఆర్పే ప్రయత్నం చేయవద్దన్నారు.తడి టవల్ లేదంటే ఫైర్ బ్లాంకెట్‌ని మంటలపై కప్పాలని చెప్పారు.గ్యాస్ గోడౌన్ లోపల ప్రమాదం సమయంలో చిక్కుకుంటే వెంటనే సిబ్బంది కిందకి వంగి పొగ నుండి తప్పించుకోవాలని అల్మారాల కింద దాక్కోకూడదని వెంకటేశ్వరరావు వివరించారు.గ్యాస్ గోడౌన్ సమీపంలో నివసించేవారు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.ఎటువంటి ప్రమాదం జరిగినా వెంటనే 101కి ఫోన్ చేసి అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన కోరారు.అగ్నిప్రమాదాల నివారణ జాగ్రత్తలకు సంబంధించిన కరపత్రాలను ఐదో రోజు అగ్నిమాపక శాఖ సిబ్బంది పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది పి.శ్రీనివాస్,ఎ.అనిరుధ్రుడు,ఎస్.నాగేంద్ర రెడ్డి(ఎల్ఎఫ్),వి.సుబ్బారావు, వి.చంద్రమోహన్(డ్రైవర్),ఎం.జనార్ధన రావు,డి.పవన్‌కళ్యాణ్,డి.రాజేష్ గౌడ్(ఎఫ్ఎం),ఎ.నాగార్జున రావు,కె.వెంకటేష్, ఎన్.వెంకటేశ్వరరావు (హెచ్‌జి) తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు ఎస్పీ ప్రశంసలు

**బాపట్ల, ఏప్రిల్ 18. ప్రభాతవార్త ప్రతినిధి:** విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికాబిరులు, సిబ్బందిని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు. శనివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న మహిళా మిస్సింగ్ కేసులను ఛేదించిన శక్తి బృందం సభ్యులతో పాటు, ఐ జి ఒ టిపోర్టల్‌లో అత్యధిక శిక్షణ తరగతులు పూర్తి చేసిన ఎనిమిది మంది సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు.సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్ కేసులను ఛేదించడంలో రేపల్లె, చీరాల సబ్ డివిజన్లకు చెందిన శక్తి బృందం కానిస్టేబుళ్ల వై. గోపీనాథ్, కె. సుబ్బారావులు చూపిన చొరవను ఎస్పీ కొనియాడారు.



కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో 2008 నుంచి మిస్టరీగా మారిన మహిళా మిస్సింగ్ కేసును కానిస్టేబుల్ వై. గోపీనాథ్ ఛేదించారు.

వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో 2013, 2015 సంవత్సరాలలో నమోదైన రెండు వేర్వేరు మహిళా మిస్సింగ్ కేసులను కానిస్టేబుల్ కె. సుబ్బారావు ట్రేస్ చేసి బాధితుల ఆచూకీ కనుగొన్నారు. ఐ జి ఒ టికర్మయోగిలో టాప్..ప్రభుత్వ ఉద్యోగుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే కర్మయోగి ప్లాట్‌ఫామ్‌లో జిల్లాలో అత్యధిక కోర్సులు పూర్తి చేసిన వారిని ఎస్పీ గౌరవించారు.

**ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో:**సి.సి.ఎస్ ఇన్‌స్పెక్టర్ పెర్లి ప్రేమ్యఐటికోర్ ఎస్సై అందేల నాగేశ్వరరావుహెడ్ కానిస్టేబుళ్లు కె. మాణిక్యరావు (కర్లపాలెం), పి. రామారావు (చీరాల । టౌన్), జి. శ్రీనివాసరెడ్డి, ఎల్. శ్రీనివాసరావు (డిఏఆర్)కానిస్టేబుళ్లు దాసరి రవి, కట్టా టైసన్‌జూనియర్ అసిస్టెంట్ బొల్లా కనికరమ్మ తదితరులు ఉన్నారు.సాంకేతికతను అందిపుచ్చుకుని పౌరులకు మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం చేశారు.

## వైకాపా అభ్యున్నతికి కృషి చేయాలి : పీటా నాగ మోహన్‌కృష్ణ

**రేపల్లె, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు నాడు ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి



అవలంభించిన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తుచేస్తూ పార్టీ అభ్యున్నతికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ సూచించారు.శనివారం రేపల్లె పట్టణంలోని 28 వార్డుల వైకాపా ఇన్‌ఛార్జ్‌ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో జగన్ పాలనపై ఆదరణ తగ్గలేదనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలన్నారు.వైకాపా పాలనలో ప్రతి కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం చేకూరిందని చెప్పారు.2029 ఎన్నికలలో వైకాపా ఘనవిజయం సాధిస్తుందని అదే ఉత్సాహంతో కార్యకర్తలు,పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో సత్సంబంధాలు కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతి ఒక్కరినీ కలుపుకుపోవాలని పీటా నాగమోహన్‌కృష్ణ స్పష్టం చేశారు.రాష్ట్రంలోని ప్రజలకు మరింత అభివృద్ధి జరగాలంటే జగన్మోహన్‌రెడ్డి వలనే సాధ్యపడుతుందని ఆయన చెప్పారు.రా ష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులను కోరారు.పార్టీ విధి విధానాల గురించి ఆయన వివరించారు.ఈ సమావేశంలో చిమటా బాలాజీ, రాంబాబు,ప్రభుకిరణ్, రమేష్,ఖాదర్,శివ,కృష్ణారెడ్డి, నాగరాజు, ఫణి,కుర్దూస్,గౌస్‌భాషా,బాలకృష్ణ,గోపర్తి గోపి,సత్యనారాయణ,సజ్జా గోపి,ఉమారాణి, రామకృష్ణ, వెంకటేశ్వరరావు,ప్రదీప్,సుమలత,వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు మంచి ఆహారపు అలవాట్లు నేర్పించాలి సిడిపిఓ అనసూయ

**చెరుకుపల్లి ,ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** చిన్నతనం నుండి పిల్లలకు మంచి ఆహారపు అలవాట్లు నేర్పించడం తల్లిదండ్రుల ప్రతి ఒక్కరు బాధ్యతని సిడిపిఓ అనసూయ అన్నారు. శనివారం కావూరు



గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు, తల్లిదండ్రులకు చిన్నారుల ఆహారపు అలవాట్లు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా ప్యాకెట్ పదార్థాలకు, ఫాస్ట్ ఫుడ్ కు పిల్లలను దూరంగా ఉంచాలని వాటి వలన పలు ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని ఆమె వివరించారు. పౌష్టికాహారమైన ఉడకబెట్టిన, వేపిన , పాలతో చేసిన పదార్థాలను అందించడం ద్వారా ఆరోగ్యపరంగా, ఆలోచనపరంగా పిల్లలు చిన్నప్పటినుండే దృఢంగా ఉంటారని ఆమె తెలిపారు. అదేవిధంగా ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయటం చట్టం నేరమని, అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలకు బాలింతలకు అందించే పోషక ఆహార పదార్థాలను చేసుకోవాలని సిడిపిఓ సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సుబ్బమ్మ, ఏఎన్ఎంలు ఉష , జ్యోతి ఆశా వర్కర్లు తిరుపతమ్మ, కుమారి, సుజాత అంగన్వాడి కార్యకర్తలు శిరీష, దానమ్మ, వెంకటేశ్వరమ్మ ,చైతన్య, చిన్నారులు, వారి తల్లిదండ్రులు స్థానికులు పలువురు పాల్గొన్నారు.

## రెడ్డి సేవా మిత్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు సన్మానం

**కర్లపాలెం. ఏప్రిల్ 18. ప్రభాతవార్త :** భవిష్యత్ లో ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సాధించి జీవితంలో స్థిర పడాలని రెడ్డి సేవా మిత్ర అధ్యక్షులు నంగు గోవర్ధన్ రెడ్డి, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.



ఇంటర్మీడియట్ లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రెడ్డి సేవా మిత్ర ఆధ్వర్యంలో శనివారం అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాలువాతో సన్మానించి జ్ఞాపిక తోపాటు స్వీట్ బాక్సలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా మిత్ర గౌరవ అధ్యక్షులు చీరాల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి ఏట్ర ప్రసాద్ రెడ్డి, కోశాధికారి హరిబాబు రెడ్డి, పిట్ల వసంత్ రెడ్డి, పిట్ల చంద్రశేఖర్ రెడ్డి, ఆట్ల నాగేశ్వర రెడ్డి, చీరాల బ్రహ్మానందరెడ్డి, ఆట్ల అయ్యప్ప రెడ్డి, పిట్టు నాగాంజనేయులురెడ్డి, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు..

## మత్స్యకార భరోసా పథకంలోని లోపాలను సరిచేయాలి

రేపల్లె, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మత్స్యకార భరోసా పథకంలోని లోపాలను సరిచేసి అర్హులకు మాత్రమే పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆం ధ్రప్రదేశ్ బిసి అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.శనివారం ఆయన మాట్లాడుతూ సముద్రంలో వేట నిషేధ కాలంలో జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.20 వేలు వంతున ఆర్థిక సహాయం అమలు చేస్తున్నదని చెప్పారు.గత సంవత్సరం చోటుచేసుకున్న లోపాలను ఆయన ప్రస్తావించారు.బాపట్ల జిల్లాలో 624 మంది మత్స్యకారులకు మత్స్యకార భరోసా ఆర్థిక సహాయం అందనే లేదన్నారు.రాష్ట్ర స్థాయిలో ఇటువంటి సంఘటనలపై దర్యాప్తు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.మత్స్యకారులకు చెందిన 14 ఉప కులాలకు చెదిన అర్హులైన వారికి బదులుగా ఇతర కులాలకు చెందిన వారి పేర్లు నమోదు చేసి ఆర్థిక సహాయం అందజేశారని ఆయన విమర్శించారు.అగ్నికుల క్షత్రియులు,పల్లెకాపులు ,జాలర్లు,వాడబలిజలు,తూర్పుకాపులు,వన్యకాపులు,బెస్తలు తదితర ఉప కులాలకు చెందిన మత్స్యకారులే మత్స్యకార భరోసా పథకానికి అర్హులని ఆయన వెల్లడించారు.లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని కోరారు.నిబంధనలను విస్మరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకార భరోసా జాబితాలను పరిగణలోకి తీసుకుని ఇతర కులాల వారి పేర్లను చేర్చిన అంశాలను బహిర్గతం చేస్తామని వెంకటేశ్వరరావు హెచ్చరించారు.



## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

### తహశీల్దార్ శ్రీనివాసరావు

**రేపల్లె, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** సమాజంలో పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని రేపల్లె తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు.శనివారం రేపల్లె పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో స్వర్ణ ఆం ధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నీటి వనరులను రక్షించుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రత,సుస్థిర అభివృద్ధి,పచ్చదనంలో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా పి4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఆయన వివరించారు.అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు,రేపల్లె పట్టణ తెదేపా అధ్యక్షుడు మేకా రామకృష్ణ,పట్టణ ఆదర్శవేదిక కన్వీనర్ వై.కిషోర్‌బాబు, మున్సిపల్‌అధికారులు, ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## సంఘం డైరీ పాల ప్యాకెట్ విక్రయ కేంద్రంలో తనిఖీలు

**కర్లపాలెం. ఏప్రిల్ 18. ప్రభాతవార్త:** కర్లపాలెంలో సంగం డైరీ పాల ప్యాకెట్ కొనుగోలు చేసిన కొందరు వినియోగదారులు పాలు విరిగిపోయిన ఘనపై కర్లపాలెం లో శనివారం జిల్లా ఆహార భద్రత అధికారి ప్రణీత్ కుమార్ తనిఖీలు నిర్వహించారు. కొనుగోలు చేసిన కస్టమర్లు ను పిలిచి జరిగిన విషయం పై విచారణ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు చేసిన కరీమా తాను 3 ప్యాకెట్లు కొనుగోలు చేశాను అని అవి కాచిన తరువాత విరిగి పోయి ప్లాస్టిక్ లాంటి పదార్థంగా తయారు అయినవి అని తెలిపారు. అనంతరం



ఆహార భద్రత తనిఖీ అధికారి ప్రణీత్ కుమార్ మాట్లాడుతూ నిలువచేసే విషయంలోనే సరైన నియమాలు పాటించకపోవడంతో పాలు విరిగిపోయి ఉండవచ్చున్నారు.దీనిపై పూర్తి విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. వేసవి కాలం దృశ్య పాల నిల్వకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

## ఉపాధ్యాయులు వెంకట్రావు సేవలు అభినందనీయం

**కర్లపాలెం,ఏప్రిల్ 18. ప్రభాతవార్త :** ఉపాధ్యాయులు



వెంకట్రావు సేవలు అభినందనీయమని కర్లపాలెం మండల విద్యాశాఖ అధికారి టి యు మనోరంజని అన్నారు .30 సంవత్సరాలు విద్యా రంగంలో పనిచేసి ఈనెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయుచున్న సందర్భంగా శనివారం స్థానిక గణపవరం బాబూజీ కాలనీ ప్రైమరీ పాఠశాలలో ఘనంగా సన్మానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి వెంకట్రావు కృషి అభినందనీయం అన్నారు .ఈ సందర్భంగా మాజీ మండల విద్యాశాఖ అధికారి జి ఏడుకొండలు మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసిన మంచి వ్యక్తి వెంకటరావు అన్నారు . అనంతరం మండల విద్యాశాఖ అధికారి.ఎస్టియు మరియు ఉపాధ్యాయ నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బి నాగరాజు, వైవినారాయణ, శ్రీనివాసరావు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పిల్లలు మొబైల్ వాడకంవల్ల అనేక అనర్థాలు

**నిజాంపట్నం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** చిన్నారులు మొబైల్ ఫోన్‌ను అధికంగా వాడటంవల్ల మానసిక, శారీరక సమస్యలు వస్తాయని సిడిపిఓ అనసూయ అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక రుణ జీవనోపాధి సర్వే శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికంగా ఉప్పు వాడరాదన్నారు. అనారోగ్యకరమైన




కొవ్వులు కలిగిన పాకెట్ ఫుడ్‌కు పిల్లలను దూరం గా ఉంచాల న్నారు. పిల్లల పెంపకంలో తల్లులతోపాటు తండ్రులు భాగస్వామ్యం కవాలని తెలియజేశారు. ఆటపాటలద్వారా పిల్లలకు విద్య బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం రమాదేవి, ఎపిఎం మస్తాన్‌రావు, సిసిలు శేషగిరిరావు, గాంధీ, శేషావతారంలు, నాగలక్ష్మీ, కనకదుర్గ, విజయలక్ష్మీ, కుమారి, పోలేరమ్మ గ్రామసమైక్య సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మహిళాబిల్లుకు వ్యతిరేకం కాదు: చందు సాంబశివుడు

**తెనాలి టౌన్ ఏప్రిల్18(ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీ మహిళా బిల్లుకు వ్యతిరేకం కాదని,ఈ బిల్లును అడ్డుపెట్టుకుని ప్రతిపక్షపార్టీ లను సంప్రదించకుండా తెచ్చిన డీలిమిటేషన్ బిల్లును ముందుకు తీసుకురావటాన్ని, కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు వ్యాఖ్యానించారు. శనివారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన ప్రభావాన్ని కోల్పోయిందని, ఏప్రిల్ 16వ తేదీన పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళాబిల్లుతో పాటు డి లిమిటేషన్ బిల్లులను, అత్యవసరంగా పార్లమెంటు సమావేశపరచి ప్రతిపక్షాలను సంప్రదించకుండా డీ లిమిటేషన్ పై చర్చ జరగనివ్వకుండా,పార్లమెంటు ముందుకు తీసుకు రావాల్సిన అవసరం ఏమొచ్చిందని, ఇటీవల జరిగిన కేరళ అస్సాం పాండిచ్చేరి ఎన్నికలలో బిజెపి కి వ్యతిరేక ఫలితాలు రాబోతున్న తరుణంలో, త్వరలో రాబోతున్న బెంగాల్ తమిళనాడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని డీ లిమిటేషన్ బిల్లును ఆమోదంప చేసుకుందాం అనే ఆలోచనను ప్రతిపక్ష పార్టీలు తిప్పికొట్టడం సభలో తగినంత మెజారిటీ లేక ఆ బిల్లులు వీగిపోవటం భారతీయ జనతా పార్టీకి పెద్ద ఎదురుదెబ్బని,మహిళా బిల్లు 2023లోనే ఆమోదించబడిన నేటికీ కార్యరూపం దాల్చలేదని డాక్టర్ సాంబశివుడు తీవ్రంగా దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు పెద్ద పేట వేస్తుందని ఎందరో మహిళలకు ప్రభుత్వ అధినేతలుగా అవకాశాలు కల్పించిందని అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సరోజినీ నాయుడు అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా పనిచేశారని తదనంతర కాలంలో సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా పనిచేశారని అంతేకాకుండా దివంగత శ్రీమతి ఇందిరా గాంధీ దేశ ప్రధానిగా పనిచేయటం అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన షీలా దీక్షిత్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా పనిచేసే ఈ విధంగా కాంగ్రెస్ పార్టీలోనే మహిళలకు న్యాయం జరుగుతుందని ప్రజలు ఈ విషయాలను గమనించాలని డాక్టర్ సాంబశివుడు కోరారు.ఈ కార్యక్రమంలో, తెనాలి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నూరు నాగ సూర్యశేషిధరావు,గుంటూరు జిల్లా జనరల్ సెక్రెటరీ యన్నం శెట్టి ప్రసాద్,పట్టణ ఉపాధ్యక్షుడు గుర్రపు ద్వారకా శ్రీనివాస్,పెనుగొండ శివకుమార్,భీమా రమేష్,బి. శ్రీను,తదితరులు పాల్గొన్నారు

## మత్స్యసంపద వేట నిషేధాన్ని తప్పక అమలు చేయాలి

**నిజాంపట్నం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మత్స్యసంపద పునరుత్పత్తి సమయంలో విధించిన చేపలవేట నిషేధాన్ని మత్స్యకారులంతా ఐకమత్యంగా తప్పక అమలు చేయాలని మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నిజాంపట్నం హార్బర్‌లో మత్స్యకారులతో, బోటు యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల కోసమే సముద్రంలో



మత్స్యసంపద వేటపై నిషేదం విధించారన్నారు. మత్స్యసంపద పునరుత్పత్తికాకుండా వేట చేయటం వల్ల భవిష్యత్‌లో మత్స్యసంపద తరిగిపోయి మత్స్యకారులు జీవనంకోల్పోయే ప్రమాదం ఉందని ఆయన తెలియజేశారు. భవిష్యత్‌లో మత్స్యకారులు ఇబ్బంది పడకుండా ఉండాలంటే మత్స్యసంపదైన చేపల, రొయ్యల వేటపై విధించిన నిషేదాన్ని తప్పక అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చట్టపరచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మత్స్యకార భృతి అందించేందుకు చేస్తున్న ఎన్యుమరేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. సముద్రంలో మత్స్యసంపద వేట చేసి జీవించే ప్రతి ఒక్కరికీ వేట నిషేద భృతి అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దిండిలో నిర్మాణం జరుగుతున్న ఆక్వాపార్కు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జెడి శ్రీనివాసనాయక్, డిడి గాలిదేవుడు, ఎడి సైదా నాయక్,అగ్నికుల క్షత్రియకార్పోరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, పాల్గొన్నారు.

# హార్మూజ్ జలసంధిలో ఐఆర్జీసీ కాల్పులు

## వెనుదిరిగిన రెండు భారత్ ట్యాంకర్లు



**టెహ్రాన్, ఏప్రిల్ 18:** హార్మూజ్ జలసంధిలో మరో సారి తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్జీసీ) బలగాలు ఒక ఆయిల్ ట్యాంకర్‌పై కాల్పులు జరపగా, రెండు భారత జెండా కలిగిన నౌకలు సహా పలు వాణిజ్య నౌకలు వెనక్కి మళ్లాయి. ఈ పరిణామం ప్రపంచ వ్యాప్తంగా చమురు సరఫరాపై ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఈ ఘటన ఒమన్‌కు 20 నాటికల్ మైళ్ల దూరంలో శనివారం చోటుచేసుకున్నట్లు యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యూకేఎంటీవో) ధృవీకరించింది. ఇరాన్‌కు చెందిన రెండు గన్‌బోట్లు ఎలాంటి రేడియో హెచ్చరికలు జారీ చేయకుండా ఒక ట్యాంకర్‌ను సమీపించి కాల్పులకు తెగబడ్డాయి. ఈ ఘటనలో నౌకకు గానీ, సిబ్బందికి గానీ ఎలాంటి హాని జరగలేదని, అంతా సురక్షితంగా ఉన్నారని ట్యాంకర్ మాస్టర్ నివేదించినట్లు యూకేఎంటీవో తెలిపింది. ఇదే సమయంలో హార్మూజ్ జలసంధిపై తిరిగి తమ పూర్తి స్థాయి నియంత్రణను పునరుద్ధరించినట్లు ఇరాన్ సంచలన ప్రకటనచేసింది. అమెరికా తమ నౌకలపై కొనసాగిస్తున్న దిగ్బంధనానికి ప్రతిస్పందనగా ఈ మూసివేత చర్యలు తీసుకుంటున్నామని స్పష్టంచేసింది. అమెరికా ఆంక్షలు ఎత్తివేసేంత వంకు ఈ నియంత్రణ కొనసాగుతుందని ఇరాన్ అధికారిక వార్తాసంస్థ తస్నీమ్ పేర్కొంది. ఇరాన్ కాల్పుల నేపథ్యంలో వెనక్కి మళ్లిన నౌకల్లో రెండు భారతీయ జెండా నౌకలు ఉన్నట్లు సమాచారం. వీటిలో ఒకటి 20 లక్షల బ్యారెల్స్ ఇరాక్ చమురును తరలిస్తున్న భారీ సూపర్ ట్యాంకర్ కావడం గమనార్హం. ఇరాన్ తాజా చర్యలతో హార్మూజ్ జలసంధిగుండా ప్రయాణిస్తున్న సుమారు 10వాణిజ్య నౌకలు తమ మార్గాలను మార్చుకుని వెనక్కి మళ్లినట్లు జిన్హువా వార్తా సంస్థ నివేదించింది. ఇరాన్ సముద్ర ట్రాఫిక్‌ను పర్యవేక్షించే లారక్ ద్వీపం సమీపంలో ఈ నౌకలు తమ దిశను మార్చుకు న్నట్లు మెరైన్ ట్రాఫిక్ డేటా సూచిస్తోంది. మధ్యప్రాచ్యంలో ఇప్పటికే నెలకొన్న యుద్ధవాతావరణాన్ని ఈ తాజా పరిణామాలు మరింత తీవ్రతరం చేశాయి. ఈ ఘటన ప్రపంచ చమురుసరఫరాపై తీవ్ర ప్రభావం చూపే అవకాశంఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత విదేశాంగ మంత్రిత్వశాఖ, నౌకాదళం పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయని, భారతీయ నౌకలభద్రతకుఅవసరమైన చర్య లు తీసుకుంటున్నాయని అధికారవర్గాలు తెలిపాయి.



## న్యాయవ్యవస్థలో కృత్రిమమేథ ప్రత్యామ్నాయం కాదు

### చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

**బెంగళూరు, ఏప్రిల్ 18:** న్యాయ వ్యవస్థలో కృత్రిమమేథ (ఏఐ) వినియోగంపై చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్ పలు సూచనలుచేశారు. ఏఐ విషయంలో ఆందోళనలు వద్దని అన్నారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలంటే అంతర్గత పరిమితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. కర్ణాటక రాష్ట్ర స్టేట్ జ్యూడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సాంకేతికత అనేది సలహాలు ఇవ్వడంలో ఉపయోగపడుతుందన్నారు. ఏఐ మనుషులకు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని గుర్తించాలని వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థలో ఏఐ అనుసంధానం చేయాలంటే సమతుల్యత పాటించాలని అన్నారు. క్లిష్టమైన ప్రశ్నలతో కూడిన ఓ కేసు మీ ముందుకు వస్తే, ఆ సమస్యను పరిష్కరించడానికి మీరు సమయం వెచ్చించి ఆలోచిస్తారని,దానిని పరిష్కరించాక మీరు గొప్ప అనుభూతిని పొందుతారన్నారు. ఇలాంటి విషయాల్లో ఏఐ సామర్థ్యం సరిపోకపోవచ్చన్నారు.

## యజమాని ఇంటికే పనిమనిషి కన్నం: రూ.25 లక్షల దోపిడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** దేశ రాజధాని ఢిల్లీలో ఒక మద్యం వ్యాపారి ఇంట్లో పనిమనిషిగా చేరిన వ్యక్తి తన అనుచరులతో కలిసి యజమాని ఇంట్లోనే దోపిడీకి పాల్పడ్డాడు. వ్యాపారి కుటుంబ సభ్యులను వారు నిర్బంధించారు. రూ.25 లక్షల విలువైన నగలను దోచుకున్నారు. ధనికులు నివసించే గోల్ఫ్ లింక్స్ ప్రాంతంలోని మద్యం వ్యాపారి అశోక్ చావ్లా ఇంట్లో సుశీల్ అనే వ్యక్తి కొత్తగా పనిలో చేరాడు. అతడు తన అనుచరులతో కలిసి ఆ ఇంట్లో దోపిడీకి ప్లాన్ చేశాడు. గురువారం సాయంత్రం 6గంటల సమయంలో ఆరుగురు వ్యక్తులు ఆ ఇంట్లోకి ప్రవేశించారు. వృద్ధ జంట, వారి కోడలు, పిల్లలను ఒక గదిలో నిర్బంధించారు. వారిని బెదిరించడంతో పాటు ఇంట్లో అన్ని చోట్ల వెతికారు. రూ.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు దోచుకుని పారిపోయారు. మరోవైపు ఈసమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ వ్యాపారి ఇంటికి చేరుకున్నారు. పనిమనిషి సుశీల్ పక్కా ప్లాన్, రెక్కీ నిర్వహించిన తర్వాత తన వారితో కలిసి ఈ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానించారు. అతడ్ని నియమించిన సంస్థ నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. కాల్ డేటా వంటి సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్, హర్యానాతో సహా పలు రాష్ట్రాల్లో నిందితుల కోసం వెతుకుతున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.



## అమెరికాలో శాస్త్రవేత్తల అదృశ్యం వెనుక వీడని మిస్టరీ

**వాషింగ్టన్, ఏప్రిల్ 18:** అమెరికాలో ఉన్నత స్థాయి శాస్త్రవేత్తలు వరుసగా ప్రాణాలు కోల్పోవడం లేదా అదృశ్యం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. 2023 నుంచి ఇప్పటివరకు సుమారు 10 మంది శాస్త్రవేత్తలు అనుమానాస్పద రీతిలో మరణించడం లేదా కనిపించకుండా పోవడంపై అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలపై స్వయంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, ఇది యాదృచ్ఛికమా లేక వెనుక ఏదైనా కుట్ర ఉందా అనేది త్వరలో తేలుస్తాం అని ప్రకటించడంతో ఈ వ్యవహారం ప్రాధాన్యత సంతరించుకుంది. అదృశ్యమైన వారిలో చాలామంది అణుశక్తి, గ్రహాంతరవాసుల నౌకలపై పరిశోధనలు చేస్తున్నవారే కావడం గమనార్హం. న్యూ మెక్సికో రాష్ట్రం నుంచే నలుగురు శాస్త్రవేత్తలు కనిపించకుండాపోవడం అనుమానాలను మరింతపెంచింది. పెంటగాన్‌లో అంతరిక్ష పరిశోధనలు చేసిన మేజర్ జనరల్ విలియం నీల్ మెక్‌కాస్లాండ్ ఈ ఏడాది ఫిబ్రవరిలో అదృశ్యమయ్యారు. గతేడాది జూన్‌లో జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీ డైరెక్టర్ మోనికా రెజా హైకింగ్‌కు వెళ్లి స్నేహితురాలికి కొన్ని అడుగుల దూరంలోనే మాయమయ్యారు. ఎంఐటీ ప్రొఫెసర్ నునో లౌరిరో, ఖగోళ శాస్త్రవేత్త కార్ల్ గ్రిల్మైర్‌లను దుండగులు కాల్చి చంపారు. ఈ వరుస ఘటనల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, గ్రహాంతరవాసులు లేదా అణుశక్తికి సంబంధించిన రహస్యాలు బయటకు పొక్కకుండా ఉండేందుకే ఈ హత్యలు జరుగుతున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. హార్వర్డ్ ప్రొఫెసర్ అవి లోబ్ వంటి నిపుణులు దీన్ని భిన్నంగా చూస్తున్నారు. ఇవి వేర్వేరు ఘటనలని, శాస్త్రవేత్తలపై ఉండే తీవ్రమైన పని ఒత్తిడి, వ్యక్తిగత కారణాలు కూడా అయి ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనప్పటికీ, ఈ వరుస ఘటనలపై అమెరికా ప్రభుత్వం దృష్టి సారించింది. నివేదికలను క్షుణ్ణం గా పరిశీలిస్తున్నామని, నిజానిజాలను త్వరలోనే వెల్లడిస్తామని శ్వేతసౌధం ప్రకటించడంతో ఈ మిస్టరీ వీడుతుందని అందరూ ఎదురు చూస్తున్నారు.



## పార్లమెంటు నిరవధిక వాయిదా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. లోక్‌సభ శనివారం నిరవధిక వాయిదా పడింది. దీంతో జనవరిలో మొదలైన బడ్జెట్ సమావేశాలు ముగిసిపోయాయి. ఇవాళ ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే, స్పీకర్ ఓం బిర్లా సమావేశ వివరాలను వెల్లడించారు. ఆ తర్వాత ఆయన సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 16 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ముందురోజు లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. మూడవ వంతు మెజారిటీ రాకపోవడంతో మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా ఓటమిపాలైంది. డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా లోక్‌సభ సీట్లను పెంచే ప్రక్రియ కూడా స్తంభించిపోయింది. రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ తెలిపారు. రాజ్యసభ సుమారు 157గంటల 40 నిమిషాల పాటు సాగినట్లు చెప్పారు. సుమారు 110 శాతం ఉత్పాదకతను సాధించినట్లు తెలిపారు.

## బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో దోపిడి దొంగల హల్‌చల్



**భోపాల్, ఏప్రిల్ 18:** మధ్యప్రదేశ్ రాష్ట్రం సింగ్రౌలీ జిల్లా బైదాన్ పట్టణంలోని విద్యానగర్ ఏరియా లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌లో దోపిడీ దొంగలు చొరబడి నగదుతోపాటు లాకర్‌లలోని బంగారం, వెండి ఎత్తుకెళ్లారు. రూ.15 కోట్ల విలువైన బంగారం, రూ.35 లక్షల నగదు, వెండితో వారు పరారైనట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఐదుగురుదుండగులు బ్యాంకులో చొరబడి బ్యాంకు సిబ్బందిని, వినియోగదారులను తుపాకులతో బెదిరించి బంధించారు. అనంతరం కేవలం 20 నిమిషాల్లోనే బంగారం, వెండి, నగదుతో ఉడాయించారు. మొదట ఇద్దరు దొంగలు కస్టమర్లలా నటిస్తూ బ్యాంకులోకి ప్రవేశించారు. వారు తుపాకులు తీసి సిబ్బందిని, కస్టమర్లను బెదిరిస్తుండగా మరో ముగ్గురు దొంగలు బ్యాంకులో చొరబడ్డారు. సిబ్బంది, కస్టమర్లు అందరూ తమ మొబైల్స్ ఒకేదగ్గర పెట్టాలని ఆదేశించారు. అందుకు కొందరు నిరాకరించడంతో గాల్లోకి కాల్పులు జరిపి బెదిరించారు. అందరి ఫోన్‌లు తీసుకున్న తర్వాత కస్టమర్లను, సిబ్బంది గోడవైపు ముఖాలు చేసి కూర్చోవాలని ఆదేశించారు. కదిలినా, మాట్లాడినా చంపేస్తామని బెదిరించారు. ఆ సమయంలో తనకు దగ్గరావడంతో దగ్గానని, దగ్గితే చంపేస్తాంఅని దొంగలు వార్నింగ్ ఇచ్చారని ఓ కస్టమర్ చెప్పారు. దోపిడీ సమయంలో ఒక దొంగ బ్యాంకు గేటు దగ్గర నిలబడగా, మరో ఇద్దరు బ్యాంకులోపల కస్టమర్లకు తుపాకీ గురిపెట్టి నిలబడ్డారు. మరో ఇద్దరు బ్యాంక్ మేనేజర్ దగ్గరికి వెళ్లి లాకర్ల తాళాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు ఆమె నిరాకరిం చడంతో చెంపపై కొట్టి తాళాలు లాక్కున్నారు. భారీ విలువైన నగలు, నగదుతో ఉడాయించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ సాయంతో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి మధ్యప్రదేశ్‌తో పాటు దాని చుట్టుపక్కల రాష్ట్రాల్లో కూడా దోపిడీ దొంగల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

### మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే

## 2023 చట్టాన్ని అమలు చేయాలి

### ఇండియా కూటమి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రధాని భావిస్తే 2023 చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ లేఖ రాయనున్నట్లు తెలిపారు. తాము మహిళా రిజర్వేషన్‌కు మద్దతిస్తున్నా మని, కానీ దాని ము సుగులో ప్రభుత్వం భారత ఎన్నికల ముఖ చిత్రాన్ని మార్చే కుట్రను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఒబిసిలు, దళితులు, మైనారిటీలకు చట్టసభల్లో ప్రాతినిథ్యం కల్పించడం అధికార పక్షానికి ఇష్టం లేదని అందుకే కులగణనను పక్కన పెట్టేందుకు ఈ బిల్లుల ద్వారా కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజల ముందుకు తీసుకువెళ్లడానికి దేశవ్యాప్తంగా సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతి పక్షాలు ఓడించినందుకు నిరసనగా ఢిల్లీలోని కాం గ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నివాసం వద్ద నిరసన చేపట్టనున్నట్లు బిజెపి నేతలు తెలిపారు. అన్ని రాష్ట్రాలలోని కాంగ్రెస్ నేతల ఇళ్ల ముందు నిరసన చేపట్టాలని దేశవ్యాప్తంగా పార్టీ వర్గాలకు పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు రిజర్వేషన్లనకు మాత్రమే వ్యతిరేకం కాదని, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు స్థానాలు పెరగడం కూడా వాటికి ఇష్టం లేదని అన్నారు.



## 30 యేళ్లనాటి కేసులో వేర్పాటువాది అరెస్టు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** ముప్పయ్యేళ్ల నాటి కేసులో కాశ్మీరీ వేర్పాటువాది షబ్బీర్ అహ్మద్ షాను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని పటియాలా హౌస్ కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు అతనికి మూడు రోజుల ట్రాన్సిట్ రిమాండ్ విధించింది. రిమాండ్ ముగిసిన తర్వాత సోమవారం మధ్యాహ్నం 12 గంటల లోపు కశ్మీర్‌లోని ఎన్ఐఏ స్పెషల్ కోర్టు ముందు హాజరుపర్చాలని న్యాయమూర్తి ఎన్ఐఏ అధికారులను ఆదేశించారు. షబ్బీర్ అహ్మద్ షాపై 1996 జూలై 17న కేసు నమోదైంది. అయితే అప్పటి నుంచి నిందితుడు పోలీసులకు చిక్కుకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. దాంతో కేసు మరుగున పడిపోయింది. అయితే ఈ నెల 1న ఎన్ఐఏ అధికారులు కేసును తిరిగి తెరిచారు. ఆపై నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. 1996 జూలై 17న భద్రతా బలగాల ఎన్‌కౌంటర్‌లో హతమైన ఉగ్రవాది అంత్యక్రియలు జరిగాయి. ఈ అంత్యక్రియల సందర్భంగా కాశ్మీరీ వేర్పాటువాదులు హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. భద్రతాబలగాలపై కాల్పులు జరిపారు. బాంబులు విసిరి శాంతిభద్రతలకు విఘాతం కలిగించారు. పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. దాంతో షబ్బీర్‌తోపాటు పలువురిపై కేసులు నమోదయ్యాయి. మిగతావాళ్లు అరెస్టయినా షబ్బీర్ తప్పించుకుతిరుగుతున్నాడు. తాజాగా షబ్బీర్ కూడా దర్యాప్తు అధికారులకు చిక్కాడు.



## అపార్టుమెంట్ నుంచి నోట్లకట్టలు విసిరేసిన మహిళ

**బీజింగ్, ఏప్రిల్ 18:** చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో ఒక మహిళ తన అపార్ట్‌మెంట్ బాల్కనీ నుంచి పెద్ద మొత్తంలో నగదును కిందకు విసిరేసి సంచలనం సృష్టించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. శాంతూ నగరంలోని స్టార్ లేక్ సిటీ నివాస సముదాయంలో ఏప్రిల్ 14న ఉదయం ఈ సంఘటన జరిగింది. ఓ మహిళ తన అపార్ట్‌మెంట్ నుంచి హాంకాంగ్ కరెన్సీకి చెందిన 1,000 డాలర్ల నోట్ల కట్టలను గాలిలోకి విసిరేసింది. గాలిలో తేలుతూ వస్తున్న నోట్లను చూసిన స్థానికులు, బాటసారులు వాటిని ఏరుకోవడానికి పోటీ పడటంతో ఆ ప్రాంతంలో తీవ్ర గందరగోళం నెలకొంది. విసిరేసిన నగదు విలువ సుమారు 1 మిలియన్ నుంచి 2 మిలియన్ల హాంకాంగ్ డాలర్ల (భారత కరెన్సీలో కోట్లల్లోనే) వరకు ఉండొచ్చని ప్రత్యక్ష సాక్షులు అంచనా వేస్తున్నారు. కుటుంబ సభ్యుల అనారోగ్యం కారణంగా సదరు మహిళ తీవ్ర మానసిక వేదనకు గురైనట్లు ప్రాథమిక సమాచారం. భార్యాభర్తల మధ్య గొడవ కూడా ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని కొన్ని కథనాలు చెబుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఏరుకున్న డబ్బును తిరిగి ఇచ్చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చాలామంది నిజాయతీగా నగదును తిరిగిఅప్పగించారు. ప్రస్తుతం ఆ మహిళ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

### బొమ్మకార్లతో ఐఇడి పేలుళ్లకు కుట్రలు

## నలుగురు యువ టెర్రరిస్టులు అరెస్టు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటూ, పేలుళ్లకు కుట్ర పన్నిన నలుగురు వ్యక్తుల్ని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. బీహార్ మహారాష్ట్ర, ఒడిశాకు చెందిన నలుగురు వ్యక్తులు తీవ్రవాదచర్యలకు సిద్ధమవుతుండగా, అరెస్టు చేసినట్లు పోలీసులు శనివారం వెల్లడించారు. బొమ్మ కారుతో పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుల్ని మొసాయిబ్ అహ్మద్, మొహమ్మద్ అహ్మద్, మొహమ్మద్ సొహైల్, షేక్ ఇమ్రాన్‌లుగా గుర్తించారు. వీరంతా పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారు. నిందితుల్లో మొసాయిబ్ గల్ఫ్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేశాడు. రిమోట్ కంట్రోల్ కార్ తయారు చేసే స్కిల్స్ సంపాదించాడు. ఇలా తయారు చేసిన రిమోట్ కంట్రోల్ కార్ ద్వారా ఐఈడీ వంటి పదార్థాల్ని ఉపయోగించి పేలుళ్లకు పాల్పడాలని కుట్రపన్నారు. రద్దీ ప్రదేశాల్లో దాడి చేయాలని భావించి, రెక్కీ కూడా నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి ఇద్దరు, బీహార్, ఒడిశా నుంచి ఒక్కొక్కరు తీవ్రవాద భావజాలానికి ఆకర్షితుల య్యారు. లష్కర్ ఫ్రమ్ ఖురాసన్ అనే సిద్ధాంతం ఆధారంగా ఇతరుల్ని కూడా ఇలా తీవ్రవాద భావజాలంవైపు మళ్లించేందుకు ప్రయత్నించారు. జిహాద్‌కు అనుకూలంగా ఎన్‌క్రిప్టెడ్ సోషల్ మీడియా గ్రూపులను ఏర్పాటు చేసుకున్నారు. తమలాంటివారిని గుర్తించి, బృందంలో చేర్చుకునేందుకు ఈ సోషల్ మీడియా అకౌంట్లను వాడేవారు. కొన్ని ఆయుధాల గురించి చర్చించేవారు. గత ఏడాది డిసెంబర్‌లో ఢిల్లీ వెళ్లిన నిందితులు ఎర్రకోట, ఇండియా గేట్ వంటి కొన్ని ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. అలాగే, అయోధ్యలోని రామ మందిరాన్ని, పార్లమెంట్ హౌజ్ వంటి కీలక ప్రదేశాల్ని కూడా లక్ష్యంగా ఎంచుకున్నారు. ప్రజలు, రద్దీ ఎక్కువగా ఉండే ఇలాంటి ప్రదేశాల్లో పేలుళ్ల ద్వారా ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయాలనేది వారి లక్ష్యం. వీరి కుట్రను పోలీసులు భగ్నం చేశారు. నిందితుల దగ్గరి నుంచి ఐఈడీ పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.



# మంటల్లో పశ్చిమాసియా

## ఇస్లామాబాద్‌లో రేపు శాంతి చర్చలు

**టెహ్రాన్, ఏప్రిల్ 18:** అమెరికా, ఇరాన్ దౌత్యవేత్తల మధ్య సోమవారం ఇస్లామి బాద్‌లో చర్చలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఆదివారం పాకిస్థాన్ రాజధానికి దౌత్య వేత్తలు చేరుకుంటారని అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు అమెరికా, ఇరాన్ మధ్య తొలి దఫా చర్చలు జరిగిన విషయం తెలిసిందే. ఉద్రిక్తతలు తగ్గించే నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గల్ఫ్ దేశాల్లో పర్యటించారు. ఖతార్ షేక్ తమిమ్ బిన్ హమ్మద్, టర్కీ అధ్యక్షుడు రీసెప్ తయ్యిప్ ఎర్డగోన్‌ను కలిశారు. ఇక పాక్ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ ఇరాన్‌లో పర్యటించారు. ఆ దేశ విదేశాంగ మంత్రి అరగాచితో సంప్రదింపులు చేశారు. ఇరానీ పార్లమెంట్ స్పీకర్ భగేర్ ఘాలిబఫ్‌ను కూడా అసిమ్ మునీర్ కలిశారు. అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిర్చేందుకు.. పాక్ తమ వంతు ప్రయత్నం చేస్తున్నది.



## మరో నెల రోజులు రష్యా నుంచి చమురు

### ఆంక్షల నుంచి మినహాయింపు ఇచ్చిన అమెరికా




**వాషింగ్టన్, ఏప్రిల్ 18:** అంతర్జాతీయ మార్కెట్‌లో ఆకాశన్నంటుతున్న ఇంధన ధరలను అదుపు చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం అనూహ్య నిర్ణయం తీసుకుంది. రష్యా చమురు, పెట్రోలియం ఉత్పత్తుల విక్రయాలపై విధిస్తున్న ఆంక్షల నుంచి మరో నెల రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. రెండు రోజుల క్రితమే ఎలాంటి మినహాయింపులు ఇవ్వమని ప్రకటించి శుక్రవారం మినహాయింపు ఇస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ విభాగం తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నిజానికి రష్యా, ఇరాన్ చమురుపై ఎలాంటి మినహాయింపులు ఇచ్చే ప్రసక్తే లేదని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ కేవలం రెండు రోజుల క్రితమే కుండబద్దలు కొట్టారు. దీంతో భారత్‌పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ అకస్మాత్తుగా ఈ నిర్ణయాన్ని అమెరికా మార్చుకుంటూ మే 16వ తేదీ వరకు సడలింపును పొడిగించింది. తాజా నిబంధనల ప్రకారం.. శుక్రవారం నాటికి సముద్రంలో నౌకలపై లోడ్ అయిన రష్యా చమురును కొనుగోలు చేయడానికి మే 16వ తేదీ అర్ధరాత్రి వరకు అవకాశం ఉంటుంది. ఏప్రిల్ 11తో ముగిసిన పాత మినహాయింపు గడువును ఈ నిర్ణయం ద్వారా మరో నెల పాటు పొడిగించినట్టయింది.

**ఎందుకు ఈ నిర్ణయం?:** అమెరికా తీసుకున్న ఈ అనూహ్య నిర్ణయం వెనుక బలమైన రాజకీయ, ఆర్థిక కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల వల్ల ఇరాన్ హార్మూజ్ జలసంధిని మూసివేయగా.. దీని వల్ల అంతర్జాతీయంగా చమురు సరఫరా నిలిచిపోయి ధరలు భారీగా పెరిగాయి. అలాగే అమెరికాలో గ్యాసోలిన్ (పెట్రోల్) ధరలు విపరీతంగా పెరగడం ట్రంప్ ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. ఈ యేడాది జరగనున్న కీలకమైన మధ్యంతర ఎన్నికల దృష్ట్యా సామాన్య ఓటర్లపై భారం తగ్గించడం ట్రంప్‌నకు అత్యవసరం. అందుకే చమురు ధరలు తగ్గించడానికి ట్రంప్ సర్కారు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.

### కొండమలుపులో పడిపోయిన వాహనం

## ఏడుగురు టీచర్లు సహా 9 మంది మృతి



**చెన్నై, ఏప్రిల్ 18:** ఒక టూరిస్ట్ వాహనం కొండ మలుపులో అదుపుతప్పి కిందకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ఉపాధ్యాయులతో సహా 9 మంది మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు. దీంతో ఆ ప్రభుత్వ స్కూల్‌లో విషాదం నెలకొన్నది. తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కేరళలోని మలప్పురం జిల్లా పాంగ్‌పల్లిపరంబ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, సిబ్బందితో కూడిన 13 మంది పర్యటన కోసం తమిళనాడు వెళ్లారు. శుక్రవారం ట్రావెల్ టెంపో వాహనంలో వాల్పరై హిల్ స్టేషన్‌ను సందర్శించారు. వాల్పరైలో పర్యటన ముగించుకుని కొండ నుంచి కిందకు దిగుతుండగా ఆ వాహనం ప్రమాదానికి గురైంది. 13వ హెయిర్‌పిన్ మలుపు వద్ద అది అదుపు తప్పి కిందకు దూసుకెళ్లింది. 9వ హెయిర్‌పిన్ మలుపులోని రోడ్డుపై బోల్తాపడింది. ఆ వాహనంలో ఉన్న 13 మందిలో ఒక బాలిక, ఏడుగురు మహిళలు, ఒక పురుషుడితో సహా 9 మంది ఈ ప్రమాదంలో మరణించారు. మృతుల్లో ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. మరోవైపు ట్రావెల్ వాహనం డ్రైవర్, మరో ముగ్గురు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. వీరిలో ఇద్దరిని కోయంబత్తూరు వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ప్రధాని మోడీ, కేరళ సీఎం విజయన్ తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. టీచర్లు, సిబ్బంది మరణించడంతో కేరళలోని పాంగ్‌పల్లి పరంబ ప్రభుత్వ స్కూల్‌లో విషాదం అలుముకుంది.

## రోడ్డుప్రమాదంలో వశీకరణబాబా స్నేహితుడి కుటుంబం దుర్మరణం



**ముంబై, ఏప్రిల్ 18:** జ్యోతిష్యం, వశీకరణ పేరుతో పలువురు మహిళలపై అత్యాచారానికి పాల్పడి అరెస్టైన అశోక్ ఖరత్ సన్నిహితుడు, అతడి భార్య రోడ్డు ప్రమాదంలో మరణించారు. వారు ప్రయాణించిన కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్ లారీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో భార్యాభర్తలు మరణించగా వారి కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. మహారాష్ట్రలోని అహిల్యానగర్ జిల్లాలో ఈ ప్రమాదం జరిగింది. తనకు తాను దేవుడిగా చెప్పుకున్న నాసిక్‌కు చెందిన అశోక్ ఖరత్ జ్యోతిష్కుడిగా ప్రసిద్ధి చెందాడు. తన వద్దకు వచ్చే పలువురు మహిళలను లొంగదీసుకుని అత్యాచారానికి పాల్పడ్డాడు. ఒక బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. అశోక్ ఖరత్ కీలక అనుచరుడైన 55 ఏళ్ల జితేంద్ర షెల్కే అతడి వ్యాపార భాగస్వామి. ఆయనకు చెందిన శివానికా ట్రస్ట్ ఉపాధ్యక్షుడిగాను వ్యవహరిస్తున్నాడు. జితేంద్ర షెల్కే, తన భార్య అయిన 50 ఏళ్ల అనురాధ, కుమారుడితో కలిసి శుక్రవారం రాత్రి ఛత్రపతి సంభాజీనగర్ నుంచి థానేకు కారులో ప్రయాణమయ్యాడు. ముంబై నాగ్‌పూర్ సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌హైవేలోని ధోత్రేవద్ద కారు నడుపుతున్న జితేంద్ర పట్టుతప్పి రోడ్డు పక్కన ఆగిఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జితేంద్ర, ఆయన భార్య అనురాధ అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన వారి కుమారుడ్ని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోపర్‌గావ్ పోలీసులు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళల సాధికారత దేశ అభివృద్ధికి పునాది : ఎమ్మెల్యే గల్లా మాధవి

**వట్టిచెరుకూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** మహిళల సాధికారత దేశ అభివృద్ధికి పునాదని గుంటూరు పశ్చిమ శాసనసభ్యురాలు గల్లా మాధవి పేర్కొన్నారు. మండలంలోని పుల్లడిగుంట గ్రామ పరిధిలో ఉన్న మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం విజయోత్సవం–2026 పేరుతో 202526 విద్యా సంవత్సరంలో వివిధ ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు పొందిన ఆఖరి సంవత్సరం విద్యార్థినులను,



వారి తల్లిదండ్రులతో కలిసి ఘనంగా సత్కరించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గల్లా మాధవి హాజరై మాట్లాడుతూ..ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను మరియు వారి తల్లిదండ్రులను అభినందించారు. మలినేని విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మరియు కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులను తమ సొంత పిల్లలలా చూసుకుంటూ, వారికి సమగ్ర శిక్షణ అందిస్తూ ఉన్నారని ప్రశంసించారు. మహిళలు ఉద్యోగాల్లో చేరడం ద్వారా కుటుంబం మాత్రమే కాకుండా సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైనరోషిణి ఎంజె హాజరై మాట్లాడుతూ విద్యార్థులు టెక్నికల్ నాలెడ్జ్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ ఎబిలిటీ మరియు అడాప్టబిలిటీ వంటి నైపుణ్యాలను పెంపొందించు కోవడం ఎంతో ముఖ్యమని సూచించారు. ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా నిరంతరం నేర్చుకుంటూ ఉండటం ద్వారా కెరీర్‌లో వేగంగా పైకెదగొ చ్చని తెలిపారు. ఈ తరహా శిక్షణను అందిస్తున్న మలినేని విద్యా సంస్థలను అభినందించారు.కళాశాల ఛైర్మన్ డా.మలినేని మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి కోసం మొదటి సంవత్సరం నుంచే ప్రణాళికాబద్ధమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఫౌండేషన్ స్కిల్స్, కమ్యూనికేషన్, టెక్నికల్ ట్రైనింగ్, హ్యాండ్స్ ఆన్ లెర్నింగ్, హ్యాకథాన్లు, వర్క్‌షాపులు ద్వారా పరిశ్రమలకు తగిన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా క్రమశిక్షణ, నైతిక విలువలు, నిరంతర అభ్యాసం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల విజయాలు కళాశాలకు గర్వకారణమని, అధ్యాపకుల కృషి మరియు తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డా.కె.శ్వేత వార్షిక ప్లేస్‌మెంట్ నివేదికను సమర్పిస్తూ గత విద్యా సంవత్సరం నుంచి గ్లోబల్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు ప్రారంభించినట్లు చెప్పారు. రెండవ సంవత్సరం నుంచే అప్టిట్యూడ్, వర్బల్, రీజనింగ్ మరియు టెక్నికల్ ట్రైనింగ్‌ను విభిన్న మార్గాల్లో అందించామని వివరించారు. ఇప్పటివరకు 650కి పైగా ప్లేస్‌మెంట్ ఆఫర్లు లభించాయని, ఈ సంఖ్య ఇంకా పెరుగుతోందన్నారు. ప్రముఖ సంస్థలు ఆక్సెంచర్, టీసీఎస్, ఇన్ఫోసిస్, కాగ్నిజాన్ట్, డబల్యు3 గ్లోబల్ , ఎంఫాసిస్ వంటి కంపెనీలు కళాశాలను సందర్శించి విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధి సాధించిన విద్యార్థినిలను, వారి తల్లిదండ్రులను శాలువాలు, ధ్రువపత్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా.జె.అప్పారావు, వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు కృషి చేయాలి

**గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** నీటి సంరక్షణకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నగర కమిషనర్ కే. మయూర్ అశోక్ అన్నారు.ప్రాణకోటికి జీవనాధారమైన నీటిని ప్రజలు వృధా చేయకుండా బాధ్యత వహించాలని అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.శనివారం స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్రలో "జలధార జలహారతి" థీమ్‌లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కొరిటెపాడు చెరువు వాకింగ్ ట్రాక్ లో అవగాహన ర్యాలీ, నీటి సంరక్షణ చర్యలు పరిశీలన, మొక్కలు నాటి, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి నెల 3 వ శనివారం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛత ప్రాధాన్యతగా స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర చేపడుతుందన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే ఈ కార్యక్రమాలలో పాల్గొనడడం ద్వారా స్వచ్ఛతకు ఉన్న ప్రాధాన్యతను తెలియచేస్తున్నారన్నారు. పెరుగుతున్న జనాభా, పారిశ్రామిక అవసరాలు, మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల ఎదురవుతున్న నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని 100 రోజుల ప్రత్యేక కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించినట్లు తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా నగర పరిధిలోని అన్ని చెరువులు, కాలువలు, నీటి వనరులను పునరుద్ధరించడమే కాకుండా, వాటిపై ఉన్న ఆక్రమణలను తొలగించి భవిష్యత్ అవసరాల కోసం రక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా ఈ 100 రోజుల కాలంలో ఖిఅమృత్‌ఖి పథకం, జీఎంసి సాధారణ నిధులతో



చెరువుల ఇన్లెట్స్, ఛానల్స్ క్లీనింగ్ వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని తెలిపారు. ప్రతి వార్డులో ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇళ్లలో నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భాగస్వామ్యం, సహకారంతో నగరాన్ని నీటి కొరత లేని స్వచ్ఛమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, కొరిటెపాడు చెరువు వాకింగ్ ట్రాక్ ప్రెసిడెంట్ కన్నసాని బాజీ, సెక్రెటరీ బి.శివరామకృష్ణారెడ్డి, కమిటి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక కార్యక్రమాలకు బడ్జెట్లో నిధులు కేటాయించాలి

## మండలి బుద్ధప్రసాద్

**పెదనందిపాడు ఏప్రిల్ 18 (ప్రభాతవార్త) :** పెదనందిపాడు మండలం వరగాని లో ఈ నెల 16వ తారీకు నుండి 20 వ తారీకు వరకు ఐదు రోజులపాటు జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక మరియు సంస్కృతి సమితి వారి సౌజన్యంతో,లావు వెంకటేశ్వర్లు కల్లూరి నాగేశ్వరరావు కళా పరిషత్ తెలుగు రాష్ట్రాల పదవ ఆహ్వాన నాటక పోటీలు సందర్భంగా శత



జయంతి మహనీయుడు కీర్తిశేషులు మండలి వెంకటకృష్ణారావు కళా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పురస్కా ర ప్రధానోత్సవ కార్యక్రమానికి అజో విభో కందళం ఫౌండేషన్ అధ్యక్షులు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాటక రచయిత, దర్శకుడు, నటుడు, ఎన్టీఆర్ రంగస్థలం పురస్కార గ్రహీత కె.ఎస్.టి సాయి కు పోపూరి వీరయ్య చౌదరి స్మారక పురస్కారం ను మాజీ స్పీకర్, శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా అందించారు . అనంతరం వారు మాట్లాడుతూ చరిత్రలో చూసుకుంటే కళలను, కళాకారులను అమితంగా ప్రోత్సహించిన రాజులు చరిత్రలో నిలిచిపోయారన్నారు. రాజరాజ నరేంద్రుడు, శ్రీకృష్ణదేవరాయలు, అక్బర్ వంటి చక్రవర్తులు కళలను పోషించిన విధానం కళాకారులకు స్వర్ణ యుగంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం తెలుగు భాషాభివృద్ధికి సముచిత రీతిలో బడ్జెట్ కేటాయించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కళాకారులను అమితంగా గౌరవిస్తారని, వృద్ధ కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించి ఆసరాగా నిలబడ్డారని చెప్పారు. చంద్రబాబు నాయుడు కళాకారు లను గౌరవించి ఆ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సభను ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్, కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ, వేదిక అధ్యక్షులు ముత్తవరపు సురేష్ బాబు, రంగస్థలం పరిశోధకుడు మన్నే శ్రీనివాసరావు, కొండవీటి కళాపరిషత్ వ్యవస్థాపకులు కె శ్రీహరి, సినీ నటుడు నాయుడు గోపి, కళా పరిషత్ గౌరవ అధ్యక్షులు ముద్దన రాఘవయ్య, అధ్యక్షులు పోపూరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చెరుకూరి సాంబశివరావు లు ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతంలో పరిషత్ ను ఏర్పాటు చేసి పది సంవత్సరాలుగా నాటక పోటీలను నిర్వహించడం సామాన్యమైన విషయం కాదని పరిషత్ అధ్యక్షుడు పోపూరి నాగేశ్వరరావు వక్తలు అభినందించారు.ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యులు బండారు రాంబాబు, చెన్నుపాటి సురేంద్ర, పోపూరి సుధీర్, చల్లా నాగరాజు, జరుగుల రామారావు, కొల్లా శ్రీనివాసరావు, కొర్రపాటి రామారావు, పోపూరి శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హజ్ యాత్ర సంతోషంగా సాగాలి

### -రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో హజీలకు అన్ని సౌకర్యాలు -హజీలకు గొడుగులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, ఏప్రిల్ 18,ప్రభాతవార్త :** హజ్ యాత్రికుల ప్రయాణం ఆరోగ్యకంగా, సంతోషదాయకంగా సాగాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. శనివారం విజయవాడలోని గన్నవరం విమానాశ్రయం నుంచి హజీలు



బయలుదేరుతున్న సందర్భంగా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎండీ ఫరూక్, మంత్రి కొల్లు రవీంద్ర, హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్, ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీధర్, ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్ అహ్మద్, హజ్ కమిటీ డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే వారికి భోజన వసతి వంటి అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. హజీలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున కూటమి ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. గతంలో హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు వెళ్లేవారని, ఈ ఏడాది గన్నవరం నుంచి వెళ్లేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఒక్కొక్క హజీకి లక్ష రూపాయలు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

**గొడుగులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నసీర్..**

సౌదీలో ఎండలు ఎక్కువగా ఉన్నందుకు హజీలకు ఉపయోగకరంగా ఉంటాయనే ఉద్దేశంతో గొడుగులు అందించినట్లు ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింల సంక్షేమానికి పెద్దపేట వేసిందని తెలిపారు. హజీలు బయలుదేరినప్పటి నుంచి వారి ప్రయాణ భద్రత సౌకర్యాల విషయంలో ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. మోజన్లు, ఇమామ్ ల గౌరవ వేతనం గత ప్రభుత్వం పెండింగ్ పెడితే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విడుదల చేసినట్లు చెప్పారు. అమరావతిలో హౌస్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ముస్లింల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు.

# అంతర్ పంటలు ఆర్థిక భరోసా

**పెదనందిపాడు ఏప్రిల్ 17 (ప్రభాతవార్త)** రైతులకు సుస్థిర వ్యవసాయ పద్ధతులను చేరవేసే లక్ష్యంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రజా బాగ్యస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసి ఎన్ఎఫ్) ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్ 2026 సన్నద్ధత శిక్షణ రెండు రోజులపాటు జరగనున్న కార్యక్రమాన్ని పెదనందిపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో శనివారం మండల వ్యవసాయ అధికారి



ఐ.సుబ్రహ్మణ్యం ప్రారంభించినారు.ఈ శిక్షణ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హాజరైనారు, ఏపీ సీఎం ఎఫ్ రిసోర్స్ పర్సన్ ఉమాదేవి (పీ ఎం డి ఎస్) మరియు నవధాన్యాల పంటల ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ విధానాల ద్వారా భూమి పచ్చదనంతో నిండిపోవడంతో పాటు నేలలో జీవ పదార్థం పెరిగి సూ జీవుల అభివృద్ధి మెరుగు పడుతుందని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం రైతులకు దీర్ఘకాలిక లాభాలను అందిస్తుందని తెలియజేశారు, పిఎండిఎస్ మరియు ఏటీఎం మోడల్ పై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించామని అదేవిధంగా వర్షాభావ పరిస్థితిలను ఎదుర్కునేందుకు అంతర పంటలు కీలకమని, ప్రదాన పంటలు విఫలమైన రైతులుకు అంతర పంటలు ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం ఏఎన్‌యు విద్యార్థి పరుగు

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఏప్రిల్18, ప్రభాతవార్త:** ఏఎన్‌యులో క్రీడా విభాగం ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న పల్లపర్తి అనిల్‌కుమార్ విశేష సాహసానికి శ్రీకారం చుట్టారు. తెలుగు బుక్ ఆఫ్‌రికార్డ్స్ కోసం ఏఎన్‌యు



నుంచి గన్నవరం వరకు తిరిగి గన్నవరం నుంచి ఏఎన్‌యు వరకు 120 కి.మీ పరుగును శనివారం ప్రారంభించారు. అనిల్‌కుమార్ రికార్డు సాధించాలని సంకల్పిస్తూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ జి.సింహాచలం, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ పాల్‌కుమార్‌లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంలో కోచ్ కె.కృష్ణమోహన్, డా. సూర్యనారాయణ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 3వరోజు కనుల విందుగా వరగాని కళాపరిషత్ నాటక పోటీలు

**పెదనందిపాడు ఏప్రిల్ 18 (ప్రభాతవార్త) :** పెదనందిపాడు మండలం వరగాని గ్రామంలో ఈ నెల 16వ తారీకు నుండి 20 వ తారీకు వరకు ఐదు రోజులపాటు జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక మరియు సంస్కృతి సమితి వారి సౌజన్యంతో,లావు వెంకటేశ్వర్లు కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ తెలుగు రాష్ట్రాల పదవ ఆహ్వాన నాటిక పోటీలలో భాగంగా శనివారం మూడవరోజు మొదటగా గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి "అమ్మ చెక్కిన బొమ్మ" నాటిక ప్రదర్శించారు. సృష్టిలో ఉత్తమమైనది మానవ జన్మ, మానవ జన్మలో స్త్రీ లేదా పురుషుల గురించి మనం మాట్లాడుకుంటూ ఉంటాం. స్త్రీ పురుషులే కాకుండా మానవజాతిలో దాదాపు 20 రకాల శరీర తత్వాలు కలిగిన మనుషులు ఉంటారని ఈ నాటకంలో తెలియజేశారు. తమ కొడుకు చిన్నప్పుడు నుంచి ఆడ లక్షణాలతో పెరగడంతో, తండ్రి నిరాదరించడం జరుగుతుంది. కానీ తల్లి



ఆమె ఇష్ట ప్రకారం కష్టపడి పెంచి ఆమెను ఐఏఎస్ అధికారిగా తీర్చిదిద్దుతుంది. అమ్మ చెక్కిన బొమ్మ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ద్వితీయ నాటికగా హర్ష క్రియేషన్స్ విజయవాడ వారి "చెరిగిపోని చిరునామా" నాటకం ప్రదర్శించారు. తృతీయ నాటికగా మలిరెడ్డి బాబి మెమోరియల్ ఆర్ట్స్, భోగాపురం వారి "ఇదేనా ధర్మం, ఇదే నా ధర్మం" నాటికను ప్రదర్శించారు. ఈ నాటికలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పాల్ హరీస్ పురస్కార ప్రధాన ఉత్సవం జరిగింది.ఈ పురస్కారం రోటరీ గవర్నర్



డాక్టర్ ఎస్వీ రాంప్రసాద్ చేతుల మీదుగా, ఝాన్సీ ప్రేమానంద్ కు అందజేశారు. పురస్కార సభలో రోటరీ సభ్యులు మధ్య అన్నే శివకుమారి, అన్నే రత్న ప్రభాకర్, కేఎస్ఆర్కే ప్రసాద్, పోలిశెట్టి వీరరాఘవయ్య, చిన్నం శ్రీనివాసరావులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కళా పరిషత్ గౌరవ అధ్యక్షులు ముద్దన రాఘవయ్య, అధ్యక్షులు పోపూరి నాగేశ్వరరావు,ప్రధాన కార్యదర్శి చెరుకూరి సాంబశివరావు, సభ్యులు బండారు రాంబాబు, చెన్నుపాటి సురేంద్ర, పోపూరి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# జిఎంసి అదనపు కమిషనర్‌గా చల్లా ఓబులేసు సేవలు అభినందనీయం

## నగర కమిషనర్ కే మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 18,(ప్రభాతవార్త) :** గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఓబులేసు సేవలు అభినందనీయమని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల



16న జారీ చేసిన మునిసిపల్ బదిలీల ఉత్తర్వులలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న చల్లా ఓబులేసు ను కర్నూల్ నగర పాలక సంస్థ కమిషనర్ బదిలీ చేస్తూ ఉత్తర్వులు చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా శనివారం గుంటూరు నగర పాలక సంస్థలో కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ అశోక్ అదనపు కమిషనర్ ఓబులేసు ను శాలువాతో సన్మానించి వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత సంవత్సరంన్నరగా అదనపు కమిషనర్ విధులు నిర్వహిస్తున్నారని, బాధ్యతలు తీసుకున్ననాటి నుండి అంకిత భావంతో కేటాయించిన విధులను విజయవంతంగా నిర్వహించారన్నారు. నేను కమిషనర్ గా విధులలో చేరినప్పటినుండి కేటాయించిన ఎన్నికలు, జనాభా లెక్కలు, ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమాలు వంటి అదనపు విధులను కూడా సమిష్టి కృషితో దిగ్విజయంగా నిర్వహించారని, ఆయన సహకారం మరువలేనిదని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సి.హెచ్ శ్రీనివాస్, బి. శ్రీనివాసరావు, సాంబశివరావు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అంబటి దొంగ దీక్షలు మానుకోవాలి : గుంటూరు పశ్చిమ మాజీ కార్పొరేటర్ల ధ్వజం

**గుంటూరు, ఏప్రిల్ 18,ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి పై వైసీపీ ఇంచార్జ్ అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు తీవ్రంగా ఖండించారు. శనివారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల



సమావేశంలో మాజీ కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, ఈరంటి వర ప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, శ్రీవల్లి, మానం పద్మ శ్రీ మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గళ్ళా మాధవి ఒక చదువుకున్న బీసీ మహిళగా ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ఎప్పుడైనా ఫోన్ కాల్ వచ్చిన వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని, గంజాయి సమస్యలు, మహిళల భద్రత వంటి అంశాల్లో స్వయంగా ముందుండి పని చేస్తున్న ఎమ్మెల్యే పనితీరును నియోజకవర్గ ప్రజలు మెచ్చుకుంటున్నారని చెప్పారు.పార్టీలో సీనియారిటీ, జూనియారిటీ కంటే పనితీరు ముఖ్యమని, అదే ప్రామాణికంగా తీసుకుని గళ్ళా మాధవిని పొలిట్ బ్యూరోలోకి తీసుకున్నారని వివరించారు. చిన్న స్థాయి నుంచి ఎదిగి ఎమ్మెల్యేగా ఎన్నికైన గళ్ళా మాధవి ఎలాంటి అక్రమాలు, చందాలు, దుర్వినియోగాలకు పాల్ప డలేదని స్పష్టం చేశారు. అంబటి రాంబాబు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని, దాడి ఘటనల్లో గళ్ళా మాధవి పాత్ర ఎక్కడా లేదని తెలిపారు. చట్ట ప్రకారం కేసులు నమోదు అయ్యాయని, నోటీసులు ఇచ్చారని చెప్పారు. రాంబాబు ప్రవర్తనను సమాజం ఇప్పటికే తిరస్కరించిందని, కోర్టు కూడా మందలించిన విషయాన్ని గుర్తుచేశారు.అంబటి రాంబాబు ప్రకటించిన నిరాహార దీక్షను "దొంగ దీక్ష"గా అభివర్ణిస్తూ, ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. కేసుల విషయంలో ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించలేదని, కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బెయిలబుల్ సెక్షన్లలో కేసు పెట్టినా, కోర్టు స్వతంత్రంగా రిమాండ్ విధించిందని పేర్కొన్నారు. రాంబాబు తనను లాయర్‌గా చెప్పుకుంటూ న్యాయవ్యవస్థపై వ్యాఖ్యలు చేయడం సరికాదని, అతనిపై పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, పోలీసులను అడ్డుకోవడం వంటి ఆరోపణలు కూడా ఉన్నాయని వివరించారు. అలాంటి వ్యక్తికి కోర్టు బెయిల్ ఇవ్వకపోవడం సహజమని అన్నారు.గతంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దాడులు, అల్లర్లపై చర్యలు తీసుకోలేదని, తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత మాత్రమే నిందితులను గుర్తించి అరెస్టులు జరిగాయని తెలిపారు. మహిళలను అవమానించేలా లేదా కులం పేరుతో ఎలాంటి దూషణలు జరగలేదని స్పష్టం చేశారు.గళ్ళా మాధవి ధైర్యంగా, నిబద్ధతతో ప్రజాసేవ చేస్తున్నారని, ఆమె సేవలను రాష్ట్రవ్యాప్తంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతోనే పార్టీ పెద్దలు ఆమెను పొలిట్ బ్యూరోలోకి తీసుకున్నారని పేర్కొన్నారు. వివిధ వయసులు, వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు.ఇంకా మూడేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని, ఆ తరువాత గుంటూరులో వైసీపీకి స్థానం ఉండదని వ్యాఖ్యానించారు. అంబటి రాంబాబు ఇకనైనా అవాస్తవ ఆరోపణలు, దొంగ దీక్షలు మానుకొని ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

# ఆస్తి పన్ను చెల్లింపుకు అందుబాటులో నేడు క్యాష్ కౌంటర్లు : నగర కమిషనర్ కే మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 18, ( ప్రభాతవార్త ) :** అనధికార లేఅవుట్‌లలో ప్లాట్లు కలిగిన వారు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (లిళిళీ) ను వినియోగించుకోవాలని గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ కోరారు.ఎల్ఆర్ఎస్ (లిళిళీ) క్రమబద్ధీకరణకు ఈ నెల 23వ తేదీ తో గడువు ముగిసి పోతుందని వెల్లడించారు.గతంలో ప్రభుత్వం ఇచ్చిన మూడు నెలల గడువు ఇచ్చిందని ఈనెల 23 తో ముగుస్తుందన్నారు క్రమబద్ధీకరించుకోకపోతే భవన నిర్మాణ అనుమతులు ఎలాంటి అనుమతులు మంజూరు చేయబడవని స్పష్టం చేశారు. రెగ్యులర్ చేసుకొని వారికి మౌలిక సదుపాయాలు సదరు లేఅవుట్‌లలో రోడ్లు, డ్రైనేజీ వంటి ప్రభుత్వ మౌలిక సదుపాయాలు కల్పించబడవని తెలిపారు. ప్లాట్ల అమ్మకం, కొనుగోలు సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని గుర్తుంచుకోవాలని వెల్లడించారు.గడువు ముగిసిన తర్వాత అనధికార లేఅవుట్‌లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.



# ఏకపక్ష విధానాలకు వ్యతిరేకంగా యుఎఫ్‌బిఓ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు

గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 18,ప్రభాతవార్త : డిఎఫ్ఎస్ మరియు ఐబిఏ అనుసరిస్తున్న ఏకపక్ష విధానాలకు వ్యతిరేకంగా శనివారం యుఎఫ్‌బియు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా బ్యాంకు అధికారులు మరియు ఉద్యోగులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.ఈ నిరసనల్లో వారానికి 5రోజుల పని విధానం అమలుచేయాలని,అన్ని స్థాయిల్లో ఖాళీలను భర్తీ చేయాలని ప్రధాన డిమాండ్లను ఉంచారు.దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి పెద్దఎత్తున ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.గతంలో ఐబిఏ మరియు యూనియన్లు ఒప్పందం చేసుకున్న విధానాలను విస్మరించి,డిఎఫ్ఎస్ ఏకపక్షంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్న పిఎల్ఐ (పెర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటీవ్) విధానాలను తీవ్రంగా ఖండిస్తూ ఈ నిరసలు కొనసాగాయి.స్థానిక జెకెసి రోడ్డులోని కెనరా బ్యాంక్ రీజనల్ ఆఫీస్ ముందు నిర్వహించిన ప్రదర్శనలో స్థానిక యుఎఫ్‌బియు నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

# సజావుగా సాంస్కృతిక పోటీలు

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఏప్రిల్18, ప్రభాతవార్త: ఏఎన్‌యులో ఈనెల 29న జరుగనున్న నాలుగు కళాశాలల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సాంస్కృతిక పోటీల ఇన్‌చార్జ్ ఆచార్య పి.బ్రహ్మజీరావు శుక్రవారం ప్రారంభించారు. సంగీతం, స్కిట్, రంగోలీ, పోస్టర్ మేకింగ్, డిబేట్, వ్యాసరచన, వకృత్వం వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల నిర్వహణ కమిటీ సభ్యులుగా ఆచార్య కె.వి.శాంత్రిశ్రీ, డా. వసంతరావు తదితరులు పర్యవేక్షించారు.



# జువాలజీ విభాగంతో ఎంఓయు

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఏప్రిల్18, ప్రభాతవార్త: ఏఎన్‌యులోని జువాలజీ అండ్ ఆక్వాకల్చర్ విభాగం సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్ ప్రవేట్ లిమిటెడ్ ఎంఓయు కుదుర్చుకుంది. శనివారం ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ సమక్షంలో ఆ సంస్థ స్ట్రాటజీ అండ్ ఇన్నోవేషన్ డైరెక్టర్ రాజారాం, జువాలజీ అండ్ ఆక్వాకల్చర్ విభాగం హెచ్ఓడి ఆచార్య వి.వెంకటరత్నమ్మలు ఎంఓయు పత్రాలు మార్చుకున్నారు. ఈ ఎంఓయు ద్వారా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, ఇంటర్న్‌షిప్స్, ఇండస్ట్రీ ట్రైనింగ్ వంటి అంశాలతో పాటు ఎంప్లాయిబులిటీ స్కిల్స్, అప్లయిడ్ రీసెర్చ్‌కు కూడా అవకాశం ఉందని ఆచార్య వెంకటరత్నమ్మ తెలిపారు. ఈ సందర్భంలో ఆచార్య పద్మావతి, ఆచార్య బ్రహ్మజీరావు తదితరులు పాల్గొన్నారు.



# అంబటి దీక్షకు తుమ్మల వెంకటేశ్వరరావు తదితరులు సంఘీభావం

**సత్తెనపల్లి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** గుంటూరు లో మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు చేస్తున్న నిరసన దీక్షలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర మేదర విభాగం



అధ్యక్షుడు తుమ్మల వెంకటేశ్వరరావు పాల్గొని అంబటికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి పట్టణ బిసి నాయకులు గడ్డం బుల్లోడు, సెగ్గం ఆంజనేయలు, అడ్వకేట్ కొండలు , తదితరులు పాల్గొన్నారు .

# నారా లోకేష్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీకి అద్భుత భవిష్యత్తు

**నరసరావుపేట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** యువ నాయకుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీకి అద్భుత భవిష్యత్తు ఉందని పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి నాగోతు శౌరయ్య అన్నారు.



స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఆయన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు క్రమశిక్షణ, పట్టుదల, దూరదృష్టి ఉన్న యువ నాయకత్వం నారా లోకేష్ రూపంలో పార్టీకి ఉండటం వరమని తెలిపారు. పార్టీతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు బయలు జరిగే నిర్ణయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న యువ నేత నారా లోకేష్ కు పార్టీలో సముచిత స్థానం, గౌరవం లభించాయన్నారు. రాష్ట్రంలో గడిచిన రెండేళ్ల కాలంలో అన్ని రంగాలలోనూ తనదైన ముద్రను లోకేష్ వేశారని తెలిపారు. రాజధాని అమరావతి తోపాటు అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ను కేరాఫ్ అడ్రస్ గా యువనేత నారా లోకేష్ చేసి చూపెడుతున్నారని ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి నాగోతు సౌరయ్య అన్నారు.

# అనారోగ్యంతో మరణించిన హోంగార్డు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత

**నరసరావుపేట క్రైమ్, ఏప్రిల్ 18 ప్రభాత వార్త :** మరణించిన హోంగార్డు కుటుంబాలకు ఒక్కరోజు వేతనం అందించిన పల్నాడు జిల్లా హోంగార్డులను అదనపు



ఎస్పీ జె వి సంతోష్ అభినందించారు. మృతుల కుటుంబాలకు హోంగార్డు లు అందరూ వారి ఒక రోజు వేతనం మొత్తం రూ. 5,00,000/ ఒక్కొక్కరికి సాయం చేసారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో రూ. 5,00,000/ చెక్కును తీ. విజయ్ కుమార్ భార్య జ్యోతి కి జిల్లా అదనపు ఎస్పి చేతుల మీదుగా అందచేశారు. భర్త మరణానంతరం ప్రస్తుతం వీరు సత్తెనపల్లి టౌన్ పిఎస్ నందు హోంగార్డు గా విధులు నిర్వర్తించుచున్నారు. అదేవిధంగా విజయ్ శోభన్ భార్య శ్రీలేఖ కి అదనపు ఎస్పి (అడ్మిన్) సంతోష్ చేతుల మీదుగా 5,00,000/ రూపాయలు చెక్కు ఇవ్వడం జరిగింది. సాటి హోంగార్డ్ లకు సాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన పల్నాడు జిల్లా హోమ్ గార్డులను అదనపు ఎస్పి జెవి సంతోష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ అదనపు ఎస్పీ తో పాటు హోంగార్డు ఆర్.ఐ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

# బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు గ్రహీత డా.వైవి నారాయణ కు సత్కారం

**నరసరావుపేట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ను కళాశాల అధ్యాపకులు,సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఇటీవల ఆయనకు ఇంజనీరింగ్ కళాశాలల నిర్వహణకు సంబంధించి నిర్వహించిన సర్వేలో బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు లభించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని డాక్టర్ వైవి నారాయణ కు



శాలువాలు, మెమొంటో, పూలమాలతో సత్కరించారు. వ్యవస్థాపక ప్రిన్సిపాల్ గా దశాబ్దాలుగా ఇంజనీరింగ్ విద్యను అత్యుత్తమంగా బోధించి వారు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థితో పాటు వారి కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని చదువుతోపాటు అత్యుత్తమ క్రమశిక్షణ అందించడంలో ప్రిన్సిపాల్ గా డాక్టర్ వైవి నారాయణ చేసిన కృషిని ప్రత్యేకంగా వారు గుర్తు చేశారు. సన్మాన గ్రహీత డాక్టర్ వై.వి నారాయణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును, వారి తల్లిదండ్రుల ఆకాంక్షలను పరిగణలోకి తీసుకొని కళాశాలలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి కచ్చితంగా ఉద్యోగంతో పాటు జీవితంలోనూ ఉన్నతంగా నడిచే పరిస్థితిని తమ కళాశాల కల్పిస్తుందన్నారు. తిరుమల కళాశాల నుండి బయటకు వెళ్లే విద్యార్థి భవిష్యత్తు ఉన్నతంగా నడిపేందుకు తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. వేలాదిమంది విద్యార్థులకు క్వాలిటీ ఇంజనీరింగ్ విద్యను అందించేందుకు సహకరిస్తున్న యాజమాన్యానికి అధ్యాపకులకు ఈ సందర్భంగా డాక్టర్ వైవి నారాయణ అభినందనలు,కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాజుపాలెంలో శ్రీ అంకమ్మతల్లి ఆలయ జీర్ణోద్ధరణ, బాల ఆలయ వాయు ప్రతిష్ఠాపన ఉత్సవం

**రాజుపాలెం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అంకమ్మతల్లి అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ, ఆలయ వాయు ప్రతిష్ట మహోత్సవం భాగంగా ఆదివారం ఈనెల19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అమ్మవారికి ఆచార వంతులు, అమ్మవారి భక్తులచే సప్తనదుల జలాలచే జలబిందెల, సహస్ర కలశాభిషేకం, హారతి, మంత్రి పుష్పం అనంతరం తీర్థప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. కాగా ఈనెల 20వ తేదీన సోమవారం సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహరణ, 21న మంగళవారం సాయంత్రం గణపతిపూజ, పుణ్యాహవాచన, అగ్ని ప్రతిష్ఠాపన, మండపారాధన, దేవత హోమాలు, హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాదాల వినియోగం ఉంటుందని తెలిపారు. 22న బుధవారం ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకం, కలాన్యాసం, ఉదయం 9 గంటల నుంచి అమ్మవారి విగ్రహ జీర్ణోద్ధరణ, అనంతరం వాయు ప్రతిష్ఠ హారతి, ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈమేరకు ఆలయ ప్రధాన అర్చకులు, స్మార్త అధ్యాపకులు అరవపల్లి ఫణి కేశవశర్మ ఆధ్వర్యంలో జరుగుతాయని శ్రీ అంకమ్మతల్లి అమ్మవారి దేవస్థానం కమిటీ, రాజుపాలెం గ్రామ పెద్దలు, గ్రామస్థుల సహాయ సహకారాలతో జరుగుతాయని తెలిపారు.

# కొండమోడులో ఆరోగ్య శిబిరం డాక్టర్ శ్రీనివాస్

**రాజుపాలెం, ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** రాజుపాలెం మండలం కొండమోడు టిఎన్ నగర్‌లో ఉన్నతాధికారులు ఎం. శేఖర్ రాజు



ప్రాంతీయ ఉపాసంచాలకులు ఆదేశానుసారం ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల పైన ఆరోగ్యం పైన అవగాహన సదస్సు , వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్యం పైన అందరూ అవగాహన కలిగి ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత వాటి ప్రాముఖ్యత గురించి తెలియపరచి వేసవి కాలంలో వృద్ధులు గర్భిణీ స్త్రీలు పిల్లలు వడదెబ్బ, నీరసం నుంచి తప్పించుకోవడానికి ప్రతిరోజూ 3 4లీటర్ల నీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, పండ్ల రసాలు తీసుకోవాలి. ఎండలో వెళ్లేటప్పుడు రుమాలు చున్నీ టోపీ గొడుగు కాటన్ దుస్తులు, సన్‌స్క్రీన్ లోషన్ వాడాలి, ఉదయము 105 సాయంత్రం గంటల మధ్య బయటకు వెళ్లకపోవడం ఉత్తమం. పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా శరీరాన్ని చల్లగా ఉంచుకోవచ్చన్నారు.

# న్యూట్రీ గార్డెన్లతో ఆరోగ్యకర జీవనం

**సత్తెనపల్లి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** ప్రకృతి సాగు విధానంలో న్యూట్రి గార్డెన్లను ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కె. అమల కుమారి పేర్కొన్నారు. సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు టెర్రస్ గార్డెన్, న్యూట్రి గార్డెన్, కిచెన్ గార్డెన్, ఏటీఎం మోడళ్లపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె



మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో క్యాన్సర్, రక్తహీనత, డయాబెటిస్ వంటి వ్యాధులు గ్రామీణ స్థాయిలో పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహారంలో పురుగుమందుల అవశేషాలు ఉండటం, తగిన పోషకాలు లేకపోవడం ఇందుకు ప్రధాన కారణాలని తెలిపారు. పాఠశాలల్లో న్యూట్రి గార్డెన్ల ద్వారా మధ్యాహ్న భోజనానికి అవసరమైన ఆకుకూరలు, కూరగాయలను స్వయంగా పండించుకోవచ్చని తెలిపారు. దీని వల్ల విద్యార్థులకు విషరహిత పోషకాహారం అందడంతో పాటు రోగనిరోధక శక్తి పెరిగి రక్తహీనత తగ్గుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సహకారంతో జీవామృతం, ఘనజీవామృతం, కషాయాలు తయారు చేసి వినియోగించడం ద్వారా నాణ్యమైన పంటలు పొందవచ్చని చెప్పారు. ప్రతి కుటుంబం తమ వద్ద ఉన్న స్థలాన్ని వినియోగించుకుని కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని, స్థలం లేని వారు టెర్రస్ గార్డెన్లను అభివృద్ధి చేయాలని సూచించారు. ఇంట్లో లభించే వ్యర్థాలతోనే అవసరమైన పోషక ద్రావణాలు తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మహిళలు కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎంఈఓ శ్రీనివాస్ ప్రతి పాఠశాలలో న్యూట్రి, కిచెన్ గార్డెన్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఎంఈఓ రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఈ గార్డెన్ల ద్వారా విద్యార్థులకు సహజ పోషకాహారం అందించడంతో పాటు వ్యవసాయం పట్ల అవగాహన పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, న్యూట్రి గార్డెన్ ట్రైనర్లు కంచర్ల మధుబాబు, వెంకట నాగలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

కారంపూడి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీసీ-4 ఛైర్మన్ పంగులూరి అంజయ్య, టీడీపీ నాయకులు భారీ కేకును కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా డ్వాక్రా యానిమేటర్లకు చీరలు పంపిణీ చేశారు. వీర్లంకమ్మ, సింగరుట్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గి మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ మునుగోటి సత్యనారాయణ, మాజీ మండల అధ్యక్షులు చప్పిడి రాము, ఎంపీపీ బొల్నేడి శ్రీనివాసరావు, కారంపూడి మండల అధ్యక్షులు గోళ్ల సురేష్ యాదవ్, మాజీ మండల అధ్యక్షులు ఉన్నం లక్ష్మీనారాయణ, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు తండా మస్తాన్‌జానీ, కారంపూడి పట్టణ మాజీ అధ్యక్షులు కటికల బాలకృష్ణ, చిరుమామిళ్ల శ్రీను, కోదాటి ప్రభాకర్, ఎస్వీఆర్ కృష్ణ, షేక్ నన్నేసా, దుర్గి మార్కెట్ యార్డు మెంబర్ కర్నాటి మహేష్, బాలునాయక్, తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పిసిబి ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

**గుంటూరు ఏప్రిల్ 18, ప్రభాతవార్త ప్రతినిధి :** స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారాన్ని అవగాహనా కార్యక్రమాల రోజుగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో వాటర్ పాజిటివ్ ఆంధ్ర అనే థీమ్ తో



శనివారం గుంటూరులో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని గుంటూరు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు నగరం లోని ఎస్కేబియమ్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు గుంటూరు జిల్లా పర్యావరణ ఇంజనీర్ నజీనా బేగం మాట్లాడుతూ విద్యార్థులు , ఉపాధ్యాయులతో పరస్పర చర్చ నిర్వహించి, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర జీవన విధానాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రే వాటర్ శుద్ధి వ్యవస్థను ప్రదర్శించారు. చేతులు కడుక్కునే సమయంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థ జలాన్ని సేకరించి ఇసుక పడక ద్వారా శుద్ధి చేసి , తరువాత స్క్రీనింగ్ ప్రక్రియ ద్వారా మలినాలను తొలగిస్తారని వివరించారు. అనంతరం శుద్ధి చేసిన నీటిని డ్రిప్ ఇరిగేషన్ విధానంలో మొక్కలకు వినియోగించడం జరుగుతోందని , ఈ విధానం ద్వారా తాగునీటి వినియోగం తగ్గించడంతో పాటు నీటి పునర్వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో చిన్న వయస్సులోనే పర్యావరణ బాధ్యతను పెంపొందించడంతో పాటు, రోజువారీ జీవితంలో పర్యావరణ హిత చర్యలను అనుసరించేందుకు ప్రోత్సహించాలని అన్నారు.

# జింక్ ఫుడ్‌తో అనర్థాలు ఎక్కువ

**వట్టిచెరుకూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :**



జింక్ ఫుడ్ తో అనర్థాలు ఎక్కువ అని ఎంపీడీవో రమేష్ బాబు పేర్కొన్నారు. మండలంలోని మేజర్ పంచాయతీ గ్రామం ముట్లూరు,, పుల్లడిగుంట గ్రామాలలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా తల్లులకు, గర్భవతులకు, జింక్ ఫుడ్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడుతూ..అధికంగా జింక్ ఫుడ్ తీసుకోవడం వల్ల రాగి లోపం ఏర్పడి, చేతులు మరియు కాళ్ళలో తిమ్మిర్లు, బలహీనత వంటి నరాల సంబంధిత సమస్యలు తలెత్తుతాయన్నారు. జింక్ ఒక ఖనిజమని, మన ఆరోగ్యానికి ఇది చాలా తక్కువ పరిమాణంలో మాత్రమే అవసరమని తెలియజేశారు. ఇది శరీరం అంతటా కణాలలో ఉంటుందని చేప్పారు. వ్యాధికారక బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడటానికి రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తుందని వివరించారు. జీప్ ఫుడ్ లో అధిక సోడియం సాల్ట్ ఉండడం వల్ల రక్తపోటు గుండెజబ్బులు మూత్రపిండాల సమస్యలు జీర్ణ క్రియ సమస్యలు అధిక బరువు లాంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. సంప్రదాయ ఆహారాన్ని ఇంట్లో వేడిగా ఆహారాన్ని తయారు చేసుకుని తినడం వలన పిల్లలు, పెద్దలు ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. పిల్లలకు స్క్రీన్ సమయాన్ని తగ్గించవలసిన ఆవశ్యకత ఉందన్నారు స్క్రీన్ ఎక్కువగా చూసే పిల్లల్లో మాటల తలనం పరిమిత ఊహాశక్తి తక్కువ శారీరక శరణం కంటి ఆరోగ్యం పాడవడం లాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని పేర్కొన్నారు గృహాల్లో పెద్దవారితో సమయాన్ని గడపనివ్వడం కథలు చెప్పటం పిల్లల్లో ఆలోచన శక్తిని శారీరక ఆరోగ్యాన్ని పెంచుతాయని సూచించారు కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఝాన్సీ రాణి పంచాయతీ సెక్రెటరీ ఎం వెంకటరెడ్డి పుల్లడిగుంట వట్టిచెరుకూరు ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఈ మాధవి చిన్నమ్మాయి ఎంఎల్పిహెచ్ కుమారి, ఏఎన్ఎం ఇందిరా, అంగనవాడి కార్యకర్తలు అంజనాదేవి, ఇందిరా, మణి, ఆయాలు, ఆషా వర్కర్లు, తల్లులు, పాల్గొన్నారు.

# మహిళా పరిరక్షణ కోసం పలు చట్టాలు : 1వ అదనపు సివిల్ జడ్జి ప్రియదర్శిని

**సత్తెనపల్లి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మహిళా పరిరక్షణ కోసం పలు చట్టాలు ఉన్నాయని స్త్రీ కి అన్ని దశల్లో చట్టం భరోసా కల్పిస్తుందని 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి. ప్రియదర్శిని అన్నారు. సత్తెనపల్లి పట్టణం కాకతీయ కళ్యాణ మండపలో శనివారం ఉదయం సత్తెనపల్లి పట్టణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళలు కోసం జరిగిన ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, శ్రీ వైష్ణవి విద్యాసంస్థల్లో విద్యార్థినిలు పాల్గొన్నారు. ఈ అవగాహన సదస్సు లో న్యాయమూర్తి మాట్లాడుదూ భృణ హత్యలు, లింగనిర్ధారణ చర్య చట్ట వ్యతిరేకం, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, బాల్య వివాహ చట్టం అనగా ఇది చట్టవ్యతిరేకం అని పలు అంశాలపై న్యాయ అవగాహన కల్పించారు. అదే విదంగా సత్తెనపల్లి డి.ఎస్.పి మేదరమెట్ల హనమంతురావు మహిళలకు పోలీస్‌శాఖ కల్పిస్తున్న పలు అంశాలు పై సవివరంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి పి. ప్రియ దర్శిని, డి. ఎస్. పి. మేదరమెట్ల హనమంతురావు, సత్తెనపల్లి పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరహరి నాగమల్లేశ్వరరావు, ఎస్ ఫాతిమా, ఏ.పి.ఎస్.ఆర్.టి.సి అసిస్టెంట్ మేనేజర్



సత్తెనపల్లి డిపో.వి. సుజాత, ఎస్. వి. ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మరియు డైరెక్టర్,శ్రీలత, సి.డి.పి.ఓ సత్తెనపల్లి, డాక్టర్ మాధవి, ఏరియా ఆసుపత్రి సత్తెనపల్లి, తదితరులు పాల్గొన్నారు.

# ముద్దాయిలు భవిష్యత్ జీవితం సత్ప్రవర్తనతో మెలగాలి: సివిల్ జడ్జి విజయ్ కుమార్ రెడ్డి

**సత్తెనపల్లి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** సత్తెనపల్లి పట్టణంలోని శనివారం సాయంత్రం ఉప కారాగారాన్ని సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్ ) సత్తెనపల్లి , సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ వి. విజయ్ కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. ముందుగా అక్కడ పరిసరాలను పరిశీలించారు, అక్కడ ఉన్న ముద్దాయిలకు అందించే ఆహారం నాణ్యతను మరియు వాటికి అవసరం అయిన నిత్యావసర సరుకులు నాణ్యత ను పరిశీలించారు. అక్కడ ఉన్న రిజిస్టర్ ను చెక్ చేశారు. అదేవిదంగా ముద్దాయిలు వివరాలు అడిగి వారికి అందుతున్న సదుపాయాలు గురించి కూడ అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగా వారికి పలు సూచనలు తెలియజేశారు. భవిష్యత్తు జీవితం సత్ ప్రవర్తన తో



మెలగాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు వి. విజయ్ కుమార్ రెడ్డి, థౌషిద్ హుస్సేన్, ఫ్రీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బి. ఎల్. కోటేశ్వరరావు, ఉపకారాగార సూపరింటెండెంట్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన 3రోజుల రెసిడెన్షియల్ విలేజ్ ఇమ్మర్షన్ శిక్షణ

**సత్తెనపల్లి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** గ్రామాలలో పారిశుధ్యం మెరుగుదలకు ప్రధానంగా గృహస్థాయిలో తడి చెత్త మరియు పొడి చెత్త ను వేరు చేయడం జరగాలని పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి ఎస్వి నాగేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామ సుప్రీం ఎల్ టి సి లో గురువారం నుండి శనివారం వరకు జరిగిన మూడు రోజుల



రెసిడెన్షియల్ విలేజ్ ఇమ్మర్షన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ సజావుగా జరిగే విధానాలు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రం లో జరిగే అన్ని కార్యక్రమాలు, ఘన వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛ రథం, గృహ స్థాయి లో తడి, పొడి చెత్త లను వేరు చేసే ప్రక్రియ, బిన్ బ్యాగ్ విధానం, సంపద తయారీ కేంద్రం లో వర్మీ కంపోస్టు తయారీ విధానం, పొడి చెత్త ను బేళ్ళు గా కట్టి అమ్మే విధానం మొదలగు అంశాల మీద మూడు రోజుల ఇమ్మర్షన్ ట్రైనింగ్ కార్యక్రమంలో సంపూర్ణ అవగాహన కల్పించినట్లు డిపిఓ పేర్కొన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర కల సాకారం కావాలంటే స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కూడా విజయవంతం కావాలని డిపిఓ పేర్కొన్నారు. జిల్లాలోని 23 గ్రామాలకు చెందిన పంచాయతీ అభివృద్ధి అధికారులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, ప్రకాశం జిల్లా ఆర్పీలు కె. చంద్రమోహన్ మరియు అశోక్ కుమార్, కోనసీమ జిల్లా ఎఫ్ టి సి పి. మధు మహేష్ , పంచాయతీ కార్యదర్శులు కుంభా వెంకటేశ్వర్లు, చిలువూరి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ఐటిసి అసిస్ట్ సహకారంతో 10 గ్రామాల చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు కావలసిన పనిముట్ల అందజే

ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఐ టి సి అసిస్ట్ సహకారంతో పల్నాడు జిల్లాలో మంచి పనితీరు కనబరుస్తున్న పది గ్రామాల కు చెందిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు కావలసిన పనిముట్లు మరియు ఆయా గ్రామాల హరిత రాయబారులకు కావలసిన కిట్లను పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి ఎస్వి నాగేశ్వర్ నాయక్ శనివారం నందిగామ లోని సుప్రీం ఎల్టిసిలో అందజేశారు. జిల్లాలోని నందిగామ, వంకాయలపాడు, మొర్జంపాడు, బ్రాహ్మణపల్లి, రెంటచింతల, నకరికల్లు, రావిపాడు, దిడుగు, మాదల, అందుగులపాడు గ్రామాల పంచాయతీ అభివృద్ధి అధికారులు మరియు హరిత రాయబారులు వీటిని అందుకున్నారు. అసిస్ట్ డైరెక్టర్ జాస్తి రంగారావు గారి తరపున అసిస్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ గ ఈ కార్యక్రమంలో పాల్గొని డిపిఓ ఎస్వి నాగేశ్వర్ నాయక్ తో కలిసి పనిముట్లను, పరికరాలను, కిట్లను అందజేశారు. ఈ పరికరాలతో ఈ గ్రామాల్లోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు మరింత బాగా పనిచేసే జిల్లాకు మంచి పేరు తేవాలని డిపిఓ ఆకాంక్షించారు. అసిస్ట్ ట్రైనర్ చంబేటి బోల్లయ్య, సి ఓ అనిల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు .

# ప్రభుత్వ వైద్యశాలలో నిరుపేద ఓపి రోగులకు భోజనం పంపిణీ

**సత్తెనపల్లి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** భరతమాత అన్నప్రసాద వితరణ పథకం 790వ రోజు తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు బుడగాల సుబ్బారావు కుమార్తె బుడగాల రామ జ్యోతిర్మయి జన్మదిన సందర్భంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల లో నిరుపేద ఓ. పి రోగులకు వీరి ఆర్థిక సహాయంతో ఉచితంగా భోజన ప్యాకెట్లను పిజియో థెరపి డాక్టర్లు కరుణాకర్ మరియు జీవన జ్యోతి చేతులమీదుగా శనివారం మధ్యాహ్నం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనాటి ఈ సేవా కార్యక్రమానికి ఆర్థిక సహాయం



అందించిన బుడగాల రామ జ్యోతిర్మయి భర్త రమేష్‌లకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# సేంద్రియ పద్ధతుల్లో ఆకుకూరలు పండించటంపై అవగాహన

**సత్తెనపల్లి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరం శనివారం ఉదయం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, గ్రామ వి.ఓ.ఏ లకు మరియు అగ్రికల్చర్,హార్టి కల్చర్ అసిస్టెంట్ లకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధ్యక్షతన అన్ని గ్రామ పంచాయితీల పరిధిలో ఉన్న గృహాలు, అంగన్వాడీ కేంద్రాలలో న్యూ ట్రీ గార్డెన్స్ కిచెన్ గార్డెన్ మరియు వివిధ రకాల పద్దతులలో సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు ఆకుకూరలు



పండించటంపై అవగాహన కల్పించారు. న్యూట్రి గార్డెన్స్ ని ఏ విధంగా పెంచుకోవాలి గృహాలు అన్ని అంగన్వాడీ కేంద్రాలలో ఎలా పండించుకోవాలి అనే విషయాలను కూడా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్ఎఫ్ఎ సైదయ్య , ఎంటిఎం మధుబాబు, ఐసిపిఆర్‌లు గంపల నాగలక్ష్మి , వనుకూరి వెంకటనాగలక్ష్మి తెలిపారు.




ఐపీఎల్‌లో నేటి మ్యాచ్

| | |
|---|---|
| కోల్‌కతా నైట్ రైడర్స్ V/S రాజస్థాన్ రాయల్స్ | మధ్యాహ్నం 3.30 గం.లకు |

# వైభవ్, జైస్వాల్‌పైనే ఫోకస్

**కోల్‌కతా:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా నేడు జరిగే తొలి మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో రాజస్థాన్ రాయల్స్ తలపడనుంది. తొలి విజయం కోసం ఎదురుచూస్తున్న కేకేఆర్... సొంత గడ్డ ఈడెన్‌లోనైనా ఆ లోటు పూడ్చుకోవాలని చూస్తోంది. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ కూడా ఓటమితో ఇక్కడకు వచ్చింది. వరుస విజయాలతో జోరు మీదున్న రాజస్థాన్.. ఉప్పల్‌లో బోల్తా కొట్టింది. అయితే అయిదు మ్యాచ్‌ల్లో నాలుగింట గెలుపొందిన రికార్డుతో ఉంది.

ఈ సీజన్‌లో ఒక్క విజయం కూడా సాధించని ఏకైక జట్టుగా కోల్‌కతా ఉంది. ఆడిన 5మ్యాచ్‌ల్లో అయిదింటిలో ఓడగా, మరోమ్యాచ్ వర్షం వల్ల రద్దయింది. గత మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ చేతిలో ఐదు వికెట్ల తేడాతో ఓటమి పాలైన తర్వాత ఈ మ్యాచ్ బరిలోకి దిగుతున్నారు. ఖరీదైన ప్లేయర్ కామరూన్ గ్రీన్ పరుగుల వేటలో పడడం ఒక్కటే కేకేఆర్‌కు ఊరటనిచ్చే అంశం. కెప్టెన్ రహానే, రఘువంశీ సహా ప్రతి ఒక్కరూ నిరాశపరుస్తుండడం కేకేఆర్‌కు ఆందోళన పరుస్తోంది. బౌలింగ్‌లో వరుణ్ లాంటి మేటి స్పిన్నర్ ఉన్నా ప్రభావం చూపలేకపోతున్నాడు. ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ మెరుగుపడితేనే గెలుపు అవకాశాలు ఉంటాయి.

మరోవైపు రాజస్థాన్ రాయల్స్.. గత ఓటమి నుంచి బౌన్స్ బ్యాక్ కావాలని ఉవ్విళ్లూరుతోంది. హార్డ్ హిటర్ వైభవ్ సూర్యవంశీ 40 గంటలతో ఐదు ఇన్నింగ్స్‌లో 200 రన్స్ చేశాడు. రెండు హాఫ్ సెంచరీలతో పాటు 263కు పైగా స్ట్రయిక్ రేట్‌తో కొనసాగుతున్నాడు. గత మ్యాచ్‌లో గోల్డెన్ డక్ అయిన వైభవ్.. కేకేఆర్‌పై పరుగులు సాధించాలని ఆశిస్తున్నాడు. బ్యాటింగ్‌కు స్వర్గధామమైన ఈడెన్‌లో సిక్స్‌లమోత కోసం ఎదురుచూస్తున్నాడు. మరో ఓపెనర్ యశస్వీ జైస్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్ బ్యాట్ ఝుళిపిస్తే తిరుగుండదు. గత మ్యాచ్‌లో జడేజా, ఫెరీరా, తుషార్ రాణించడంతో బ్యాటింగ్ పటిష్టంగా మారింది. జోఫ్రా అర్చర్, బర్గర్, జడేజా, రవి బిష్ణోయ్ రూపంలో రాయల్స్‌కు వైవిధ్యభరిత బౌలింగ్ అటాక్ ఉంది.

**హెడ్ టు హెడ్ :** ఇరుజట్లు 32 మ్యచ్‌ల్లో తలపడగా ఓవరాల్‌గా కేకేఆర్ పైచేయిగా ఉంది. కోల్‌కతా 16 మ్యాచ్‌ల్లో, రాజస్థాన్ 14 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. రెండు మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు. చివరి సారి ఇరు జట్లు తలపడినప్పుడు కేకేఆర్ గెలుపొందింది. **పిచ్ రిపోర్ట్:** ఈడెన్ పిచ్‌పై చక్కని బౌన్స్ ఉంటుంది. ఈ సీజన్‌లో ఇక్కడ జరిగిన రెండు మ్యాచ్‌ల్లో సగటున మొదటి ఇన్నింగ్స్ స్కోరు 204గా నమోదైంది. చిన్న బౌండరీలు, ఫాస్ట్ అవుట్ ఫీల్డ్ వల్ల పరుగుల వరద పారనుంది.

**కోల్‌కతా నైట్ రైడర్స్:** అజింక్యా రహానే (కెప్టెన్), టిమ్ సీఫెర్ట్ (వికెట్ కీపర్), కామెరాన్ గ్రీన్, రఘువంశీ, రోవ్‌మన్ పావెల్, రింకూ సింగ్, రమణదీప్ సింగ్, అనుకూల్ రాయ్, సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి, కార్తీక్ త్యాగి; **ఇంపాక్ట్ ప్లేయర్:** వైభవ్ అరోరా

**రాజస్థాన్ రాయల్స్:** యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్ (కెప్టెన్), ప్రిటోరియస్, డోనోవన్ ఫెరీరా, రవీంద్ర జడేజా, జోఫ్రా ఆర్చర్, నాండ్రే బర్గర్, సందీప్ శర్మ, రవి బిష్ణోయ్; **ఇంపాక్ట్ ప్లేయర్:** తుషార్ దేశ్‌పాండే.

# వందో మ్యాచ్‌లో ఆర్సీబీకి షాక్

## ఢిల్లీని గెలిపించిన స్టబ్స్, మిల్లర్

**బెంగళూరు:** చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జైత్రయాత్ర ముగిసింది. వందో మ్యాచ్‌లో విజయంతో మురవాలనుకున్న ఆర్సీబీకి ఢిల్లీ క్యాపిటల్స్ చెక్ పెట్టింది. 176రన్స్ ఛేదనలో భువనేశ్వర్(3/26) ధాటికి కష్టాల్లో పడిన ఢిల్లీని ట్రిస్టన్ స్టబ్స్(60 నాటౌట్), కేఎల్ రాహుల్(57)అర్ధశతకాలతో ఆదుకున్నారు. ఆఖరి ఓవర్లో 14 రన్స్ అవసరమవ్వగా.. డేవిడ్ మిల్లర్ (22 నాటౌట్) రెండు సిక్సర్లు, ఫోర్‌తో గెలిపించాడు. ఆరు వికెట్ల తేడాతో గట్టెక్కిన ఢిల్లీ క్యాపిటల్స్ మూడో విజయం నమోదు చేసింది.

మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 8 వికెట్లకు 175 రన్స్ చేసింది. ఫిల్ సాల్ట్(38 బంతుల్లో 63) మొదటి వికెట్‌కు కోహ్లీ(19)తో కలిసి 52 రన్స్..పడిక్కల్(18)తో కలిసి రెండో వికెట్‌కు 47రన్స్ జోడించాడు.అయితే 6పరుగుల తేడాతో 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.



మిడిల్ ఓవర్లలో వేగంగా వికెట్లు కోల్పోయింది. ఎంగిడి, కుల్‌దీప్, అక్షర్ పటేల్ తలా రెండేసి వికెట్లు తీసి ఆర్సీబీని కట్టడి చేశారు.

176 రన్స్ టార్గెట్‌తో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి భువనేశ్వర్ ఝలక్ ఇచ్చాడు. నిస్సాంక(1), కరుణ్ నాయర్(5), సమీర్ రిజ్వీ(2)లను వెంటవెంటనే అవుట్ చేయడంతో ఢిల్లీ 18 రన్స్‌కే మూడు టాప్ ఆర్డర్ వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిది.

**నిలబడిన రాహుల్, స్టబ్స్**

కేఎల్ రాహుల్(57), ట్రిస్టన్ స్టబ్స్(60 నాటౌట్) ఆదుకున్నారు. హేజిల్‌వుడ్ వేసిన ఓవర్లో రెచ్చిపోయిన రాహుల్ 6, 4, 4 బాదాడు. పవర్ ప్లేలో ఢిల్లీ మూడు వికెట్ల నష్టానికి 50 పరుగులు చేసింది. సుయాశ్ శర్ ఓవర్లో వరస బౌండరీ లతో.. ఈ ద్వయం 31 బంతుల్లో 50 రన్స్ జోడించింది. అర్ధ శతకం తర్వాత స్పీడ్ పెంచాలనుకున్న రాహుల్‌ను కృనాల్ పాండ్యా తెలివిగా ఔట్ చేశాడు. అనంతరం గెలుపు బాధ్యత తీసుకున్న స్టబ్స్.. సుయాశ్ ఓవర్లో బౌండరీలతో చెలరేగాడు. అయితే.. అక్షర్ పటేల్(26) రిటైర్ట్ హర్ట్‌గా వెనుదిరిగడంతో క్రీజులోకి వచ్చిన డేవిడ్ మిల్లర్(22 నాటౌట్).. భువీ ఓవర్లో సిక్సర్, ఆపై రసిక్ ఓవర్లో బౌండరీలు బాదాడు. దీంతో 10 బంతుల్లో 20 పరుగులుగా మారింది. షెపర్డ్ సంధించిన మూడు, నాలుగు బంతులను సిక్సర్లుగా మలిచిన మిల్లర్ ఐదో బంతికి బౌండరీ రాబట్టాడు. అంతే.. సొంతగడ్డపై ఆర్సీబీ చిత్తవ్వగా.. ఢిల్లీ క్యాపిటల్స్ విజయంతో మురిసింది.



# ఉప్పల్‌లో అభిషేక్ పరుగుల ఉప్పెన



**హైదరాబాద్, ఏప్రిల్18:** సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ(22 బంతుల్లో 59)... ఉప్పల్ స్టేడియంలో పరుగుల ఉప్పెన సృష్టించాడు. కేవలం 15బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీ సాధించాడు. సింగిల్‌తో పరుగుల ఖాతా తెరిచిన అభిషేక్... ముకేష్ చౌదరికి సిక్స్‌తో స్వాగతం పలికాడు. మాథ్యూ షార్ట్ మూడో ఓవర్లో కూడా ఫ్రంట్‌ఫుట్‌పై వచ్చి భారీ సిక్స్ బాదాడు. కంబోజ్ మరో ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ బౌండరీలతో అలరించాడు. ఇక మాథ్యూ షార్ట్ వేసిన 5వ ఓవర్లో అభిషేక్ ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు. వరుసగా మూడు బౌండరీలు బాదిన అభిషేక్... చివరి రెండు బంతులపై రెండు సిక్సర్లతో విధ్వంసం సృష్టించాడు. చివరి బంతిని స్టాండ్స్‌లోకి పంపిన ఈచిచ్చరపిడుగు కేవలం 15 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. ఈ ఓవర్లో ఏకంగా 25రన్స్ సాధించాడు. తద్వారా సన్ రైజర్స్ తరఫున ఐపీఎల్‌లో వేగవంతమైన హాఫ్ సెంచరీ బాదిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. మొత్తంగా ఉప్పల్ మైదానంలో తన స్టయిల్ విధ్వంసంతో పూనకాలు తెప్పించాడు. అయితే.. ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ యశస్వీ జైస్వాల్ పేరిట ఉంది. 2023 సీజన్‌లో కేవలం 13 బంతుల్లోనే ఈ ఫీట్ సాధించాడు.

# ఐపీఎల్ తరహాలో తెలంగాణ టీ20 లీగ్

**హైదరాబాద్, ఏప్రిల్18:** ఐపీఎల్ తరహాలో తెలంగాణ టీ20 లీగ్‌ను నిర్వహించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సన్నద్ధమైంది. జూన్‌లో జరగనున్న ఈటోర్నమెంట్‌లో జట్ల యాజమాన్యం కోసం టెండర్ ప్రక్రియను హెచ్‌సీఏ ప్రారంభించింది. జట్టు యాజమాన్య హక్కులు మొదటి 5ఏళ్ల కాలానికి ఇవ్వబడతాయి. ఆ తర్వాత ప్రతి 3 ఏళ్లకు ఒకసారి రెన్యూవల్ చేస్తారు. ఒక్కో జట్టుకు కనీస బిడ్ ధర 3 కోట్లుగా నిర్ణయించారు. ఆటగాళ్ల జీతాలు, సిబ్బంది ఖర్చులు, వసతి, జెర్సీల ఖర్చులను ఫ్రాంచైజీ యజమానులే భరించాలి. కొత్త జట్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్న సంస్థలు ఏప్రిల్ 28లోపు టెండర్ పత్రాలు సమర్పించాలి. ఏప్రిల్ 30న షార్ట్‌లిస్ట్ చేసిన ఫ్రాంచైజీలను ప్రకటించనున్నారు. ఈ టోర్నీలో మొత్తం 8 ఫ్రాంచైజీలు పాల్గొనున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మెదక్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతాలను ప్రాతిపదించారు. ఆఖరికి బిడ్డింగ్ ద్వారా 8 జట్లను ఖరారు చేస్తారు. ఈ టోర్నీ 21 రోజులు పాటు ఉప్పల్ మైదానం వేదికగా జరగనుంది. మొత్తంగా 32 మ్యాచ్‌లు జరుగుతాయి.



# పంజాబ్ జైత్రయాత్రకు బ్రేక్ పడేనా?

**న్యూచండీఘర్:** శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో పంజాబ్ కింగ్స్.. ఈ ఐపీఎల్ సీజన్‌లో విజయవంతమైన జట్టుగా కొనసాగుతోంది. నేడు జరిగే రెండో మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. ముంబైపై ఛేజింగ్‌లో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్ ఈ మ్యాచ్‌కు ఫుల్‌జోష్‌తో సిద్ధమైంది. ఆడిన 5మ్యాచ్‌ల్లో నాలుగింట గెలుపొందగా, ఓ మ్యాచ్ వర్షార్పణం అయింది. మరోవైపు లక్నో వరుసగా రెండో మ్యాచ్ పరాజయాలతో ఉంది. చివరి మ్యాచ్‌లో ఆర్సీబీ చేతిలో 5 వికెట్ల తేడాతో ఓడింది. మార్క్‌రమ్, మిచెల్ మార్ష్, రిషబ్ పంత్ తమ స్థాయికి తగ్గ బ్యాటింగ్ కనబరచడంలో విఫలమవుతున్నారు. ముకుల్ చౌదరీ ఆశాకిరణంగా ఉన్నాడు. మహ్మద్ షమీ ప్రభావవంతంగా బౌలింగ్ చేస్తూన్నా మిగతా బౌలర్లు విఫలమవుతున్నారు. ఈఏడాదివరుస విజయాలతో జోరుమీదున్న పంజాబ్‌ను లక్నో నిలువరించాలంటే బ్యాటింగ్, బౌలింగ్‌లో బ్రహ్మాండంగా రాణించాల్సి ఉంటుంది.

ఐపీఎల్‌లో నేటి మ్యాచ్

| | |
|---|---|
| పంజాబ్ కింగ్స్ V/S లక్నో సూపర్ జెయింట్స్ | రాత్రి 7.30 గం.లకు |

2025లో స్వల్ప తేడాతో రన్నరప్‌గా నిలిచిన పంజాబ్ ఈసారి ట్రోఫీ అందుకోవాలనే దృఢ సంకల్పంతో కనిపిస్తోంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని ఈ జట్టు మరోసారి ఆధిపత్యాన్ని చాటాలని భావిస్తోంది. ప్రభుసిమ్రాన్ సింగ్, ప్రియాన్ష్ ఆర్యా ఫ్లయింగ్ స్టార్టలు అందిస్తున్నారు. సర్పంచ్ సాబ్ శ్రేయాస్ అయ్యర్ మూడు హాఫ్ సెంచరీలతో సహా నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 203 రన్స్ చేశాడు. కూపర్ కానోలీ, మార్కస్ స్టోయినీస్, శశాంక్ సింగ్ కూడా పరుగుల వేటలో ఉన్నారు. అర్షదీప్ సింగ్, వైశాక్, చాహల్, బార్ట్‌లెట్, మార్కో జాన్సెన్ రూపంలో ప్రత్యర్థిని కట్టడిచేసే బౌలింగ్ సొంతం.

# 19వేల 221కోట్లకు పెరిగిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లాభాలు




వాణిజ్యం

**ముంబయి, ఏప్రిల్ 18:** ప్రైవేటురంగంలోని రెండో అతిపెద్ద బ్యాంకు అయిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు నాలుగోత్రైమాసికంలో నికరలాభం 9 శాతం వృద్ధి సాధించింది. తక్కువ కేటాయింపుల కారణంగా నికరలాభాలు రూ.19,221 కోట్లకు పెరిగాయి. గత ఏడాది ఇదేకాలంలో 18,663.75 కోట్లు సాధించిన బ్యాంకు ఈసారి 19 కోట్ల పైచిలుకు నికరలాభం ఆర్జించింది. నికరవడ్డీ ఆదాయం కూడా పెరిగింది. 3.2శాతం పెరిగి 33,080 కోట్లుగా ఉంది.అదే గత ఏడాది ఇదే కాలంలో 32,070 కోట్లు మాత్రమే.

బ్యాంకు ఇతర రాబడులు నాలుగో త్రైమాసికంలో 13,200 కోట్లుగా ఉన్నాయి. వార్షిక పద్ధతిలోచూస్తే 9.7శాతంగా ఉన్నాయి. ఫీజులు, కమిషన్ల రూపంలో 8.1శాతం వార్షిక వృద్ధితో 9220 కోట్లు ఆర్జించింది. విదేశీ కరెన్సీ ఇతర డెరివేటివ్‌ల విభాగంలో రాబడులు 3.5శాతం పెరిగి 1490కోట్లుగా ఉంది. మార్కెట్ లాభాల పరంగా కూడా రెట్టింపు వృద్ధిని నమోదుచేసింది. 390 కోట్లనుంచి 820 కోట్ల రూపాయలు ఆర్జించి 110.3శాతం వృద్ధి నమోదుచేసింది. ఇక రికవరీలు, డివిడెండ్లరూపంలో రాబడులు రూ.1670 కోట్లవరకూ ఉన్నాయి. నిర్వహణ వ్యయాలు కూడా 5.2 శాతంపెరిగి 17,560 కోట్లనుంచి రూ.18,480 కోట్లకు పెరిగాయి. రాబడి వ్యయం నిష్పత్తిపరంగాచూస్తే 39.9 శాతంగా ఉన్నాయి బ్యాంకు నికరవడ్డీ ఆదాయం 3.38శాతంపెరిగింది. నికరవడ్డీ మార్జిన్ బ్యాంకు లాభదాయకతను నిర్దేశిస్తుంది. ఇక బ్యాంకు తక్షణ కేటాయింపులు ఈత్రైమాసికంలో 18శాతం తగ్గాయి. గత ఏడాది ఇదేకాలంలో 2837.86 కోట్లుకేటాయిస్తే ఈసారి నాలుగోత్రైమాసికంలో 2609,.57 కోట్లు కేటాయించింది.మొత్తం రుణ నిష్పత్తి వ్యయం 0.35శాతంగా ఉంది. బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 1.15శాతంగా ఉన్నాయి. బ్యాంకు డిపాజిట్లు రూ.28.51 లక్షలకోట్లుగా ఉన్నాయి. డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే 3.6శాతంపెరిగాయి. కాసా డిపాజిట్లు కూడా రూ.9.18 లక్షలకోట్లుగా ఉన్నాయి. మొత్తం మార్చి 31వ తేదీనాటికి డిపాజిట్లు రూ.31.05 లక్షలకోట్లు కాగా 14.4శాతం వృద్ధినిసాధించింది. కాసా డిపాజిట్ నిష్పత్తికూడా 12.3శాతం పెరిగింది. సేవింగ్స్ ఖాతా డిపాజిట్లు రూ.7.05 లక్షలకోట్లు, కరెంటుఖాతా డిపాజిట్లు రూ.3.54 లక్షలకోట్లుగా ఉన్నాయి. కాలపరిమితి డిపాజిట్లు రూ.20.45 లక్షలకోట్లుగా ఉన్నాయి. బ్యాంకు సగటు అడ్వాన్సులు రూ.29.64 లక్షలకోట్లుగా ఉన్నాయి.స్థూల అడ్వాన్సులు రూ.29.60 లక్షల కోట్లుగా ఉన్నట్లు బ్యాంకుప్రకటించింది.

# ఐసిఐసిఐ నికరలాభం 12,630 కోట్లు

**ముంబయి, ఏప్రిల్ 18:** ప్రైవేటురంగంలోని బ్యాంకింగ్ దిగ్గజం ఐసిఐసిఐ బ్యాంకు నాలుగో త్రైమాసికంలో నికరలాభం 8.5శాతం వృద్ధిని నమోదుచేసింది. మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.13,701.7 కోట్ల లాభం ఆర్జించినట్లు ప్రకటించింది. గత ఏడాది ఇదేకాలంలో 12,629.58కోట్ల నుంచి 8.5శాతం వృద్ధిని నమోదు చేసింది. బ్యాంకు నికరవడ్డీ ఆదాయం ఈ త్రైమాసికంలో 8.4 శాతం ఎరిగి రూ. 22,979 కోట్లకు పెరిగింది. అదే గత ఏడాది ఈ కాలంలో రూ.21,193 కోట్లు ఉంది. నికర వడ్డీ మార్జిన్‌కూడా 4.30శాతంనుంచి 4.32శాతానికి పెరిగింది. నికరవడ్డీ ఆదాయంలో ట్రెజరీ రాబడులు మినహాయిస్తే ఆ మొత్తం 5.6శాతంపెరిగి రూ.7415 కోట్లకు చేరింది.




బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్రా మాట్లాడుతూ ట్రెజరీ నష్టాలు అనేవి మార్కెట్ కదలికలను బట్టి ఉంటాయన్నారు. ఆన్‌షోర్ మార్కెట్‌లో బ్యాంకు ఆర్బీఐ మార్గదర్శకాలను అనుసరించి తగ్గించిందని, దీనివల్ల ట్రెజరీ రాబడి రూ.109 కోట్లు తగ్గిందని చెప్పారు. అలాగే బ్యాంకు కేటాయింపులు కూడా తగ్గాయి. నాలుగో త్రైమాసికంలో గత ఏడాది 891 కోట్లనుంచి 96 కోట్లకు తగ్గాయి. దీనివల్ల స్థిరాస్థి ప్రమాణాలు కూడా పెరిగి రికవరీలు మెరుగు పడ్డాయి. మార్చి 31వ తేదీనాటికి బ్యాంకు తక్షణ కేటాయింపులు కింద రూ.13,100 కోట్లు చూపించింది. రిజర్వు బ్యాంకు మార్గదర్శకాలను అనుసరించి మూడో త్రైమాసికంలోనే రూ.1283 కోట్లు అదనపు స్థిరాస్థిప్రమాణాల కేటాయింపులు చేసింది. ఈ కేటాయింపులు ప్రాధాన్యతారంగాల్లో వ్యవసాయ రంగ పోర్టుఫోలియోకింద ఉన్నాయి.

బ్యాంకు డిపాజిట్లు కూడా 11.4శాతంపెరిగి 17.95 లక్షల కోట్ల రూపాయలకు చేరాయి. కరెంటు ఖాతా సేవింగ్స్ ఖాతాల నిష్పత్తి 38.6 శాతంగా ఉంది. అలాగే బ్యాంకు అడ్వాన్సులు కూడా 15.8శాతంపెరిగి రూ.15.54లక్షలకోట్లకు చేరాయి. రిటైల్ రుణరంగం 9.5శాతం వృద్ధిచెందింది. మొత్తం రుణపోర్టుఫోలియోలో 50.4 శాతం రిటైల్‌రుణాలే ఉన్నాయి. బ్యాంకు స్థిరాస్థి ప్రమాణాలు కూడా మెరుగయ్యాయి. స్థూల నిరర్ధక ఆస్తులు 1.4శాతంగా ఉన్నాయి. నికర నిరర్ధక ఆస్తుల నిష్పత్తికూడా ఈ త్రైమాసికంలో 0.33శాతం మాత్రమే ఉన్నట్లు తెలిపింది. ఏడాది మొత్తానికి ఐసిఐసిఐ నికరలాభం రూ.50,147 కోట్లకు పెరిగింది. బ్యాంకు బోర్డు డైరెక్టర్లు ప్రతి ఈక్విటీ వాటాకు రూ.12 డివిడెండ్ చెల్లింపులు సిఫారసుచేసారు. అలాగే దేశీయ మార్కెట్లనుంచి రూ.25వేలకోట్లు ప్రైవేట్ ప్లేస్‌మెంట్‌క ఇందనిధుల సమీకరణకు కూడా ఆమోదం లభించింది. విదేశీ మార్కెట్లకు డిపాజిట్‌పత్రాల రూపంలో రూ.1.50 బిలియన్ డాలర్లు జారీచేయాలని నిర్ణయించారు. అలాగే ఐసిఐసిఐ గ్రూప్ రిస్క్ అధికారి కింద ఉన్న శ్రీనివాస్ పదవీకాలాన్ని 2028 జులై31వరకూ పొడిగిస్తూ నిర్ణయించారు.

## ఒక్క నెలలోనే కస్టమ్స్ వద్ద నిలిచిపోయిన

# 5 టన్నుల పసిడి, 8 టన్నుల వెండి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** కస్టమ్స్ విభాగం అధికారులవద్ద ఈనెల 1వ తేదీనుంచి ఇప్పటివరకూ ఐదు టన్నుల బంగారం, ఎనిమిది టన్నుల వెండి చిక్కుకునిపోయి ఉన్నట్లు తేలింది. డిజిఎఫ్‌టి అధికారుల అలసత్వంకారణంగాను, దిగుమతి అనుమతులు జాప్యం వల్ల టన్నులకొద్దీ విలువైన ఖనిజాలు కస్టమ్స్ అధీనంలోనే ఉండిపోయాయి. బులియన్ దిగుమతులకు ప్రభుత్వ అనుమతుల్లో జాప్యం వల్లనే ఇలా నిలిచిపోయినట్లు చెపుతున్నారు. అక్షయ తృతీయ కారణంగా బులియన్ రంగానికి భారీ స్థాయిలో దిగుమతులు వస్తుంటాయి. బ్యాంకులకు దిగుమతులుచేసుకునేందుకు కేంద్రం 15 బ్యాంకులకు అనుమతులిచ్చింది. దీనితో ఇపుడు ఈకస్టమ్స్ అధీనంలో ఉన్న బంగారం, వెండినిల్వలకు విముక్తి లభిస్తుందని అంచనావేస్తున్నారు.

గతనెలాఖరు వరకూ మాత్రమే బ్యాంకులకు బంగారం వెండి దిగుమతులకు అనుమతులున్నాయి. ప్రభుత్వ అనుమతి జాప్యం కారణంగా ఈనెలలో మొత్తం ఐదు టన్నుల బంగారం, ఎనిమిది టన్నుల వెండినిల్వలు కస్టమ్స్‌వద్దనే నిలిచిపోయాయి. దీనికితోడు దేశంలోని వివిధ పోర్టుల్లో కూడా దిగుమతులు నిలిచిపోయాయి. ఈ జాప్యాంపై అటు డిజిఎఫ్‌టి, కస్టమ్స్ అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకొస్తున్నారని తేలింది. వాణిజ్యశాఖ నోటిఫికేషన్‌ప్రకారం 15 బ్యాంకులు దిగుమతులు చేసుకునేందుకు అనుమతులు పెందాయి. ఏప్రిల్ ఒకటినుంచి 2029 మార్చి 31వ తేదీవరకూ ఈ అనుమతులు అమలులో ఉంటాయి. సెజ్‌లు, లేదా ఎగుమతి ఆధారిత యూనిట్లనుంచి కాకుండా దిగుమతులు నిర్వహిస్తున్న వారికి ప్రత్యేక ప్రభుత్వ లైసెన్సులు తీసుకోవాలిసి ఉంటుందని కూడా వెల్లడించింది. అక్షయతృతీయ కారణంగా చేసుకున్న దిగుమతులు నిలిచిపోవడంతో బ్యాంకులు కూడా ఆందోళన వ్యక్తంచేసాయి. ప్రభుత్వ అనుమతులతో ఇపుడు కస్టమ్స్ వద్ద ఉన్న ఈ దిగుమతులకు విముక్తి లభించనున్నది.

# జియో ఫైనాన్షియల్స్ రాబడులు 1020 కోట్లు




**ముంబయి, ఏప్రిల్ 18:** జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ నాలుగోత్రైమాసికంలో 14శాతం నికరలాభాలు తగ్గాయి. లాభాలు మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.272.2 కోట్లుగా ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. గత ఏడాది ఇదేకాలంలో కంపెనీకి రూ.316 కోట్లు లాభాలు వచ్చాయి. మొత్తం ఆదాయం కూడా 1020 కోట్లుగా ఉంది. అయితే గత ఏడాది వచ్చిన రాబడులు 518 కోట్లకు రెట్టింపుస్థాయిలో రాబడులు వచ్చాయి. మొత్తంవ్యయం మాత్రం 169కోట్లనుంచి ఒక్కసారిగా 720కోట్లకుపెరిగింది. ప్రతి ఈక్విటీ వాటాకు రూ.0.60 చొప్పున డివిడెండ్‌ప్రకటించింది. గ్రూపు చీఫ్ ఫైనాన్షియల్ అధికారిగా అన్నపూర్ణ వెంకటరమణన్‌ను నియమించింది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు రూ.243.95 వద్ద వారాంతంలో కొనసాగాయి. మొత్తం నిర్వహణ రుణ ఆస్తుల విలువలు రూ.25 వేల కోట్లుగా ఉన్నాయి. జియో పేమెంట్ సొల్యూషన్స్ మొత్తం చెల్లింపుల విలువలు రూ.50వేల కోట్లుగా ఈ ఏడాదిలోనమోదయ్యాయి. జియోఫైనాన్స్ యాప్‌లో 23 మిలియన్లమంది వినియోగదారులున్నారు. బిజినెస్‌ద్వారా రూ.1390 కోట్లు ఆర్జించింది. 54శాతం నికర ఆదాయాల్లో వృద్ధినమోదుచేసింది. దేశంలోమొత్తం 19వేల పిన్‌కోడ్‌ప్రాంతాలకు తమ సేవలు అందుతున్నట్లు ఎండి సిఇఒ హితేష్ సేథియా వెల్లడించారు. జియో పేమెంట్స్ బ్యాంకు డిపాజిట్‌బేస్ 544 కోట్లుగా ఉంది. 84శాతం వార్షిక వృద్ధిని సాధించింది.

# మెటాలో 8 వేల మందికి ఉద్వాసన

**శాన్‌ఫ్రాన్సిస్కో, ఏప్రిల్ 18:** ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా మరోసారి భారీ ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది చేపట్టనున్న తొలగింపుల ప్రక్రియలో భాగంగా తొలి విడత లేఆఫ్స్‌ను మే 20న నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ మొదటి రౌండ్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 10 శాతం అంటే దాదాపు ఎనిమిదివేల మంది ఉద్యోగులను తొలగించనున్నారని తెలుస్తోంది. కంపెనీ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై వందల బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెడుతున్నారు. ఏఐ ఆధారంగా కంపెనీ పనితీరును సమూలంగా మార్చాలన్న ఆయన వ్యూహంలో భాగంగానే ఈ లేఆఫ్స్ చోటుచేసుకుంటున్నాయి. ఏఐ సాయంతో తక్కువ మంది ఉద్యోగులతో ముఖ్యంగా మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించి, అధిక సామర్థం సాధించాలని కంపెనీ భావిస్తోంది.

# గ్లోబల్ మార్కెట్‌లో టెక్కీల కలవరం

## ఐదేళ్లలో 10 లక్షల మందికి ఉద్వాసన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** గ్లోబల్ టెక్ మార్కెట్‌లో లేఆఫ్స్ కలకలం రేపుతోంది. మల్టీనేషనల్ కంపెనీ ఒరాకిల్ ఏకంగా 25వేలమంది ఉద్యోగులను తొలగించడం ఆందోళన కలిగించింది. భారత్‌లోనే 12వేల మంది బాధితులు ఉన్నారు. ఈక్రమంలో ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్ తాజా నివేదిక ఐటీ నిపుణులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. తాజా నివేదిక ప్రకారం 2021 నుంచి ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో సుమారు 10 లక్షల మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయారు. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలోనే 80వేల మందిని కంపెనీలు ఇంటికి పంపాయి. 2026 చివరి నాటికి ఈ సంఖ్య 3 లక్షలు దాటే అవకాశం ఉందని ఒక అంచనా. ఒరాకిల్ 25వేలమందికిపైగాఉద్యోగుల తొలగించగా, అమెజాన్ దాదాపు 16వేల మందికి ఉద్వాసన పలికింది. ఇక మెటా విషయానికి వస్తే ఈ కంపెనీ సుమారు 2400 మందికిపైగా తొలగించింది. ఈ మొత్తం లేఆఫ్స్‌లో 61వేలకు పైగా ఉద్యోగాలు అమెరికాలోనే పోయాయి. అమెరికా వెలుపల ఆస్ట్రేలియాలో 4,450,భారత్ 2,000 పైగా, ఉద్యోగాల కోతను ఎదుర్కొన్నాయి. ప్రధానంగా క్లౌడ్ కంప్యూటింగ్, సాఫ్ట్‌వేర్‌యాజ్‌ఏసర్వీస్ రంగాల్లో 28 వేలమంది, ఈకామర్స్ రంగంలో 19వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు.




ఈ భారీ లేఆఫ్స్‌కు కృత్రిమమేథ కారణమని నిపుణులు అంచనావేస్తున్నారు. 2026లో జరిగిన లేఆఫ్స్‌లో సగం ఎఐ, ఆటోమేషన్ వల్లే జరిగాయని నివేదికలు వచ్చాయి. కంపెనీలు లాభాల్లో ఉన్నప్పటికీ, భవిష్యత్తులో ఎఐపై పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ఖర్చులను తగ్గించుకోవడమే లక్ష్యంగా లేఆఫ్ నిర్ణయాలు తీసుకుంటున్నాయని విశ్లేషకులు అంచనా. ప్రముఖ ఐటీ నిపుణుల అభిప్రాయాలు చూస్తే ఉద్యోగులు, కంపెనీలు ఎఐ ప్రభావాన్ని ముందుగానే గుర్తించడంలో విఫలమయ్యారని అన్నారు. కేవలం మల్టీ టాస్కింగ్ మాత్రమే సరిపోదు. ఐటీ నిపుణులు కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం పై దృష్టి పెట్టాలని సూచించారు. కంపెనీలు భారీ లాభాల్లో ఉండి కూడా ఉద్యోగులను తొలగించడంపై ఉద్యోగ సంఘాలు తీవ్రనిరసన వ్యక్తంచేస్తు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్‌చేస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14